
ప్రజలే ప్రభువులు

# జనబలం

సెప్టెంబర్ 2023 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-




## స్వతంత్ర భారతం – భవిష్యత్ భారతం..
## రాజకీయం, ఎన్నికలు, ప్రజాస్వామ్యం




## పటిష్ఠ ఫ్యామిలీ డాక్టర్ల వ్యవస్థకి సమయమిది

## అనాలోచిత, రైతు వ్యతిరేక విధానాలు

## సహకార రంగం మన ఉమ్మడి భవిష్యత్తుకి కీలకం

## GHMC పరిధిలో మెట్రో విస్తరణ అవసరం.. జన సమ్మర్ధం లేని ఔటర్ చుట్టూ మాత్రం వృధా వ్యయం








## జాబిల్లిపై జయకేతనం - ప్రభుత్వ పనితీరును మెరుగుపరచుకునే అవకాశం

చంద్రయాన్-3 అద్భుత విజయం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, వారి బృందం కులం, మతం, ప్రాంతం, భాషలతో సంబంధం లేకుండా భారతీయులందర్నీ సగర్వంగా తలెత్తుకునేలా చేశారని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అభినందించారు. చంద్రయాన్-2 వైఫల్యం నుంచి నేర్చుకుని పద్ధతుల్ని మార్చుకుని నభూతో విజయాన్ని సాధించారన్నారు. భారతదేశం ఇలాంటి సందర్భాల్ని గత 75 ఏళ్లలో ఎక్కువ చూడలేదని, ఇక ముందు తరచూ ఇలాంటి రోజులు రావటానికి మనం సరైన కృషి చేయాలన్నారు. అతి తక్కువ ఖర్చుతో ఇస్రో ప్రపంచస్థాయి విజయాల్ని సాధిస్తుంటే, మన దేశంలోని పలు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రపంచంలోని గణనీయ దేశాలన్నిటికన్నా అధ్వాన్న సేవలు అందిస్తున్నాయన్నారు. 49 పెద్ద దేశాలలో మనం అన్ని కీలక రంగాల్లో చివరి నాలుగైదు స్థానాల్లో పాకిస్థాన్, బంగ్లాదేశ్, నైజీరియాతో పోటీపడుతున్నామన్నారు. అంబరాన్నంటిన ఈ సంబర సమయం మనలో ఆ లోతైన ఆలోచన కూడా కలిగించాలన్నారు. సమర్థ నాయకత్వాన్ని ఎంపిక చేసి, నిర్దిష్ట లక్ష్యాల్ని నిర్దేశించి, జవాబుదారీతనాన్ని ఏర్పరచి రోజువారీ జోక్యం లేకుండా ప్రభుత్వం పర్యవేక్షణకు పరిమితమయ్యే ఎగ్జిక్యూటివ్ ఏజన్సీ నమూనాలో ఇస్రో లాంటి సంస్థలు విజయవంతమయ్యాయని, రోజువారీ జీవితంలో మనల్ని రకరకాలుగా వేధించే ప్రభుత్వ యంత్రాంగం కూడా ఎన్నికలు, ప్రకృతి వైపరీత్యాలు వంటి అసాధారణ సందర్భాల్లో గొప్ప సమర్థతతను ప్రదర్శిస్తారని.. అందుకే చంద్రయాన్-3 అద్భుత విజయాన్ని విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, చట్టబద్ధపాలన, ఆర్థిక నిర్వహణ మొదలైన రంగాలలో మన ప్రభుత్వ పనితీరును మెరుగుపరిచేందుకు ఒక పాఠంగా, అవకాశంగా కూడా తీసుకుందామని జేపీ పేర్కొన్నారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 25 సంచిక 9

సెప్టెంబర్ 2023


**సంపాదకవర్గం**

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

**వర్కింగ్ ఎడిటర్**

దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్ట్స్, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# జమిలి ఎన్నికలు చాలవు ! మౌలిక సంస్కరణలు కావాలి!

సంపాదకీయం

భారతీయ జనతాపార్టీ జమిలి ఎన్నికల అవసరం గురించి చాలాకాలంగా మాట్లాడుతున్న విషయం తెలిసిందే. తాజాగా జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై చర్చించడానికి పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేయడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశం అయ్యింది. అయితే ఆ కమిటీ పని ప్రారంభం కాకముందే ప్రధాన ప్రతిపక్ష పార్టీనేత కమిటీలో తాము ఉండబోవడం లేదని చెప్పేశారు. దాంతో కమిటీ పనితీరు సందేహాస్పదం అయికూచుంది.

నిజానికి జమిలి ఎన్నికలు మనదేశానికి కొత్తవికావు. **1952** నుండి **1967** వరకూ మనదేశంలో జమిలి ఎన్నికలే జరిగాయి. అయితే రాష్ట్రాల శాసనసభల్లో అనిశ్చిత రాజకీయ పరిస్థితులు ఏర్పడి సంకీర్ణప్రభుత్వాలు కూలిపోవడం, కొన్ని రాష్ట్రాలలో రాష్ట్రపతిపాలన రావడం, **1971**లో లోక్‌సభ కు ముందస్తు ఎన్నికలు రావడం వల్ల జమిలి ఎన్నికల విధానం ఆచరణ సాధ్యం కాకుండా పోయింది. గత యాభై ఏళ్లుగా లోక్‌సభకు చాలా రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు వేర్వేరుగానే సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, వంటి కొన్ని రాష్ట్రాలకు మాత్రం జమిలి ఎన్నికలు కొనసాగుతున్నాయి. బీజేపీ అధికారంలోకి వచ్చాక జమిలి ఎన్నికలపై తరచూ మాట్లాడుతూనే ఉంది. ఆమధ్య నీతిఆయోగ్ జమిలి ఎన్నికలపై ఒక చర్చాపత్రాన్ని రూపొందించింది.

ప్రస్తుత ఎన్నికల్లో తలెత్తుతున్న కొన్ని సమస్యలకు పరిష్కారంగా జమిలి ఎన్నికలు అవసరమని ఆ పత్రం పేర్కొన్నది. ఎన్నికల రోజుల్లో అమల్లో ఉండే ప్రవర్తనా నియమావళి వల్ల అభివృద్ధి కార్యక్రమాల అమలు నిలిచి పోతుందనే అభిప్రాయాన్ని ఆ పత్రం ప్రధానంగా ప్రస్తావించింది. ఎన్నికలు వేర్వేరుగా జరిగితే ఎన్నికల కోసం ప్రభుత్వం చేసే ప్రత్యక్ష వ్యయం పెరుగుతోందంటూ మరో అభిప్రాయాన్ని ఆ పత్రం పేర్కొన్నది. అలాగే రాజకీయపార్టీలు చేసే పరోక్ష వ్యయం కూడా పెరుగుతున్నదనే భావాన్ని ఆ పత్రం వ్యక్తం చేసింది. అన్ని ఎన్నికలు ఒకేసారి జరిపితే ప్రత్యక్ష వ్యయం సుమారు **2000** కోట్ల రూపాయల సొమ్ము ఆదా చేయవచ్చని పేర్కొన్నది.

ఎన్నికల విధుల వల్ల అధికార యంత్రాంగం, భద్రతాదళాలు చేసే రోజువారీ పనులకు ఆటంకం కలుగుతుందని కూడా ఒక అభిప్రాయం వ్యక్తం అయ్యింది. నీతిఆయోగ్ తన చర్చాపత్రంలో ప్రస్తావించిన అంశాలనే అధికారపార్టీ పెద్దలుకూడా వేర్వేరు సందర్భాల్లో మాట్లాడుతూ వచ్చారు. అయితే ఆ చర్చాపత్రంలోని అంశాలు ఎన్నికల వ్యవస్థలోని మౌలిక సమస్యల జోలికి పోకుండా పైపై నామమాత్రపు మార్పుల గురించి మాత్రమే మాట్లాడింది.

ప్రభుత్వానికి నిజంగా ఎన్నికల వ్యవస్థను మార్చాలని ఉంటే జమిలి ఎన్నికలవంటి ప్రయోజన రహితమైన ఆలోచన కాకుండా లోతైన సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. ఎన్నికలకోసం ప్రభుత్వం చేసే వ్యయం గురించి చేసిన వాదనలో నిజానికి పసలేదు. ఒకేసారి ఎన్నికలు జరిపినా, వేర్వేరుగా ఎన్నికలు జరిపినా మొత్తం అన్ని ఎన్నికలకి కలిపినా ప్రభుత్వవ్యయం ఐదేళ్ళలో **15** వేల కోట్ల రూపాయలకు మించదు. ఇంత పెద్ద ప్రజాస్వామిక దేశంలో ఎన్నికల కోసం ఒక్కో పౌరుని మీద ఐదేళ్ళలో ఒక వందరూపాయలు ఖర్చు చేయడాన్ని అధికవ్యయం అని చెప్పడం అర్థరహితం. మొత్తంగా ఎన్నికల్లో అపారమైన ప్రభావం చూపుతున్న ధనబలం గురించి మాట్లాడకుండా ప్రభుత్వం చేసే కొద్దిపాటి వ్యయం గురించి మాట్లాడ్డం చూస్తే జమిలి ఎన్నికల ఆలోచనలో ఉన్న పరిమితి తేటతెల్లం అవుతుంది.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు వల్ల అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతాయనే అభిప్రాయం కూడా బొత్తిగా అర్థరహితం. ఎన్నికలు ప్రకటించి ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చాక కొత్తగా అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించగూడదని తప్ప అమల్లో ఉన్నవి నిలిచి పోవాల్సిన అవసరం లేదని నియమావళి స్పష్టంగా పేర్కొంటుంది. అధికార యంత్రాంగంలో, ఉద్యోగ వర్గంలో పేరుకుపోయిన బాధ్యతారాహిత్యం, జవాబుదారీతనం లేకపోవడం గురించి మాట్లాడే బదులు వారి విధులకు అవరోధం అంటూ ఎన్నికలను బూచిగా చూపడం దివాళాకోరు వాదన. జమిలి ఎన్నికల అవసరం ఉందని మాట్లాడేవారు అందుకు సరైన కారణాలను చెప్పలేక పోయారనేది సుస్పష్టం. పైగా జమిలి ఎన్నికలకు వెళ్ళాలంటే ఎదురయ్యే సవాళ్ళ గురించి కూడా వారికి తగిన అవగాహన ఉన్నట్లు కనిపించదు.

**2024** లోగా **12** రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు జరగాల్సి ఉంది. వాటిని లోక్ సభ ఎన్నికలతో కలిపి జరపడానికి ఆయా శాసనసభల పదవీకాలం పొడిగించడమో, కుదించడమో చేయాలి. అలాగే ఎన్నికలు ఇటీవలే జరిగిన శాసనసభల పదవీ కాలాన్ని అర్థాంతరంగా ముగించాలి. దీనికి ఆయా రాష్ట్రాల శాసనసభలు ఆమోదం తెలిపాలి. అందుకు దేశంలో విస్తృతమైన ఏకాభిప్రాయం అవసరం. పార్లమెంట్ ఆమోదం తెలిపినా దేశంలో సగానికి పైగా శాసనసభల ఆమోదం ఇవ్వాల్సి ఉంటుంది. పెద్దగా మార్పులు చేర్పులు తేలేని అంశంపై కష్టపడి ఏకాభిప్రాయం సాధించడం వృధా కాలక్షేపం అవుతుంది.

కేంద్రప్రభుత్వం బలవంతంగా జమిలి ఎన్నికలను తెచ్చినా భవిష్యత్తులో అది స్థిరంగా నిలిచే అవకాశం ఉండదు. రాష్ట్రాలలో సంకీర్ణ ప్రభుత్వాలు అస్థిరతకు గురైనా, పాలకపక్షంలో తిరుగుబాట్లు వచ్చినా, లోక్‌సభలో అవిశ్వాసం గెలిచినా మరలా ఎన్నికలకు పోవాల్సి వస్తుంది. దాంతో ఆశించిన ప్రయోజనం నెరవేరదు. ఎన్నో జాతీయ, ప్రాంతీయ, స్థానిక రాజకీయపక్షాలు, వైవిధ్య భరితమైన ఆకాంక్షలు, డిమాండ్లతో నిండిన భారతీయ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల స్థిరత్వం అంటే ఏకపక్ష పాలనగా, ఒక్కోసారి నియంతృత్వంగా తయారవుతుంది.

భారతీయ ప్రజలు దీన్ని ఎంతమాత్రమూ సహించే పరిస్థితి ఉండదు. జమిలి ఎన్నికల వల్ల కేంద్రంలో ఉన్న పాలకపక్షం లబ్ది పొందుతుందనే అంచనాతో బీజేపీ ఉత్సాహం చూపినా మిగిలినపక్షాలు అందుకు సుముఖంగా ఉండవు. జమిలి ఎన్నికలతో రాజకీయంగా ఎవరు లబ్ది పొందుతారనే అంశం కంటే అందులో ఆలోచించాల్సిన పలు సమస్యలు ఉన్నాయి. రాజ్యాంగంలో జాతీయ, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల మధ్య అధికార విభజన, విధుల , బాధ్యతల వికేంద్రీకరణ స్పష్టంగా ఉన్నాయి. ఓటింగు సమయంలో ప్రజలు ఆయా అంశాల ఆధారంగా తమ అభ్యర్థిని ఎంపిక చేసుకునే అవకాశం ప్రస్తుతం ఉంది. జమిలి ఎన్నికలు వస్తే రాష్ట్రస్థాయి, స్థానిక, అంశాలకు ప్రాముఖ్యం లేకుండా పోతుంది. అధికార విభజన ఇచ్చిన బాధ్యతల గురించిన ప్రస్తావన మరుగున పడుతుంది. జాతీయస్థాయి జనాకర్షక నేతల ముఖంచూసి స్థానిక అభ్యర్థులను ఎన్నుకునే ఒక మూకుమ్మడి మందధోరణి వచ్చి కూర్చుంటుంది. రాజ్యాంగం కల్పించిన అధికార విభజన ఉద్దేశ్యమే దెబ్బ తింటుంది.

ఒక్క ఓటు ఆధిక్యతతో నైనా గెలుపొందిన వారు అధికారంలోకి వచ్చే "ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్" పద్ధతి మన ఎన్నికల వ్యవస్థలోని సకల దుర్లక్షణాలకు అసలు మూలం. ధనబలం, కండబలం, ఓట్లకు ఎరవేసే అనుచిత ఉచితాలు, ఓట్లను పెద్దఎత్తున కొనుగోలు చేయడం, కుల మత ప్రాంతీయ భావోద్వేగాలు రెచ్చగొట్టడం, ప్రజల్లో విద్వేషాన్ని నింపడం, పార్టీ ఫిరాయింపుల ద్వారా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడం, వంటి దుర్మార్గాలు లేకుండా ఎన్నికలు నిర్వహించడం అసలైన సంస్కరణ అవుతుంది. దానికి జమిలి ఎన్నికలు పరిష్కారం చూపలేవు.

మన ఎన్నికల వ్యవస్థలోని లోపాలను పరిహరించడానికి దేశంలో దామాషా ప్రాతినిధ్య ఎన్నికల పద్ధతి తేవడం ఒక్కటే విరుగుడు. ఓట్లశాతాన్ని బట్టి చట్టసభలో స్థానాలు పొందే అత్యంత ప్రజాస్వామికమైన విధానం అమల్లోకి వస్తుంది. అన్ని రాజకీయ పార్టీలకు తమ తమ బలానికి తగిన ప్రాతినిధ్యం లభిస్తుంది. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, నిధులను, విధులను బదిలీ చేసి స్థానిక ప్రభుత్వాలను పటిష్టం చేయడానికి మార్గం సుగమం అవుతుంది. ప్రస్తుతం రాష్ట్రాల్లో ఎమ్మెల్యేల చుట్టూ పోగుపడిన విశేష అధికారాల బారినుండి జిల్లా, స్థానిక, ప్రభుత్వాలను కాపాడటం వీలు అవుతుంది. జమిలి ఎన్నికల పేరుతో ప్రస్తుతం ప్రారంభమైన ప్రయత్నంలో భాగంగానైనా కీలక అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అందుకు అవసరమైన సంస్కరణలు తేవాల్సిన తరుణం ఆసన్నమయింది. "ఒకే దేశం – ఒకే ఎన్నికలు" వంటి నినాదాలు భావోద్వేగాలు రేకెత్తించడానికి మాత్రమే పనికి వస్తాయి. వ్యవస్థలోని సమస్యలకు మౌలిక పరిష్కారం తేలేని జమిలి ఎన్నికలపై చర్చ కేంద్రీకరించడం కంటే ఎన్నికల సంస్కరణలపై అర్థవంతమైన చర్చ జరపడం తక్షణ అవసరం.

డి. సోమ సుందర్

# అనాలోచిత, రైతు వ్యతిరేక విధానాలు

## డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

బియ్యం ఎగుమతులపై యూనియన్ ప్రభుత్వం ఇటీవల నిషేధం ప్రకటించింది. అంతకుముందు, ఉక్రెయిన్‌పై రష్యా ఆక్రమణ నేపథ్యంలో వంటనూనెల దిగుమతులపై సుంకం/సెస్/సర్‌ఛార్జిలను ఒక్కసారిగా 5.5 శాతానికి తగ్గించింది. సరఫరా మళ్లీ సాధారణ స్థితికి చేరినా, అంతర్జాతీయంగా వంటనూనెల ధరలు తగ్గి స్థిరంగా కొనసాగుతున్నా దిగుమతి సుంకాన్ని మాత్రం పునరుద్ధరించలేదు.



మన దేశంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వాలు తాత్కాలిక విధానాలు, అపసవ్య పద్ధతులతో వ్యవసాయంతో చెలగాటమాడుతున్నాయనటానికి ఇవి రెండూ స్పష్టమైన ఉదాహరణలు. బియ్యం ఎగుమతుల నిషేధం చూడండి. దేశం లోపల రాష్ట్రాల మధ్య కూడా బియ్యం అమ్ముకోవటానికి వీల్లేదంటూ దశాబ్దాలపాటు నిషేధించారు, నియంత్రించారు. మన తెలుగునాటే గొప్ప ఉదాహరణ ఉంది. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బియ్యం నిల్వలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. బీపీటీ రకం ధాన్యం 74 కిలోల బస్తా రూ.750 అమ్ముతోంది. అదేసమయంలో, పొరుగున కర్ణాటక, మహారాష్ట్రలలో కొరత ఉంది. అక్కడ ధాన్యం బస్తా రూ.1200 ఉంది. అయినా ధాన్యం ఆ రాష్ట్రాలకు తీసుకెళ్లకూడదు, అమ్ముకోకూడదు అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఏపీలోని రైతులు, పక్కరాష్ట్రాల్లోని వినియోగదారులు నష్టపోతున్నా సర్కారుకు పట్టలేదు. అప్పుడు లోక్‌సత్తా ఉద్యమం అన్ని వర్గాల రైతులనూ సమీకరించి, పాదయాత్రలు చేసి, నియంత్రణ ఉత్తర్వుల్ని ధిక్కరిస్తూ బియ్యం మూటల్ని పక్క రాష్ట్రాలకు తీసుకెళ్లి అమ్మింది. చేతనైతే అరెస్టు చేయాలని సవాలు చేసింది. కానీ ప్రభుత్వం ఆ సాహసం చేయలేకపోయింది. ప్రభుత్వ నిర్వాకం పట్ల ప్రజల్లో వ్యతిరేకత రావటం, ఆంక్షలు అన్యాయం, అర్థరహితమని బయటపడటంతో ప్రభుత్వం తన ఆంక్షల్ని తానే బేఖాతరు చేయక తప్పలేదు. రోజుల వ్యవధిలోనే అన్ని రాష్ట్రాల్లో ధరలు సమానమయ్యాయి. కేవలం ఒక్క సీజన్‌లో ఒక్క పంటలో ఒక్క వెరైటీలో స్వేచ్ఛావాణిజ్యం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు రూ.3600 కోట్ల మేర లాభం కలిగింది. అనుచితమైన, అన్యాయం, అసంబద్ధమైన ప్రభుత్వ నియంత్రణల వల్ల రైతులు అంతగా నష్టపోతున్నారు.




ఆ సమయంలో బాస్మతేతర బియ్యం ఎగుమతిపై యూనియన్ ప్రభుత్వ నిషేధం అమలులో ఉంది. ప్రపంచంలోనే అత్యధికంగా మన వద్ద ప్రభుత్వ గోదాముల్లో 8 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు మూలుగుతున్నాయి. అవసరానికి మించి ఉత్పత్తి వల్ల భారత్‌లో ధరలు పడిపోయాయి. అదే సమయంలో విదేశాల్లో కొరతలున్నాయి. ధరలు ఎక్కువున్నాయి. దీంతో, బియ్యం ఎగుమతులపై ఏకాభిప్రాయ సాధనకు లోక్‌సత్తా మళ్లీ రైతుల్ని, ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీల్ని సమీకరించింది. నేను ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ను కలిసి వివరాలన్నీ తెలియచేశాను. ఎగుమతులపై నిషేధానికి సరైన కారణం కూడా లేదని, కానీ ఆ నిర్ణయం వల్ల మన వ్యవసాయం దెబ్బతింటూ ఆదాయాలు కుంగుతున్నాయని యూనియన్ ప్రభుత్వం ఒప్పుకుంది. ఎగుమతులపై నిషేధం ఎత్తివేసింది. అప్పట్నుంచి బియ్యం ఎగుమతుల్లో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో కొనసాగుతూ వచ్చింది.

ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎగుమతులపై నిషేధం విధించాల్సిన అవసరమేమన్నా ముంచుకొచ్చిందా? జులై 1, 2023న భారత ప్రభుత్వ గోదాముల్లోనే 2 కోట్ల 53 లక్షల టన్నుల బియ్యం నిల్వలున్నాయి. నిబంధనల ప్రకారం 1 కోటీ 54 లక్షల టన్నులుంటే చాలు. దేశ అవసరాలకు కొరత లేనప్పుడు, ఎగుమతుల్ని నిషేధించటం మనకు మనమే నష్టం చేసుకోవటం. ఏమాత్రం ఆలోచనలేని చర్య. బియ్యం లాంటి

కుళ్లిపోని, నిల్వ ఉండే పంటల్లో స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుమతిస్తే ధరలు సమానమై రైతులు లాభపడతారు. భారతీయ వ్యవసాయం దీర్ఘకాలంగా సంక్షోభంలో ఉంది. ప్రజల్లో 45% మంది ఇప్పటికీ జీవనోపాధి కోసం వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. కానీ జాతీయాదాయంలో వ్యవసాయం వాటా కేవలం 15%. వ్యవసాయ రంగంలో ఉన్నవారి తలసరి ఆదాయం వ్యవసాయేతర రంగాల్లోనివారి తలసరి ఆదాయంలో 22% మాత్రమేనని చెప్పటానికి పెద్ద పరిజ్ఞానం అక్కర్లేదు. రైతుల ఆదాయాలు పెంచటానికి మనం ఎంత చెయ్యగలమో అంతా చేయాలి; దానర్థం, మంచి ధర వచ్చే విధానాల్ని అమలు చేయాలి! ఇంగితజ్ఞానానికి అర్థమయ్యే విషయమిది.

ఎగుమతుల నిషేధం వల్ల ఇతరత్రా రూపాల్లో కూడా మనం ప్రపంచ మార్కెట్‌లో నష్టపోతాం. ఒక్కసారి అంతర్జాతీయ వాణిజ్యం నుంచి మనం వైదొలిగితే, మళ్లీ ప్రవేశించినప్పుడు మన ఉత్పత్తులకు మార్కెట్లు వెతుక్కోవటం కష్టమవుతుంది. వ్యాపారులు సరఫరా గొలుసుల్లో స్థిరత్వాన్ని చూస్తారు. మన సరఫరాలు నిలకడగా లేకుంటే, మన ఎగుమతిదారులు, రైతులకు తక్కువ ధరలే దక్కుతాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు వ్యవసాయ ఎగుమతుల్ని పెంచేందుకు, దిగుమతుల్ని తగ్గించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తుంటాయి. వ్యవసాయం ఎప్పుడూ సంక్లిష్టమైన, అనిశ్చితమైన వృత్తి. కాబట్టి, ప్రభుత్వ విధానాలు ఎప్పుడూ ఆదాయాన్ని పరిరక్షించేలా, తగిన జాగ్రత్తలు, జాగురూకతతో ఉండాలి.

వ్యవసాయానికి సబ్సిడీలు అవసరం. కానీ రైతులకు చేసే అత్యుత్తమ సాయం వారికి న్యాయమైన, స్థిరమైన మార్కెట్ ధరలు లభించేలా చేయటం. మంచి ఆదాయాన్ని మించిన సబ్సిడీ ఉండదు. యూనియన్ ప్రభుత్వం వ్యవసాయానికి ఏటా రూ.6,00,000 కోట్ల దాకా సబ్సిడీలు ఇస్తోంది. రాష్ట్రాలు ఉచిత విద్యుత్, సాగునీరు, ఇతర రూపాల్లో మరో రూ.3,00,000 కోట్లు రాయితీలు ఇస్తున్నాయి. కానీ అవి కంటితుడుపు చర్యలుగానే మిగులుతున్నాయి తప్ప రైతుల బతుకులు మాత్రం బాగుపడటం లేదు. దీనికి కారణం మన ప్రభుత్వాల ముందుచూపులేని, అనాలోచిత విధానాలు, ధోరణులు.

నూనెగింజల విషయానికొస్తే, మన దేశంలో సుమారు 20% మంది రైతులు 2.7 కోట్ల హెక్టార్ల భూమిలో సాగు చేస్తున్నారు. కానీ ఉత్పాదకత తక్కువ, ఉత్పత్తి వ్యయం ఎక్కువ. మనకు భారీ కొరతలున్నాయి. భారతదేశం వంటనూనెల్లో ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారు. గత సంవత్సరం రూ.1,51,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యం చెల్లించి 1.6 కోట్ల టన్నుల వంటనూనె దిగుమతి చేసుకున్నాం. అయ్యా, ఆ చౌక దిగుమతుల మీద కాస్త హేతుబద్ధ సుంకం వేయండి, భారతీయ రైతు ప్రపంచ మార్కెట్‌లో పోటీపడే వెసులుబాటు కల్పించండి.. అని నాలాంటివాళ్లం ఏళ్ల తరబడి ప్రభుత్వాలను పోరాం. మన రైతులకు గనక సరైన ధర, సాంకేతికతను ఇస్తే, కొద్దికాలంలోనే మన దేశ అవసరాలకు తగ్గ ఉత్పత్తిని సాధించగలరు. మన



ఆహారంలో ప్రధానావసరమైన పంటకి దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా చేస్తారు. కొన్నేళ్లపాటు అదేపనిగా పోరాడగా, వంటనూనెపై ప్రభుత్వం దిగుమతి సుంకం విధించింది. ఆ సుంకం కూడా నిలకడగా లేదు. 44% నుంచి 27% మధ్య ఊగిసలాడింది. ఉక్రెయిన్‌పై రష్యా ఆక్రమణ తర్వాత, ప్రపంచవ్యాప్తంగా వంటనూనె ధరలు పెరిగాయి. వినియోగదారులకు ధరలు తగ్గించాలని దిగుమతి సుంకం తొలగించారు. నామమాత్రంగా 5.5% సెస్, సర్‌ఛార్జితో సరిపెట్టారు. ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌లో వంటనూనె ధరల్లో ఎటువంటి సంక్షోభం లేదు. సరఫరా గొలుసుల పునరుద్ధరణతో ధరలు పాత స్థాయికి, ఇంకా తక్కువకు వచ్చేశాయి. హెచ్చుతగ్గులు లేకుండా కొనసాగుతున్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం దిగుమతి సుంకం పునరుద్ధరించలేదు. వచ్చే ఏడాది చూద్దామంటూ వాయిదా వేసింది. దీంతో, రైతుల ఆదాయం పడిపోయింది. పామోలిన్ నూనెకు ముడిసరుకైన పామ్ పండ్ల ధరలు గతేడాదితో పోలిస్తే 40–50% మేర పడిపోయాయి. నిరుడు కిలోకి 23 రూపాయిలు పలికిన పామోలిన్ పండ్ల ధర ఇప్పుడు 13 రూపాయిలకి పడిపోయింది. రైతుకొచ్చే నికర ఆదాయం 80–90% దాకా కోసుకుపోయింది.

దీర్ఘకాలంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ ఆదాయాలు కొరవడిన వ్యవసాయరంగంలో లోతైన ఆలోచన లేకుండా ప్రభుత్వాలు అనుసరిస్తున్న మూర్ఖపు, నిర్లక్ష్యపూరిత వాణిజ్య విధానాలు అపార నష్టం కలగచేస్తున్నాయి. ఒకవంక ఎగుమతుల్ని నిషేధిస్తూ మన రైతులు ప్రపంచ మార్కెట్ ధరల వల్ల లాభపడకుండా చేస్తున్నారు; మరోవంక దిగుమతి సుంకాల్ని తగ్గిస్తూ మన రైతులు ప్రతికూల పోటీలో నష్టపోక తప్పని పరిస్థితి కల్పిస్తున్నారు. మన రైతుల్ని తరచూ నష్టపరుస్తున్నది ప్రకృతి వైపరీత్యాలు కాదు, ప్రభుత్వాల అనాలోచిత, తాత్కాలిక విధానాలు.

# రాజకీయాలు, ఎన్నికలు, ప్రజాస్వామ్యం

**భారత 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వతంత్ర భారతం - భవిష్యత్ భారతంపై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) కార్యాలయంలో జరిగిన ప్రత్యేక ఇంటర్వ్యూ చర్చా కార్యక్రమంలో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, రిటైర్డ్ ఐపీఎస్, బహుజన్ సమాజ్‌పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. చర్చకు మెయిన్‌థీమ్ భారతదేశ నిర్మాణం. డిస్కషన్‌ని మూడు భాగాలుగా సెగ్మెంట్ చేశారు. ప్రతి సెగ్మెంట్‌కి ఒక సబ్ థీమ్. ఈ మూడు విభాగాల చర్చలోని అంశాల్ని స్థూలంగా ఒక్కో సంచికలో ఒకటి చొప్పున జనబలంలో వరుసగా ప్రచురిస్తున్నాం. మొదటి భాగంలోని చర్చాంశం రాజకీయాలు, ఎన్నికలు, ప్రజాస్వామ్యం. ఎఫ్‌డీఆర్ యువ రీసెర్చర్ సుమేధ ఇంటర్వ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు..**




**ప్రశ్న: సర్, టైమింగ్ వేరయినా మీరిద్దరూ ప్రస్తుత వ్యవస్థలో ఒక ప్రత్యామ్నాయాన్ని అందించాలని రాజకీయాల్లోకి ప్రవేశించారు. మన రాజకీయ వ్యవస్థలో ఎన్నో లోపాలున్నాయని మీకు తెలుసు. కానీ రాజకీయం లేకుండా ప్రజాస్వామ్యం నడవటం సాధ్యం కాదు. కానీ ఈవేళ రాజకీయాన్ని చూస్తే, సమాజాన్ని కులం, మతం వంటి వాటి ఆధారంగా విడదీయటం సాధారణ మైపోయింది. ప్రజల్ని మొబిలైజ్ చేయాలి అంటే చిచ్చుపెట్టటం ఒక మార్గమైంది. ఇలాంటి విధానాలు, ధోరణులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి సమస్యలను ఎలా ఎదుర్కోవాలి?**

**ఆర్ఎస్‌పీ:** కులాలు, మతాలు వాటి పేరు మీద సమాజాన్ని విడదీయటం దురదృష్టకరం. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాల సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్నాం. అదే ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కాలంలో ఈరోజు హర్యానాలోని నూహ్‌లో మత ఘర్షణలు జరిగాయి. ఈ దేశంలో అంతర్భాగమైన మణిపూర్‌లో కుకీలు, మెయితీల మధ్య అంతర్యుద్ధంలాంటి పరిస్థితి వచ్చింది. హర్యానాలో ఓ 50 గ్రామ పంచాయతీలు ముస్లిం మతానికి చెందిన ట్రేడర్స్ మా గ్రామాల్లోకి రావద్దని సామూహిక తీర్మానాలు చేశాయి.. అవన్నీ చాలా బాధకలిగించే అంశాలు. అయితే మనం సామరస్యం కావాలి, రావాలి అని చెప్పటం వరకే చాలదు. నేను అనుకుంటాను, వివిధ మత విశ్వాసాల, సమూహాల ప్రజానీకం మధ్య సంభాషణలు నిరంతరం ఉండాలి. ఇవి ఎంతో ప్రధానం. అయితే వాటికి ప్రజాస్వామిక వేదికలు ఈ దేశంలోగానీ, రాష్ట్రాల్లోగానీ లేవు. ఆ ప్రజాస్వామ్య వేదికల మనుగడ లేకుంటే.. ఈ విడదీయటంలో లబ్ధి పొందే పార్టీలు, శక్తులు ఏవైతే ఉన్నాయో అవి ప్రజల్ని ఎప్పుడూ విభజిస్తూ పోలరైజ్ చేస్తూనే ఉంటాయి. అంటే, రెండు భిన్న ధృవాలుగా సమాజాన్ని విడదీస్తున్నాయి. ఆ భిన్న ధృవాల వల్ల వాళ్లకు రాజకీయంగా లబ్ధి కలుగుతుందనేది చాలా క్లియర్‌గా అర్థమవుతోంది. మీరు పొలిటికల్ స్టేజ్ నుంచి బయటికి వచ్చినారంటే మీ భాష ఒకలా ఉంటుంది, పొలిటికల్ స్టేజ్ మీద మీ భాష ఇంకోలా ఉంటుంది. ఆ తేడా గమనించలేని పరిస్థితుల్లో ఈవేళ మన ప్రజానీకం ఉన్నారు. కాబట్టి చాలా కుట్రపూరితంగా, చాలా స్వార్థంతో చేస్తున్న వ్యవహారం. అయితే

దీన్ని ఇంటర్ ఫెయిత్ డైలాగ్, ఇంటర్ కమ్యూనిటీ డైలాగ్.. దీని ద్వారానే మనం పరిష్కరించగలం తప్ప, ఈ కులాలు మారిపోవాలి, మతాలు రూపుమాపబడాలి, కులాలు రూపుమాపబడాలి అనేది సాధ్యం కాని పని. కానీ వాటి మధ్యలో వివక్ష తొలగాలి, వాటి మధ్యలో అంతరాలు తొలగాలి, ఆ కమ్యూనికేషన్ పెరగాలి. ఆ రకంగా సమస్య చాలామేర పరిష్కారమవుతుంది.

**జేపీ:** ముందు ఒకసారి సమాజ స్వరూపాన్ని స్థూలంగా చూద్దాం. కేవలం ప్రతి గ్రామంలో ఉన్న కులవ్యవస్థ కాకపోయినా, ఇంత వైవిధ్యభరిత సమాజం, భాషలు, కులాలు, మతాలు, తెగలు, ఉప కులాలు- ఇంత సంక్లిష్టంగా ఉన్న సమాజం బహుశా ప్రపంచంలో ఎక్కడా లేదు. ఆఫ్రికాలో కొన్ని దేశాల్లో తెగలున్నాయి, చిన్న చిన్న తెగలు. కానీ వీళ్లకు వాళ్లకు సంబంధం లేదు. కాబట్టి ఆధునిక యుగానికి ముందు పెద్ద ప్రయత్నం అక్కడ జరగాల్సిన అవసరం లేదు. మనకు అట్లా కాదు. అందరూ సహజీవనం కొన్ని వేల సంవత్సరాలుగా చేస్తూనే బోలెడన్ని పొరపొచ్చాలున్న సమాజం. ఆ నేపథ్యంలో మన రాజకీయంలో చాలా తప్పులున్నమాట వాస్తవమేగానీ, గత 60-70 ఏళ్లలో చాలా విశిష్టమైన కృషి కూడా జరిగింది సమన్వయం చేయటానికి. ఇన్ని భాషలున్న దేశంలో ఇంత సామరస్యం ప్రపంచంలో మరెక్కడా చూడలేరు. ఇదో మహాద్భుతం. మనమేంటంటే, మన సమస్యల్ని చూస్తాం, సహజంగా వాటి మీద దృష్టి పడుతుంది. కానీ సమస్యల్ని మనం నిలువరించగలిగాం, పరిష్కరించగలిగాం అని మర్చిపోతాం. దాని గూర్చి గుర్తుచేయటం ఇప్పుడు సమస్యలు లేవని చెప్పటం కాదు. ఆత్మవిశ్వాసాన్ని పెంచటం కోసం, నిరాశ వద్దని చెప్పటం కోసం మనం సాధించిన విజయాల్ని గుర్తు చేసుకోవాలి. కాబట్టి భాష విషయంలో కావచ్చు, మతాల విషయంలో మొత్తం మీద సామరస్య కావచ్చు, ఈ దేశంలో రాజ్యాంగ నిర్మాతలు, డా॥ అంబేద్కర్ పుణ్యమా అని తరతరాలుగా వివక్షకు గురైనవారికి ఒక గుర్తింపు ఇవ్వాలి, అవకాశం ఇవ్వాలి అని కనీసం సూత్రప్రాయంగా ఏర్పాటు జరిగింది. వాస్తవంగా చేయలా, దాన్ని తర్వాత మాట్లాడుకుందాం. కానీ కనీసం ఒక జాతిగా, ఒక ఉమ్మడి లక్ష్యంతో, ఒక ఏకాభిప్రాయంతో దానికి ఏర్పాట్లు చేయటం - ఇవి చిన్న విషయాలు కాదు. ఇప్పటికి కూడా, రోజూ ఓట్లు కొని అన్ని రకాల వేషాలు వేస్తున్న రాజకీయంలో సైతం ఎట్లాగొట్లా సమాజంలో సమన్వయం సాధించాలనే ప్రయత్నం కనిపిస్తోంది. ఇది సహజ లక్షణం. వాళ్లలో పెద్ద ఉదాత్తత అక్కర్లా. వాళ్లలో నిజాయతీయో, సద్భావమో ఉండి కాదు. వాళ్ల రాజకీయ మనుగడ కోసం. అందరినీ కలపకపోతే వాళ్లకు మనుగడ ఉండదని ఈ ప్రయత్నం చేస్తున్నారు. అది పాజిటివ్ పార్ట్. కానీ ఏమైందీ! ఎప్పుడు మనం ఈ స్పృహ నుంచి కొంతమేరకైనా బయటపడతాం? ప్రవీణ్ అన్నట్లుగా, మనం ఈవేళ అసలు కులం అన్నది పూర్తిగా మర్చిపోయి, అందరూ కూడా వేర్వేరు కులాల్లోనే పెళ్లి చేసుకుంటే. ఇవన్నీ కాలక్రమేణా జరగొచ్చు. దాని గురించి మనం ఆలోచన పడనక్కర్లా. కనీసం మీ ఇంటికో, మీ పెళ్లికో గనక కులం పరిమితమైతే, అది కూడా పోవాలి యువతరం పూనుకుంటే- తీవ్ర సమస్య కాదు. కానీ మీ వ్యక్తి జీవితానికి ఆటంకం కలిగించే రీతిలో ఈ విభజనలు వచ్చేయటం ఆందోళనకర సమస్య, ఒక తెగ ఇంకొక తెగతో పోరాడుతుందన్న భావం లేకుండా సహజీవనం సాధ్యమైతే అంతవరకూ పౌరసత్వం సాధ్యమవుతుంది. స్వతంత్రం వచ్చాక రాజ్యం ఈ విషయంలో ఎందుకు విఫలం అవుతోందీ? రెండు ప్రధాన కారణాలు నా దృష్టిలో. మొట్టమొదటిది, పనికొచ్చే విద్య లేకుండా పోయింది. ఈవేళ నూటికి 80 మంది పిల్లలకు తమ జీవితాలకు సంబంధించిన విద్య.. అంటే ఏదో పాండిత్యం, అద్భుతమైన సాహిత్యం మాట్లాడటంలా. అసలు తన బతుకు, తనకి సమాజానికి ఉన్న సంబంధాన్ని అన్వేషించటం చేతగాని లోకంలోకి విద్యార్థుల్ని తీసుకెళ్లాం. మన ప్రభుత్వాలు, పార్టీలు చేసిన భయంకరమైన ద్రోహం ఏదన్నా ఉంటే, పేద కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలకి కాస్త లోకజ్ఞానం, బతకగలిగే శక్తి, ఆలోచించే శక్తి అందించకుండా, అందిస్తున్నట్లు నటించి, లక్షల కోట్లు ఖర్చు పెడుతూనే తరతరాలుగా కనిపించని బానిసత్వానికి దారితీశాం. ఎప్పుడైతే ఆలోచించే శక్తి కొరవడిందో, రకరకాల రూపాల్లో మనుషులు తమ ఉనికిని వెతుక్కుంటారు. ఏమీ లేకపోతే సినిమా యాక్టర్ ఫ్యాన్‌లంటారు. మూడంతస్తులు కిందికి దూకి కాళ్లకు ఏమీ దెబ్బతగలకుండా ముష్టిఘాతంతో కొట్టగానే వందమంది కింద పడిపోతే, సినిమా చూసి ఆనందించటం వేరు, టికెట్లిచ్చి వాళ్లని పోషించటం వేరు.. వాళ్ల కోసం జీవితాలనివ్వటం వేరు. అలా తమ జీవితాలను మర్చిపోయి సినిమా హీరోలే సర్వస్వం అనుకునేవాళ్లని లక్షల మందిని తయారుచేశామంటే, ఏ స్థాయిలో ఉంది మన చైతన్యం? విద్య ఉన్నవాడు, తన జీవితం పట్ల స్పృహ ఉన్నవాడు ఆ పని చేస్తాడా? కాబట్టి అక్కడ వైఫల్యం. రెండోది, ప్రజాస్వామ్యం అంటే సంబరంగా జరుపుకుంటున్నాం, జిందాబాద్, ముర్దాబాద్ చెబుతున్నాం, ఓట్లు పండగలా చేసుకుంటున్నాంగానీ ఓటంటే ఏమిటో అర్థం కాని ఒక సమాజాన్ని తయారుచేశాం. దీంతో, ఏమైందీ, నా సాంప్రదాయం, నా కులం ఎలా తగలడ్డా.. నా పిల్లల బతుక్కి, నా కుటుంబం బతుక్కి అవసరమయ్యే నా లాభం ఏమిటి అని ఆలోచించే అవగాహన లేకుండా పోయింది. అది మార్చగల వ్యవస్థ కావాలి. నా పిల్లల శక్తిని ఎవరు బయటపడేట్లు చేస్తారు? వాళ్ల బతుకుల్ని ఎవరు బాగుచేస్తారు? అది ఖరారైన తర్వాత వాళ్ల కులం, మతం చూస్తే చూడవచ్చు. తెలుగోడా, కాదా? ఆంధ్ర వాడా, తెలంగాణ వాడా, ఈ కులం, ఆ కులం అని నాకు పిచ్చి ఉంటే చూడొచ్చు. కానీ ముందు చూసేది, విజ్ఞత ఉంటే, పిల్లల్ని ప్రేమిస్తే, వాళ్ల బతుకుల్ని బాగు చేసే చదువు అందించలరా, లేదా అని. ఎందుకంటే, నా కులం కంటే, నా మతం కంటే, నా ప్రాంతం కంటే నా పిల్లల్ని ప్రేమిస్తున్నా గదా!

ఆ విషయంలో ఎవరికీ అనుమానం లేదు గదా! కాబట్టి ఈ పిల్లల బతుకు బాగుపడాలంటే ఏది మంచిది అని అర్థమయ్యే పరిస్థితి నిర్మాణం చేశారనుకోండి, ఆలోచనాతీరు మారుతుంది. అలాగే హాస్పిటల్‌కి పోతే అక్కడ నా ప్రాణాల్ని కాపాడే డాక్టర్ ఎవరు, బిడ్డ ప్రాణాల్ని కాపాడే డాక్టర్ ఎవరు అని ఆలోచిస్తా. కులం చూడను. పాలిటిక్స్ ఆఫ్ ఇండివిడ్యుయైలేజేషన్ అంటాం. అంటే, నాకు, సమాజానికి, నాకు, రాజ్యానికి సంబంధం ఏమిటి అని అర్థంచేసుకునే వ్యవస్థ స్పష్టంగా వచ్చిందనుకోండి– అప్పుడు కనీసం ప్రజాజీవనంలో, పౌర జీవనంలో కులం స్పృహ తగ్గుతుంది. పోతుందని అనను. కానీ అది నష్టపరచదు. అదసలు లేకుండా చేశాం. అధికారాన్ని పూర్తిగా కేంద్రీకరించి ఒక రాచరిక స్వభావాన్ని పెట్టి, వాడి కాళ్లు పట్టుకోవటం కోసం పౌరసత్వం, వాడ్ని రాజును చేయటం కోసం ఓటు తప్ప, నా జీవితంతో సంబంధంలేని ఓటు ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కులవ్యవస్థని నిర్మూలించలేకపోయాయి, పట్టణీకరణ, ఆధునిక పోకడల వల్ల కొంత కులవ్యవస్థ ప్రభావం తగ్గినా కూడా, ఇది పౌరులకు జరిగిన నష్టం. రెండోపక్క చూడండి. రాజకీయానికి ఏమైంది? ఎప్పుడైతే ప్రజల జీవితాన్ని మార్చే శక్తి రాజకీయానికి ఈ కేంద్రీకృత వ్యవస్థలో లేకుండా పోయిందో అప్పుడు డబ్బే రాజకీయంగా మారింది. ఓట్లు కావాలి గదా. మన ప్రజాస్వామ్యంలో ఎట్లా ఉన్నా, చివరకు ఓట్లు పొందాలి గదా. అది నడుపుతున్నాం గదా. ఏది జరిగినా 5 ఏళ్లకు వెళ్తున్నారు, ఓట్లు వేయించుకుంటున్నారు. ఓట్లు బలవంతంగా వేయించుకోవటం లేదు. ఒకటిరెండు చోట్ల పూర్వం జరిగుండొచ్చుగానీ ఇప్పుడు ఎవరూ బలవంతంగా వేయటంలా. డబ్బులు తీసుకునో, అజ్ఞానం కొద్దీనో, లేకపోతే ఉన్మాదం కొద్దీనో, ఆశ కొద్దీనో స్వచ్ఛందంగా వేస్తున్నారు గానీ బలవంతంగా ఎవరూ వేయటంలా. మరి వాళ్ల ఓట్లు వేయించుకోవాలి గదా. ఓట్లు వేయించుకోవాలంటే రకరకాల విన్యాసాలు కావాలి. వాటిలో చాలా తేలికైనది– అరె, నీ కులంరా, నీ మతంరా, మరోటిరా అనగానే పూనకం వచ్చేస్తుంది. ఐడెంటిటీ పాలిటిక్స్. కాబట్టి దాన్ని మనం మూలాల్లోకి వెళ్లి పరిష్కరించాలి. ప్రవీణ్ చెప్పింది పూర్తిగా వాస్తవం– సమాజంలోనేమో ఈ సయోధ్య కోసం మంచి మనసున్నవాళ్లు కృషి చేయాలి. కానీ 50 ఏళ్ల క్రితం జరిగిన పోరాటం, 75 ఏళ్ల క్రితం జరిగిన పోరాటం తరహాలో ఇప్పుడు ఆ పోరాటం జరగటంలా. కుల నాయకుడిగా ఉన్నవాడు నాయకత్వం కోసం కుల స్పృహను పెంచుతున్నాడేగానీ, సంకుచితత్వాన్ని పెంచుతున్నాడు గానీ పూర్వంలాగా.. ఇతరులను అర్థం చేసుకుందాం, పరస్పరం అందరినీ కలుపుదాం అనుకుంటున్న నాయకత్వం నాకు కనిపించటంలా ఈ సాంప్రదాయ సమాజంలో. కొంతమందున్నారు. కానీ అరుదుగా ఉన్నారు. మతం పేరుతోగాని, కులం పేరుతో గాని. ఆ ప్రయత్నం కొనసాగాలి. కానీ దాంతోపాటు రాజ్యం పాత్ర– ఇటు విద్యలో పెరగాలి, అటు పాలిటిక్స్ ఆఫ్ ఇండివిడ్యుయేషన్– వికేంద్రీకరణ చేసి, నా ఇంటి ఎదురుగా రోడ్డు ఏమిటి, ఈ డ్రెయిన్ సంగతేమిటి? ఇలా నా బతుకును పట్టించుకోవటంలో పెరగాలి. ఆ డ్రెయిన్, రోడ్డు పట్టించుకుంటే నీ కులం, మతం సంగతి ఎందుకొస్తుంది అసలు? ఇక్కడ మంచినీళ్లు నాకు అవసరమైతే, ఈ ఫ్లాట్‌కి మంచినీళ్లు చూసుకుంటానుగానీ, నా కులం నేనెందుకు చూసుకుంటాను?.. అది అర్థం కాని సమాజాన్ని నిర్మాణం చేశాం.

**ఆర్ఎస్‌పీ:** మీరు పర్మిట్ చేస్తే, జేపీ సర్ చెప్పినదానికి ఒకటి యాడ్ చేస్తాను. ఐడెంటిటీ పాలిటిక్స్, అస్తిత్వ రాజకీయాల్ని నెగెటివ్ దృష్టితో కూడా చూడాల్సిన అవసరం లేదు. ఐడెంటిటీ పాలిటిక్స్ ఎందుకొస్తున్నాయంటే, మెయిన్‌స్ట్రీం పాలిటిక్స్, గ్రాండ్ ఓల్డ్ పార్టీలు, స్వతంత్ర ఉద్యమ పునాదుల మీద నిర్మించబడ్డ పార్టీలు ఈ సమాజంలోని బాధితుల్ని సహానుభూతితో పట్టించుకోలేదు. మన దేశం రకరకాల కులాలు, మతాల సమాహారం. ప్రతి కులానికి, మతానికి ఉనికి ఉంది. ఇంతకు ముందు కూడా చెప్పాను– కులాన్ని అంత ఈజీగా నిర్మూలించలేం. అది వాస్తవం. అయితే ఆ కులాల్లో అణచివేతకు గురైనవాళ్లకి కూడా కొన్ని ఆకాంక్షలు ఉంటాయి, వాళ్లకు కూడా సమాజంలో భాగం అనిపించుకోవాలని ఉంటుంది. మేం కూడా ఈ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములం, ఈ ప్రగతిలో మాకు కూడా భాగస్వామ్యం ఉంది, మేం ఎన్ని రోజులని లబ్ధిదారులుగానే ఉండాలి, మమ్మల్ని కూడా గౌరవంగా చూడాలన్న ఆకాంక్షల పట్ల ఎప్పుడూ కూడా ఆ పార్టీలు సహానుభూతితో ఆలోచించలేదు. వాళ్ల వైపు నుంచి ఆలోచించలేదు కాబట్టే మన దేశంలో అకాలీదళ్ లాంటి పార్టీలు, బహుజన సమాజ్, సమాజ్‌వాదీ ఇంకా రకరకాల పార్టీలు వచ్చాయి. అయితే ఈ ఐడెంటిటీ పాలిటిక్స్ లేకపోయి ఉండుంటే, మీరొకసారి చరిత్రను తిరగేస్తే, ఈ వర్గాలకు నిజంగా గుర్తింపు వచ్చుండేదా అంటే.. రాకుండా పోయేది! గొప్ప ఉదాహరణ మండల్ ఆందోళన. సమాజంలో 50% ఉండే ఓబీసీలకు కనీసం ఈ విద్య ఉద్యోగావకాశాల్లో, కేంద్ర స్థాయిలో అవకాశాలు ఉండేవి కావు. రాష్ట్ర ఉద్యోగాల్లో ఎన్‌టీఆర్ వచ్చాక 44% తీసుకొచ్చారు, విప్లవాత్మక చొరవ అది. కానీ కేంద్రంలో 50% ఉండే ఓబీసీలకు కనీసం కొంతన్నా భాగస్వామ్యం ఇవ్వాలి విద్యావకాశాల్లో అనేది ఎప్పుడొచ్చిందంటే.. ఎస్‌పీ, బీఎస్‌పీ, ఇంకా రకరకాల ఐడెంటిటీ పాలిటిక్స్ వచ్చినప్పుడు. ఇంక విధిలేక ఆరోజు వీపీ సింగ్ మండల కమిషన్ రిపోర్టును టేబుల్ మీద పెట్టాడు. పార్లమెంటులో పెట్టాడు. అంతవరకు ఎందుకు పెట్టలేకపోయారు? మండల్ కమిషన్ ఎప్పుడో 1970లలోనే ఏర్పాటు చేశారు. కానీ కాకా కాలేకర్ కమిషన్ గానీ, మండల్ కమిషన్ గానీ వీటి రిపోర్టులేవీ పార్లమెంటులో టేబుల్ చేయలేదు. ఎప్పుడైతే ఈ ఐడెంటిటీ పాలిటిక్స్ వచ్చేసి ఈ సాంప్రదాయ పార్టీల ఓటు బ్యాంకును సవాలు చేశాయో అప్పుడు, అమ్మో, మన చాప కిందుకు నీరొస్తోంది, మనం

అధికారంలోకి రావేమో ఈ వర్గాలను పట్టించుకోకపోతే అని, వారి ఆకాంక్షలను తమ ఎజెండాలోకి తీసుకోవటం మొదలుపెట్టారు. తెలంగాణలో చిన్న ఉదాహరణ. నేను కుందన్‌బాగ్ ఐఏఎస్, ఐపీఎస్ కాలనీలో రిటైరైన వెంటనే పార్కులో నడుస్తుంటే, జర్నలిస్టులు కొంతమంది వచ్చారు. మీకు తెలంగాణలో ఏం అన్యాయం జరిగింది? అన్నారు. నేను చెప్పాను– ముఖ్యమంత్రి కార్యాలయంలో ఒక ఎస్సీ, ఒక బీసీ, ఒక ఎస్టీ, ఒక మైనారిటీ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే అధికారి ఉంటే ఆ వర్గాల ప్రజలు సీఎంకి ఆయన ద్వారా తమ మనసులో మాట చేరవేస్తారు అని. అయిన వారం రోజుల్లో ఎస్సీ వర్గాలకు చెందిన ఒక అధికారిని పెట్టటం జరిగింది. ఈ ఐడెంటిటీ పాలిటిక్స్ లేకపోయి ఉంటే.. ఓట్లప్పుడు డబ్బులివ్వొచ్చు, వీళ్ల ఓట్లను హైజాక్ చేసి తీసుకుపోవచ్చు, ఆ మైండ్స్‌ని హ్యాక్ చేసి ఆ రెండు వారాలు ఓట్లు మన వైపు తిప్పుకోవచ్చు, ఆ తర్వాత మళ్లీ 5 సంవత్సరాలకు వాళ్లకు కన్పించవచ్చు అనే కాన్ఫిడెన్స్ ఈ ట్రెడిషనల్ పార్టీలకు కొనసాగేది. ఐడెంటిటీ పాలిటిక్స్ నుంచి 'ఓట్లు వేయటం మేము, సీట్లలో మాత్రం మీరు కూర్చుంటారా' అన్న ఒక రివల్యూషనరీ థింకింగ్ మన దగ్గర వచ్చింది. ఐడెంటిటీ పాలిటిక్స్‌పై చాలా మంది సోషల్ మీడియా వేదికగా కూడా మా మీద చాలా దాడులు చేస్తుంటారు. ఎన్ని రోజులీ కులపిచ్చి, ఎన్ని రోజులీ మతపిచ్చి అంటుంటారు. ఆరోజు ముస్లిం సమాజం అడగకపోయి ఉన్నట్లయితే రాజేంద్ర సచార్ కమిటీ వచ్చుండేది కాదు. ముస్లిం సమాజంలో పస్మంద ముస్లింలలో, ఇతరత్రా చూసినా వెనకబాటుతనం చాలా ఎక్కువగా ఉంటుంది. చదువు చాలా తక్కువగా ఉంటుంది. వాళ్ల గురించి అంత లోతుగా ఆలోచించి పార్టీలు పట్టించుకోలేదు. అట్లాంటప్పుడే, ఐడెంటిటీ పాలిటిక్స్‌కి ట్రాక్షన్ దొరుకుతుందనుకుంటున్నాను.

**జేపీ:** ప్రవీణ్ అన్న మాట వాస్తవం. మనమేకాదు, చాలా గొప్ప అనుకున్న దేశాల్లో కూడా ఈ ధోరణి కనిపిస్తుంది. అమెరికాను చూడండి.. ఇటాలియన్ అమెరికన్లు, ఐరిష్ అమెరికన్లు, క్యాథలిక్కులు, జర్మన్ అమెరికన్లు, నల్లజాతీయులు, తర్వాత లాటినోలు వాళ్ల ఓటింగ్ ప్రిఫరెన్సెస్ తమ ఐడెంటిటీ కొరకు ఉంటాయి. ప్రపంచంలో ఎక్కడా కూడా మీ మూలాలు, మీ సంస్కృతి, మీ మతం నుంచి రాజకీయాన్ని పూర్తిగా విడదీయలా. రెండోది, అణగారిన వర్గాలున్న, వివక్షకు గురైన సమాజంలో శతాబ్దాలుగా కచ్చితంగా అక్కడ్నుంచి ప్రతిఘటన రావాలంటే, రెండు రకాల ఏర్పాట్లు కావాలి. 1) ప్రాతినిధ్యం, వ్యవస్థలో ఆమోదం. అధికార యంత్రాంగంలో, న్యాయవ్యవస్థలో కావచ్చు, రాజకీయంలో కావచ్చు. రెండు) డిమాండ్స్‌ని, హక్కుల్ని కాపాడటం కోసం. కానీ మన దేశంలో అది దాటివెళ్లింది. కొంచెం పచ్చిగా మాట్లాడతాను. కమ్మ వాళ్లకో పార్టీ, రెడ్డిలకు ఒక పార్టీ, గౌండర్లు ఒక పార్టీ, థేవర్లు ఒక పార్టీ. అక్కడ మీ వివక్ష తొలగించటం కోసం పోరాటం కాదు. ఆధిపత్యం కోసం ఆరాటం. మళ్లీ ఈ కమ్మవాళ్ల పేరుతో ఉన్న పార్టీ.. కొందరు బాధపడతారుగానీ, నేను ఉదాహరణకు చెబుతున్నాను. నిజంగా కమ్మోళ్లంతా కూడా దాని వల్ల బాగుపడితే, కొంతన్నా మేలు జరుగుతుంది. కానీ కమ్మ అన్న పేరును ఉపయోగించి, వీడిలో పూనకం సృష్టించి, వాడ్ని నిచ్చెనమెట్లగా వాడి కొందరి నెత్తినెక్కి తొక్కటానికి ఉపయోగపడుతోంది. అలాగే రెడ్డిలు అనే పార్టీ, రెడ్లందరికీ ఉపయోగం చేస్తే కనీసం ఆ మేరకన్నా ఓకే. కాబట్టి, ఐడెంటిటీ పాలిటిక్స్‌లో రెండు రకాలున్నాయి. ఒకటి, లెజిటమసీ, రిప్రజంటేషన్, వాయిస్. రెండు, అధికార దాహంతో మనలో ఉన్న అమాయకత్వాన్నో, బలహీనతనో ఆసరాగా చేసుకుని ఆ ఫ్యూడల్ పెత్తనం సాధించటం కోసం దీన్ని వాడుకోవటం. మన దేశంలో ఈ రెంటికీ తేడా చెరిగిపోతోంది. ఇతర దేశాల్లో ఐడెంటిటీ పాలిటిక్స్ ఉన్నాయి. కానీ మన దేశంలో, కొన్ని రాష్ట్రాల్లో ముఖ్యంగా చూస్తున్నాం, విచిత్రమైన సమస్య. కొంతమంది చెప్పేది, ఐడెంటిటీ భావం మతపరంగా సమాజంలో భద్రత కలిగిస్తోంది, సాంప్రదాయక బలంలా పనిచేస్తోంది. దాన్లో కూడా కొంత అర్థం ఉండొచ్చు. కానీ కులానికి అతీతమైన భద్రత కల్పించే సమాజ నిర్మాణం చేయాలి. కాలం పట్టినా కూడా. ఆ నిర్మాణం ఒకరోజులో జరగకపోవచ్చు. కానీ ఆ మార్గాన వెళ్లే ప్రయత్నం చేయకుండా దీనికే పట్టుకుకూర్చుంటే, అది సమాజానికి అన్యాయం జరిగినట్లు.

**ప్రశ్న: సర్, ఇప్పుడు మన రాజకీయ వ్యవస్థ ఎదుర్కొంటున్న ఇంకో సవాలు– తాత్కాలిక అవసరాలు, దీర్ఘకాలిక మంచికి మధ్య ఒక సమతూకాన్ని పాటించటంలో మన రాజకీయ పార్టీలు విఫలమవటం. తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం దేశ ఆర్థిక వ్యవస్థనే పణం పెట్టే స్థితికి వచ్చాం. ఈ సమతూకం సాధ్యమా? ఎలా సాధించాలి?**

**జేపీ:** చాలాకాలం క్రితం బీబీసీలో 'రీత్ మెమోరియల్ లెక్చర్స్' అని ప్రసారమయ్యాయి. సుమారు 44 ఏళ్ల క్రితం. ఈమధ్య వరకు ఆ పాత టేపులు కూడా నా దగ్గర ఉండేవి. సర్ డగ్లస్ వాస్ ఆ అద్భుతమైన ప్రసంగాలిచ్చాడు. ఓ 7,8 లెక్చర్లు ఇచ్చాడు. బ్రిటన్ నేపథ్యంలోనే కానీ, ప్రపంచమంతటికీ వర్తిస్తాయి. దాన్లో ఒక అద్భుతమైన మాట చెప్పాడు. ప్రజలకు దీర్ఘకాల ప్రయోజనాలను అందించటానికి, ఆ క్రమంలో తాత్కాలిక రాజకీయ మూల్యం చెల్లించటానికి మధ్య పాలకులు నిరంతరం సంఘర్షణను ఎదుర్కోవలసి ఉంటుంది. ఎక్కడికో వెళ్లక్కర్లా. దేశము, సిద్ధాంతము అక్కర్లా. తల్లిదండ్రులు, పిల్లలు ఉన్నారండీ. టీవీ ఇష్టమొచ్చినట్లు చూడమ్మా, ఇష్టమొచ్చినట్లు నిద్రపోమ్మా, చదువుకోకున్నా ఆటలాడకున్నా వీడియో గేమ్స్ ఆడుకోమ్మా అంటే పిల్లల్లో పాప్యులర్ అవుతారు. అలాకాకుండా ఆరోగ్యానికి ఆటలు అవసరం కాబట్టి ఆడుకోవాలి, చదువు మీద దృష్టి పెట్టాలి, టైమ్‌కి పడుకోవాలి అంటే, తల్లిదండ్రులు పిల్లల ముందు అన్‌పాప్యులర్ అవుతారు. ఈ తరంలో తల్లిదండ్రుల ముందు ఐ హేట్ యూ అని తలుపు ధడేల్న మూయని పిల్లలు ఉంటారా? కాబట్టి పిల్లల భవిష్యత్తును కాపాడాలి అంటే,

తల్లిదండ్రులు మంచి భవిష్యత్తు గురించి ఈవేళ కొంత త్యాగానికి పిల్లల్ని సిద్ధం చేసేలా ప్రయత్నిస్తారు. కుటుంబంలో ప్రేమానురాగాలు, జన్యుసంబంధం, నా కోసం తల్లిదండ్రులు ప్రాణాలివ్వటానికి సిద్ధంగా ఉన్నారని పిల్లలకు తెలుసు. పిల్లల కోసం బతుకుతున్నానని నాకు తెలుసు. అలాంటిది ముక్కుమొహం తెలియని కోట్ల మంది ఉండే ఒక సమాజంలో అది చేయటం ఎంతో కష్టమైన పని. ఓట్ల కోసం తాత్కాలికగా ఎర వేస్తే ఆ తర్వాత భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. మన దేశంలోనే కాదు, అమెరికాలాంటి దేశంలో కూడా ఇప్పుడు రుణమాఫీలు, పెద్దఎత్తున నగదు పంపిణీ చేస్తున్నారు. కరోనా సమయంలో అవసరం లేకపోయినా 2000 డాలర్లు జేబుల్లో పెట్టారు. నిజానికి మార్కెట్‌ను మనం స్వయంగా లాక్‌డౌన్ చేసిన సమయంలో పెద్దఎత్తున డబ్బు పంపిణీ చేస్తే ఉపయోగం ఉండదు. కొందరు ఆర్థిక వేత్తల పిచ్చి సిద్ధాంతాలు చెప్పి ఆ పని చేయించారు. డబ్బులన్నీ దాచుకుని రకామని ఖర్చు పెట్టే సరికి ప్రపంచమంతా ద్రవ్యోల్బణం వచ్చింది. కాబట్టి బాగా సంపన్న దేశంలో కూడా దీనికి అతీతం కాదు. రాజకీయం చాలా తేలిగ్గా ఆ మార్గానికి పోతుంది జాగ్రత్త పడకపోయినట్లయితే. కాబట్టి భారత్‌లో మనం ఏం చేయాలీ? కనీసం బ్యాలెన్స్ చేయగలగాలి. ఎంతో కొంత సంక్షేమం, అందునా మన లాంటి పేద దేశంలో అవసరం. తాత్కాలికంగా ఆ బాధను తొలగించే ఏర్పాటు చేయకపోతే సమాజం నడవదు. సమాజంలో అందరినీ కలపకపోతే రాజకీయం నడవదు, దేశం నిలవదు. కానీ అదే పరిపాలన అనుకుంటే వినాశకరం. పన్నుల డబ్బు 100 రూపాయలు వస్తే, ఈవేళ 70-80 కేవలం ప్రభుత్వం నడపటానికే ఖర్చు పెడుతున్నాం. దీనివల్ల ప్రజలకు ఏమీ అందదు. ఉనికి కోసం ఖర్చు పెడుతున్నాం. 20-30 తినేస్తున్నాం. అప్పులు తీసుకొచ్చి మిగతా అంతా ఖర్చు పెడుతున్నాం. ఇదే పరిపాలన అంటున్నాం. అప్పుడు ఎక్కడ ప్రయోజనముంటుంది? పేదరికం కొనసాగుతుంది. కానీ నష్టపోయేదెవరు? డబ్బున్నవాళ్లు కాదు. డబ్బున్నవాడికి, వేరే మార్గాలున్నవాడికి సమస్య లేదు. నా పిల్లల చదువుకి వేరే మార్గాలు చూసుకుంటాను. ఒకప్పుడు నాలాంటి, ప్రవీణ్ లాంటి వారు స్కూలు ఫీజు ఏడాదికి రూ.3-4 లక్షలు ఊహించలేదు. కానీ ఈవేళ డిమాండ్ ఉంది కాబట్టి అలాంటి స్కూళ్లు వస్తున్నాయి. అలాగే ఆరోగ్యానికి లక్షలు ఖర్చు పెట్టి ఆరోగ్యం ఏర్పాటు చేసుకోగలను. నీళ్లు కావాలంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోగలను. నాకు రక్షణ లేదంటే, గేటెడ్ కమ్యూనిటీ ఏర్పాటు చేసుకోగలను. ఏవో తంటాలు పడతారు. రోడ్లు వంటివి వాళ్లు సొంతంగా ఏర్పాటు చేసుకోలేరు కాబట్టి, మనతోపాటు కొంత బాధలు పడ్డా. కానీ సామాన్యులు ఏమవుతున్నారు? తీవ్రంగా నష్టపోతారు. దీర్ఘకాల ప్రయోజనం కోసం ప్రయత్నం జరగకపోతే, తాత్కాలిక ఉపశమనంతోపాటు ఆ బ్యాలెన్స్ చేయకపోతే సమాజం భారీ మూల్యం చెల్లిస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే డా॥ అంబేద్కర్ రాజ్యాంగంలో చాలా చక్కటి ఏర్పాట్లు చేశారు. నిజంగా మన రాజ్యాంగ నిర్మాతల ముందుచూపు చూస్తే చాలా గర్వం అనిపిస్తుంది చాలా రంగాల్లో. వేరే సందర్భంలో, రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి కొన్ని నిబంధనలు చెబితే, నిజమా అన్నారాయన. చాలా నిష్ణాతుడాయన. స్వతంత్రానంతర భారతంలో ఒక ఎన్‌సైక్లోపిడియా. ఆయన నిజమా అన్నప్పుడు రాష్ట్రపతి భవన్‌లో ఆయన ఎదురుగానే రాజ్యాంగ ప్రతిని తెప్పించి చూశాను. ఆయన చాలా ఆనందపడ్డారు, మన రాజ్యాంగ నిర్మాతలు ఇంత ముందుచూపుతో చేశారా అని! కాబట్టి ఆర్థిక భద్రత కోసం, ఈ సమన్వయం సాధించటం కోసం ఏర్పాట్లు చేశారు. కానీ ఏర్పాట్లు వాడుకునే చాతుర్యం మనకుండాలి. ఆ సంకల్పం, చాతుర్యం, దేశ నాయకత్వానికి ఉండాలి. ఈవేళ నా దృష్టిలో ఈ దేశ భవిష్యత్తుకి అత్యంత ప్రధాన సమస్య- రేపన్నది లేనట్లుగా పిల్లల మీద, భవిష్యత్తు మీద అప్పుల భారాన్ని పెంచి, తాత్కాలికమైన తాయిలాల్ని అడిగినా అడగకున్నా పంచుతుండటం. మంచినీళ్లు 20 వేల లీటర్లు నాకు ఉచితంగా ఇస్తున్నారు. ఎవడు అడిగాడు? నాకు సిగ్గుండాలి ఆ నీళ్లు తీసుకోవటానికి. వాళ్లకి సిగ్గుండాలి నాకు ఇవ్వటానికి. చివరికి కాలక్రమంలో వాటర్ సప్లయ్ బోర్డు నాశనమైపోతుంది, నేను గ్యారంటీగా చెప్పగలను ఇక్కడ కూర్చుని. 40 శాతం నీళ్లు హైదరాబాద్‌లో వరదలుగా పారుతున్నాయి, మండుటెండల్లో కూడా. వేల కోట్లు ఖర్చు పెట్టి ప్రాజెక్టులు నిర్మాణం చేసి గోదావరి, కృష్ణ మీద ఇక్కడకు తీసుకొచ్చి పంపిణీ వ్యవస్థ లేక, దీని కోసం డబ్బులు లేక, పట్టించుకునేవాడు లేక 40% నీళ్లు పోతున్నాయి. ఆ వచ్చే కొద్దిపాటి డబ్బు కూడా అసంబద్ధ ఉచితంతో లేకుండా చేశాం. ఇది ఒక చిన్న ఉదాహరణ. తాత్కాలికంగా మాత్రం బాగా కనిపిస్తుంది. నువ్వు టీవీ చూస్తూ, వీడియో గేమ్ ఆడుకో అంటే పిల్లలకు ఆనందం ఎట్లా కలుగుతుందో, ఆ పరిస్థితిలో ఉన్నాం. ఈవేళ నెంబర్‌వన్ ప్రమాదం ఇది దేశానికి, దేశ ఆర్థికానికి. ఆర్థిక భవిష్యత్తు లేకుండా, ఆర్థిక ప్రగతి లేకుండా ఆ ప్రగతి సామాన్యుడ్ని తాకకుండా, సామాన్యుడికి విద్య, ఆరోగ్యం అందకుండా, నైపుణ్యం రాకుండా, ఉపాధి కల్పన జరగకుండా, చిన్న పెట్టుబడులు రాకుండా, వ్యాపారం జరగకుండా మీరు దేశంలో పేదరికాన్ని తొలగించలేరు, కుల వివక్షను తొలగించలేరు. అది జరగాలంటే దాని కోసం పెట్టుబడులు కావాలి, వ్యూహం కావాలి. అది కావాలంటే ముందు పైసామే పరమాత్మ. అందుకు వనరుల్ని సద్వినియోగం చేసే ముందుచూపు కావాలి. ఇవాళ అది లేకుండా చేస్తున్నాము. నా దృష్టిలో ఈ ఆర్థిక సమతుల్యాన్ని పాటించకపోతే భారతదేశ భవిష్యత్తు అగమ్యం. నా వయసు 67. కనీసం నా జీవితకాలంలో ఇక మంచిని చూడలేను ఆర్థిక నిర్లక్ష్యాన్ని గనక ఈవేళ అరికట్టలేకపోతే. అందుకే ఇటీవలికాలంలో రాత్రింబవళ్లూ.. ఎట్లా ఈ దేశాన్ని రాజకీయంగా, ప్రజాస్వామ్యంగా కాపాడదాం, ఎన్నికైన ప్రభుత్వాల స్వేచ్ఛను గౌరవిస్తూ, భవిష్యత్తుని, భవిష్యత్తు తరాన్ని

కాపాడటం ఎట్లా అని మథనపడుతున్నాను. నెంబర్‌వన్ ప్రయారిటీ ఇది నా దృష్టిలో ఇవాళ.

**ఆర్ఎస్‌పీ:** ఈ రాజకీయ నాయకులు స్వార్థ చింతనతో– స్వార్థం ఉండకూడదని కాదు– మనిషన్న తర్వాత ప్రతి ఒక్కరికీ స్వార్థం ఉంటుంది.. కానీ అపరిమిత స్వార్థ చింతనతో, ఆ అధికార పీఠం మీద కూర్చుని, మేం అధికారంలో ఉండటానికి ఏమేం చేయాలో అదంతా చేద్దాం అని ఒక పాలసీ చాలా జాగ్రత్తగా డిజైన్ చేసి జనాల మీదకు వదిలేస్తున్నారు. జనాలు కూడా ఆ ఎన్నికల 2,3 నెలలపాటు వచ్చే తాత్కాలిక టెంప్టేషన్లకు బలైపోయి ఓట్లు వేస్తున్నారు. ఒకసారి ఓటేశాక మళ్లీ నాయకులు వాళ్ల దగ్గరికి వెళ్లరు, తమ దగ్గరకు రానివ్వరు. ఇప్పుడు చీఫ్ మినిస్టర్ కార్యాలయానికి అపాయింట్‌మెంట్ లేకుండా పోతే నన్ను బయటికి పంపించేస్తారు. లేకుంటే పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పెట్టేస్తారు. నేను ఇప్పుడు సెక్రటేరియట్‌కు పోయి ఒక అధికారికి చెప్పలేని పరిస్థితి. సెక్రటేరియట్‌లో కూర్చునే అధికారి, మంత్రి నా దగ్గరకు ఎప్పుడొస్తారంటే కేవలం ఎలక్షన్లప్పుడు. ఇది రాజకీయ నాయకులకు చాలా స్పష్టంగా తెలుసు. కాబట్టే ఎలక్షన్ల ముందు మాత్రమే ఇలాంటి స్కీములు గుప్పించి, వాటిని అద్భుతంగా ప్రచారం చేసి, దీనివల్లనే మీ జీవితాలు బాగుపడతాయి అని నమ్మిస్తుంటారు. 2000 పెన్షన్ 3000 అంటారు. తొమ్మిదిన్నర పది సంవత్సరాలు తెలంగాణలో పేద ప్రజలకు ఇళ్లు కట్టటం గుర్తుండదు. కేవలం ఎలక్షన్లకు 2,3 నెలల ముందు మీకు ఇళ్లు కట్టిస్తామని, లక్ష మీ పేరు మీద వేస్తామంటారు. లక్ష అప్పటికి రావు. లక్ష వచ్చినట్లుగా మీకో మెస్సేజి వస్తుంది. దళితులకు 10 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పి, ఆ పది లక్షలకు ఎలాంటి మార్గదర్శకాలు రిలీజ్ చేయకుండా, వాటికి ఆన్‌లైన్‌లో అప్లికేషన్ లేకుండా కేవలం ఎమ్మెల్యేల చేతిలో పెడుతున్నారు. ఇవి ఉదాహరణగా చెబుతున్నా, ఎవరినో ఉద్దేశించి విమర్శ కాదు. దీనివల్ల చివరికి ప్రజాధనం వృథానే అవుతుంది. ఉదాహరణకు, హుజూరాబాద్‌లో 2000 నుంచి 3000 కుటుంబాలు కార్లు కావాలన్నారు. అసలు హుజూరాబాద్‌లో కొన్ని పదుల కార్లు తిరగటం కష్టం. 2000 నుంచి 3000 కుటుంబాలు కార్లు షెడ్లలో ఎక్కడ పెట్టగలరు?

**జేపీ:** పది లక్షలకి ఏడు లక్షలు ఇస్తున్నారు.

**ఆర్ఎస్‌పీ:** అవును. దళితబంధులో కొంతమంది బినామీ పేర్ల మీద ఇండస్ట్రీస్ పెట్టి 3 లక్షలు ఎమ్మెల్యేలు తీసుకుని ఏడు లక్షలు ఇస్తున్నారు. నిజాంసాగర్ వెళ్లా. నిజాంసాగర్ శాచ్యురేషన్ మోడ్‌లో దళితబంధు అమలు చేస్తున్నారు. నిజాంసాగర్‌లో ఉండటానికి ఇళ్లు లేవు కానీ, ఇంటి ముందర హార్వెస్టర్ ఉంది. 24 లక్షల విలువైన హార్వెస్టర్. రైతు కూలీల ఇళ్లలో పనిచేయగలిగినవాళ్లు హైదరాబాద్‌లో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నారు. హార్వెస్టర్ వాడటం చేతకాదు. అది భిన్నమైన రీతిలో ఉపయోగించాల్సిన యంత్రం. అంత తేలిక కాదు. ఒకసారి మిషన్ చెడిపోతే రూ. 20–70 వేలు అవసరం. వాళ్లకి 200 కూలీ రావటం కష్టం. వాళ్ల ముందర హార్వెస్టర్ డంప్ చేశారు. ఇంకొందరికి ఉండటానికి ఇళ్లు లేవు, తడికెలతో కట్టిన ఇళ్లు, ఇంటి ముందర మహీంద్రా 375 ట్రాక్టర్. నేను చెప్పాలనుకున్నది– పాలకులకు ఎంతసేపూ ఆ ఆర్భాటపు ప్రదర్శన తప్పితే, తాత్కాలిక ప్రభావం తప్పితే, వాటి వల్ల ప్రజలకు ఏమిటి లాభం అనే ఆలోచన లేదు. ప్రజలందరికీ ఎన్నికల చివరిరోజుల్లోనే ఇలాంటివి అమలు చేస్తే గుర్తుపెట్టుకుని ఓట్లు వేస్తారనే భావన బలంగా ఉంది కాబట్టి అలా చేస్తున్నారు. ప్రజలు కూడా దానికి టెంప్ట్ అవుతున్నారు. దీన్లో ఎక్కడ బ్యాలెన్స్? మీరు సమతూకం అన్నారు. అది అంత తేలిక కాదు. కానీ బ్యాలెన్స్‌కి సంబంధించి నాకర్థమైందేంటంటే, ఓటర్లు, చదువున్న, ఆలోచనగల ఓటర్లవ్వాలి. ఒక గ్రామంలో అందరూ ఒకేసారి ఎడ్యుకేట్ కాలేరు గదా. గ్రామంలో యువత– 'యస్, మాకు దళితబంధు ఇస్తున్నారు, ఎక్కడ్నుంచి తీసుకొస్తున్నారు ఆ డబ్బుని, మాకు విద్య మీద అదే డబ్బు ఖర్చు పెట్టటం లేదెందుకు? మాకు గిరిజనబంధు అన్నారు. ఆ గిరిజనుల మీద అటవీ ప్రాంతాలలోనే గిరిజనులకు కావలసిన అవసరాలు ఏవైతే ఉన్నాయో వాటి మీద మీరు ఎందుకు ఖర్చుపెట్టరు? హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ అంశాలు ఏవైతే ఉన్నాయో, వాటి మీద.. విద్య గాని, వైద్యంగాని, ఇంకేవైనా ఉంటే వాటి మీద ఎందుకు ఖర్చు పెట్టరు?' అని అడగగలగాలి. దళితబంధులో కూడా మీకు ఈ అడగగలిగిన శక్తి ఉన్నవాళ్లకు మాత్రం పెద్దఎత్తున డబ్బులిచ్చి, అడగలేని వారికి మాత్రం తర్వాత వస్తాయి, తర్వాత వస్తాయి అని చెబుతున్నారు. ఎడ్యుకేట్ చేయటం కూడా అంత ఈజీ ప్రాసెస్ కాదు. పాలకుల వెనక మీడియా ఉంది. మనం అది కూడా చూడాలి. ఈ మీడియా అంతా కూడా దురదృష్టవశాత్తూ వాళ్ల కనుసన్నల్లో నడుస్తోంది ఈవేళ. ఈ షార్ట్‌టర్మ్ వర్సెస్ లాంగ్‌టర్మ్ గురించి ఆలోచించటం ఇష్టంలేని వర్గం చేతిలోనే ఇయ్యాల మీడియా ఉంది. అమ్మో, ఇది చాలా గొప్ప పథకం, దేశంలో ఎక్కడా లేని పథకం, కాబట్టి దాని కోసం 100 కోట్లు ఖర్చు చేయాలి, 200 కోట్లు అడ్వర్టయిజ్‌మెంట్లు ఇవ్వాలి. ఇలా విపరీతంగా చేస్తే, ఆ రోజుకి కంటిన్యువస్‌గా సమాచారం వచ్చిపడుతుంటే, మీ టీవీ స్పేస్‌లో మీకు వేరే మార్గం లేక నమ్మే పరిస్థితి వస్తుంది. ఇదే నిజమని నమ్మే పరిస్థితి వస్తుంది. అందుకొరకు మార్ష్‌మెల్లో ఎక్స్‌పరిమెంట్. 1970లలో జరిగిన ఈ ప్రయోగంలో కొన్ని బిస్కట్లు, చాక్లెట్ కుకీస్ అవన్నీ పెట్టి కొందరు పిల్లలను సైంటిస్టులు అబ్జర్వ్ చేస్తారు. లాంగిట్యూడనల్ ఎక్స్‌పరిమెంట్. అందులో ఎవరైతే టెంప్టేషన్స్‌కు లోనవకుండా, తినకుండా ఉంటారో వాళ్లకి ఇన్ని రివార్డ్స్ అని, ఎవరైతే వాసన చూసి వదిలేస్తారో వాళ్లకి ఇన్ని రివార్డ్స్ అని చెప్పారు. ఎవరన్నా చూస్తున్నారా లేదా అని ఇద్దరు ముగ్గురు పిల్లలు తింటారు. కొంతమంది వాసన చూసి వదిలేస్తారు. కొంతమంది అసలు తినసే తినరు చాలా రివార్డ్స్ వస్తాయని. వెయిటింగ్ చేసి.. ఇది నాది కాదు, దీని మీద నాకు స్పష్టత లేదు, నాకు ఇంకా మంచి

విషయాలు రావాలి, నాకు ఇంకా అందుకునే అర్హత ఉంది అనుకునే ఆ బిడ్డ, ఆలోచన ఉన్నవాళ్లు ఉన్నతస్థాయికి ఎదిగేవాళ్లవుతారని మార్ష్‌మెల్లో ఎక్స్‌పరిమెంట్ చెప్పింది. ఎవరైతే ఇట్లా పెట్టామో అట్లా ఒక బిస్కట్ చాలా బాగుందని, ఫ్లేవర్ చాలా బాగుందని కుకీస్ తిన్నారనుకోండి, లాంగిట్యూడనల్ ఎక్స్‌పరిమెంట్‌లో వాళ్లేం చెబుతారంటే, అంత సక్సెస్‌ఫుల్ కారు అని. ప్రజలకి ఇంత లోతైన అవగాహన రావాలంటే, టైం పడుతుంది. అందుకొరకే ఒక్కరోజులో ఇవన్నీ మార్చలేము. అదే సమయంలో, మార్చలేము అని చెప్పి ప్రయత్నాలు చేయకుండా ఉంటే, జేపీ గారు చెప్పినట్లుగా ఏదోకరోజు గ్రీసు, అర్జెంటీనా, శ్రీలంక లాంటి పరిస్థితి తప్పకుండా వస్తుంది. నిజానికి మన తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత బాగా లేదు. బాగాలేదు అని చెప్పటానికి తెలిపే ఇండికేటర్, సామాన్య ప్రజలు అర్థం చేసుకోవటానికి సూచిక ఏమిటంటే, ఒకటో తారీఖు నాడు రావాల్సిన జీతాలు 13వ తారీఖున, కొన్ని డిపార్ట్‌మెంట్లలో రెండు నెలల తర్వాత, కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకి ఆరు నెలల తర్వాత కూడా వస్తున్నాయి. రోజూ మా దగ్గరకు వస్తుంటారు. ఇప్పటికి కూడా మిషన్ భగీరథ ఉద్యోగులు రోడ్ల మీద ధర్నా చేస్తున్నారు. 1300 మంది మిషన్ భగీరథ ఎంప్లాయిస్ 13 నెలల నుంచి మాకు జీతాలు రావటం లేదని నాకు మెస్సేజి పెడితే, నేను ముఖ్యమంత్రి ఆఫీస్‌కి ట్యాగ్ చేస్తూ ట్వీట్ పెడితే అప్పుడు సడెన్‌గా వాళ్లు నిద్ర లేచారు. ఆర్థిక విభాగానికి పోయి వాళ్లకు జీతాలిచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నిజంగా బాగా లేదు. కాబట్టి బాగాలేనప్పుడు మళ్లీ తాయిలాలు ఇవ్వటమనేది కేవలం అధికారం మన దగ్గరే ఉండాలనే స్వార్థ చింతన. నేను బాగుంటే చాలు, తర్వాతి జనరేషన్ ఎక్కడికిపోతే ఏంటి అన్న భావనతోనే చేస్తున్నారు. అది విపరీత తిరోగమన ఆలోచనా ధోరణి.

**జేపీ:** మార్ష్‌మెల్లో ఎక్స్‌పరిమెంట్‌లో రివార్డ్స్ గ్యారంటీగా వస్తాయన్న నమ్మకం ఉంది. అయినా కూడా టెంప్టేషన్ ఆపుకోవటం కష్టంగా ఉంది. ప్రభుత్వంలో రివార్డ్స్ వస్తాయన్న గ్యారంటీ కూడా లేదు. ఎందుకంటే తాత్కాలిక తాయిలాల్ని వదిలేసుకుంటే ప్రయోజనాలు వస్తాయన్న నమ్మకం కలిగించలా మన వ్యవస్థ. కాబట్టి చచ్చినోడి పెళ్లికి వచ్చిందే కట్నం అనుకుంటున్నారు. ఇది ఇంకా క్లిష్టమైనది.

**ఆర్ఎస్‌పీ:** కరెక్ట్, గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికి కూడా ప్రజలు ఏమనుకుంటున్నారంటే, 5 సంవత్సరాల వరకూ ఆ నాయకులు మా దగ్గరికి రాలేదు. మాకు తెలుసు వాళ్లు మా డబ్బుల్ని తింటున్నారని. కనీసం ఇప్పుడన్నా వచ్చి డబ్బు ఇస్తున్నారు గదా, మా నోటి కాడ కూడు ఎందుకు పోగొడుతున్నారు అని. ఆ పరిస్థితికి ఇయ్యాల ఎలక్టొరేట్ వచ్చింది. నాకు రావాల్సింది ఇంతేనా, ఇంతకంటే నాకు అర్హత లేదా అనే విచక్షణా జ్ఞానం ఓటర్లకు రానివ్వలేదు. పాఠ్య పుస్తకాల్లో, కాలేజీల్లో, యూనివర్సిటీల్లో, క్యాంపస్‌ల్లో, ఆన్ క్యాంపస్, ఆఫ్ క్యాంపస్‌లో, లైబ్రరీల్లో, ల్యాండ్ స్కేప్స్‌లో ఈ సంభాషణ జరగటం లేదు. అందరు నిరుద్యోగులూ నిరుద్యోగ భృతి గురించి అడుగుతారు. రూ.3,116 ఇవ్వాలని. ఆ 16 కొంచెం దైవికమైన టచ్ ఇవ్వటం కోసం. 3,116 నాకు నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వటం లేదని అడుగుతున్నారు తప్ప, ఎందుకు మాకు ఎంప్లాయ్‌మెంట్ అవకాశం ఇవ్వలేకపోతున్నారు అని అడగలేకపోతున్నారు. ఉపాధి అవకాశాలు ఎక్కడెక్కడున్నాయ్, మీరు చూసి మాకు చూపించండి, అది కేవలం కొంతమందికే వస్తోంది, ఇక్కడ మాకు ఎందుకు లేదు? హైటెక్ సిటీలో మా స్టేక్ ఏంటి? లేకపోతే అడ్వర్టయిజింగ్ ఇండస్ట్రీలో మా వాటా ఏంటి, మైనింగ్ పరిశ్రమలో మా స్టేక్ ఏంటి? మ్యానుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీలో మా వాటా ఏంటి?.. ఆ విధమైన ఆలోచన రాకుండా నిరుద్యోగ భృతి ఎందుకివ్వలేదనే వాదన చేసేలా ఒక ఫ్రేమింగ్ అనేది తెలివిగా పాలకులు యూత్ మైండ్స్‌లోకి జొప్పించారు. అది చాలా విషాదకరం.

**జేపీ:** అందుకే ఇది మారాలంటే దీర్ఘకాలం పడుతుంది. ఆ మేలుకొలుపు కావాలంటే స్థానిక ప్రభుత్వాలు బలోపేతం కావాలి. నా పన్నుల డబ్బుకి, నాకు అందే సేవలకి మధ్య సంబంధం అర్థం కావాలి. ఇది ఒక్కరోజు జరిగేది కాదు. ఈ 70 ఏళ్లపైగా అధ్వాన్నం చేశాం సెంట్రలైజ్ చేసి. అదే సమయంలో అది అయ్యేదాకా ఆగితే దేశం నాశనమైపోతుంది. ఆర్థికంగా ఒకసారి నాశనమయ్యాక ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ఇవన్నీ డ్రామాలు. బీదరికం తొలగించటం డ్రామా. అందుకే రాజ్యాంగంలో పెట్టిన ద్రవ్య నిబంధనలు అంత కీలకం. మనం రెండు మూడు విషయాలు. 1) ఎఫ్ఆర్‌బీఎం చట్టం ఒకటి తీసుకొచ్చాం. అంటే ప్రభుత్వాలు అప్పు చేయటానికి కొన్ని పరిమితులు, కొన్ని నిబంధనలు పెట్టాం. అట్లాగే అప్పు చేసి పప్పు కూడా తినకూడదు. అప్పు మీరు రోజువారీ ఖర్చులకు వాడకూడదు. పెట్టుబడులకు వాడాలి అని ఇంకో రూల్ పెట్టామనుకోండి, రాజ్యాంగం కూడా ఒప్పుకుంటుంది ఆ మాట. అదేవిధంగా ఈమధ్య పెన్షన్ గురించి వివాదం జరుగుతోంది. కేవలం కొద్దిమంది ప్రభుత్వోద్యోగులకు, 2004కు ముందు ఉద్యోగాల్లో చేరిన వారికి ఇండెక్స్ లింక్డ్, పే రివిజన్ కమిషన్ అమలు చేస్తే వాళ్లకు పెన్షన్లు పెద్దఎత్తున పెరుగుతాయి, ధరలు పెరిగితే డీఏతోపాటు పెన్షన్ పెరుగుతుంది. చివరకు 10 వేలతో రిటైరయితే, 80 వేల పెన్షన్! పెన్షన్ వచ్చేవాళ్లకి బాగుంటుంది. కానీ ఎవరి డబ్బు ఇది? మిగతా 97% డబ్బు. ఇదేమో ఇవాళ డబ్బులు పెట్టటంలా. 30 ఏళ్ల తర్వాత అదొస్తుందని గ్యారంటీ ఇస్తున్నాం. వచ్చే తరాన్ని నాశనం చేస్తున్నాం. కాబట్టి ఈ రెండు మూడు విషయాలలో మనం ఎఫ్ఆర్‌బీఎం చట్టాన్ని గట్టిగా అమలు చేయాలి. అట్లాగే, మీరు అప్పులు తెచ్చిన డబ్బు సాదర ఖర్చులకు వాడకూడదనే నియమాన్ని పెట్టుకుంటే, దాన్ని అమలు చేయాలి. కొత్త పెన్షన్ సిస్టం పెట్టాం. నడుస్తోంది. ఈ మధ్య ఒత్తిడులు వస్తున్నాయి. తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం. ఏముంది, సంఘటిత బలం ఉన్నప్పుడు నోరున్నవాళ్లదే బలం.

నోరులేనివాళ్లు ఎక్కువమంది ఉన్నారు. నష్టపోయేది వాళ్లు. వాళ్లకి అర్థం కాదు. నోరున్నవాళ్లు తక్కువమంది ఉన్నారు.వాళ్లు లాభం పొందేవాళ్లు. వాళ్లకు తెలుసు ఏం జరుగుతుందో!వాళ్లు పూర్తిగా ఫైట్ చేస్తారు. ఎప్పుడూ ప్రజాస్వామ్య సమాజంలోగాని, ఎక్కడన్నా గాని నోరున్నవాళ్లు కొద్దిమంది శాసిస్తారు. వాళ్లు లాభం పొందుతారు. రాజకీయానికి అత్యధికుల ప్రయోజనాన్ని కాపాడటం కోసం మంచి చేసే శక్తి, ఒప్పించే శక్తి లేకుండా పోయింది. జారిపోతున్నారు. కాబట్టి దాన్ని మనం కాపాడటం. కనీసం ఈ పనులు చేస్తే ఊపిరి పీల్చుకోగలం. ఎప్పుడైతే ఆర్థికంగా మనకు పతనావస్థ లేదనుకుంటామో అప్పుడు రాజకీయంగా దృష్టి పెట్టి మార్పులు తేగలం. ఒక్కో రాష్ట్రంలో మార్పు ఒక్కో దిక్కున జరుగుతుంది. కొన్ని చోట్ల విద్య బాగుపడుతుంది. కొన్ని చోట్ల స్థానిక ప్రభుత్వాలు వస్తాయి. కేరళ ఉంది, కొంచెం స్థానిక ప్రభుత్వాల స్పృహ ఉంది కదా. ఒక్కరోజు జరగదు ఇది. ఒక 20-25 ఏళ్లు పడుతుంది. అంచేత దీన్ని మనం అత్యంత తీవ్రంగా తీసుకోకపోయినట్లయితే, నా దృష్టిలో ఈ దేశ భవిష్యత్తుకి నెంబర్‌వన్ ప్రమాదం ఆర్థిక పరిస్థితి. తెలంగాణ రాష్ట్రం ప్రవీణ్ చెప్పినట్లుగా, లక్షా 18 వేల కోట్ల మిగులుతో ప్రారంభమైంది. ఐదేళ్లలో అత్యధిక మిగులు ఉంటుందని 14వ ఆర్థిక సంఘం ప్రకటించింది. అలాంటిది జీతాలు భత్యాలు ఆలస్యంగా ఇస్తున్నారు. నెలకు పది రోజులో, పదిహేను రోజులో ఓవర్‌డ్రాఫ్ట్ అంటున్నారు ఆర్‌బీఐ వద్ద. ఈ పరిస్థితి వచ్చిందంటే, ఇదెవరో ఒక వ్యక్తిని గురించి కాదు. ప్రభుత్వాన్ని నిందించటంలా. ప్రవీణ్ చెప్పాడు, వాళ్లంతా ఊబిలో కూరుకున్నారు. కేసీఆర్ చేయకపోతే కాంగ్రెస్ వచ్చి చేస్తానంటాడు. పోటీలో తట్టుకోవాలి కదా. వాళ్లది తప్పు అనటంలా. కానీ ఏదోరకరకంగా ప్రజలు అర్థం చేసుకునేట్లు చెప్పాలి. ఎక్కడోకచోట. పూర్తిగా ఏదీ ఆపలేం. తాత్కాలిక ప్రయోజనాల్ని నెరవేర్చకపోతే పేద సమాజంలో ప్రజాస్వామ్యాన్ని నడపటం, సమాజాన్ని కాపాడటం అసాధ్యం. ఒక బ్యాలెన్స్ కావాలి. దానికి రాజ్యాంగాన్ని, చట్టాన్ని ఉపయోగించుకోవాలి. ఆ ప్రయత్నం గత 20-30 ఏళ్లుగా జరిగింది. ఈ మధ్యకాలంలో దాన్ని కూడా వదిలేస్తున్నాం. ఎఫ్ఆర్‌బీఎం చట్టం అన్ని పార్టీలూ కలిసి చేసినాయి. రాష్ట్రాలూ. కానీ అవి కూడా ఇవాళ బేఖాతరు చేసేసి అసలు రేపన్నది లేదు, ఏదన్నా చేయొచ్చు, డబ్బన్నది లేదు, మా ఇష్టం రూపాయలు ప్రింట్ చేస్తే వచ్చేస్తాయన్న మూర్ఖత్వంలో ఉన్నాం. వాస్తవం కాదు.

**ఆర్ఎస్‌పీ:** దీంట్లో ఏంటంటే, అన్ని ప్రభుత్వాలూ ఆలోచించాల్సిన ఒక ముఖ్యమైన అంశం- ఒక విస్తృత ఏకాభిప్రాయం ఉండాలి పాలసీలో. ఇప్పుడు ఇంతకుముందు యూపీఏ-1 ఎడిషన్ చూస్తే, 2004-2009లో నేషనల్ అడ్వయిజరీ కౌన్సిల్ అని ఒకటుంది. దాంట్లో డాక్టర్ జేపీగారు కూడా పార్టిసిపేట్ చేసుంటారు. దాంట్లో ఏంటంటే, వాట్ వర్క్స్, వాట్ డజ్ నాట్ వర్క్ అనే దాని మీద కొంత సంభాషణ జరిగేది. ఇప్పుడు ప్రజల్లో ఎందుకు ఒపీనియన్ పోల్ పెట్టరు? గృహలక్ష్మి పథకం ఉంది. ఎన్నికలు 2 నెలల్లో వస్తాయి. సెప్టెంబర్ చివరి వారంలో, అక్టోబర్ ఫస్ట్ వీక్‌లోనో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఎన్‌ఫోర్స్ అవుతుంది. కోడ్ అమలవుతున్నప్పుడు ఈ పాలసీలూ అవీ కూడా పెద్దగా పనిచేయవు. కలెక్టర్లు అంతా బిజీ, ఏవైతే ఎన్నికల స్కీములున్నాయో అన్నిటి మీదా బ్రేక్ వస్తుంది. ఒక రెండు నెలలపాటు పోస్ట్‌పోన్ చేస్తారు. వచ్చే ప్రభుత్వానికి ఏం ప్రాధాన్యాలో కూడా తెలియదు. ఫైల్స్ అన్నీ కూడా ఆయా డిపార్ట్‌మెంట్లకి సీఎం ఆఫీస్ నుంచి వెనక్కి పంపిస్తారు. ఎన్నికలయ్యా చూస్తామంటారు. కాబట్టి, ఈ గృహలక్ష్మి పథకం ఆదరాబాదరాగా ఇప్పుడు చేయటం వల్ల ప్రయోజనం తక్కువ. అదేవిధంగా బీసీ బంధుకి 100 కోట్లు రిలీజ్ చేశారు, మైనారిటీ బంధుకి 100 కోట్లు రిలీజ్ చేశారు, అది 2018లో, 2014లో చేసి ఉండొచ్చు గదా. 2018లో కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇది మా దీర్ఘకాల విజన్, 2014-18 దాకా చేస్తాం, 18 నుంచి 2023 వరకు చేస్తాం అని చెప్పుండొచ్చు గదా. దాని మీద ఓ 3 నెలలు చర్చ పెట్టి ఉండొచ్చు. ఒక పెద్ద ఒపీనియన్ పోల్ తీసుకురావచ్చు. టౌన్‌హాల్ మీటింగ్ పెట్టి ఉండొచ్చు. ఇవన్నీ పెట్టి అభిప్రాయాల్ని సమీకరించి, ఇందులోని అంశాలివి, ఇది పనికొచ్చేది, ఇది పనికిరాదు అని చెప్పొచ్చు. ప్రజల్లో కూడా ప్రశ్నలు అడిగేవాళ్లు ఉంటారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లోనో, లామకాన్‌లోనో ఎక్కడో మీరు చర్చ పెట్టొచ్చు. కాబట్టి, మీరు డబ్బు ఎక్కడ్నుంచి తీసుకొస్తారు? ఈ డబ్బు ఈ పథకానికి ఎక్కడ్నుంచి వస్తోంది? బ్యాంకుల నుంచి తీసుకొస్తున్నారా, పన్నుల నుంచి తీసుకొస్తున్నారా అనే ప్రశ్నలు ప్రజలు అడిగే స్థాయి ఉండాలి. లేకపోతే అడిగే ఛాన్సుల్ని ఇవ్వాలి. ఇవాళ సడెన్‌గా పైనుంచి రుద్దుతున్నారు. ఇవాళ ఎవరికి ఇల్లు కావాలో వాళ్లకి ఈ పథకం ఉందని కూడా తెలియదు. మీసేవ సెంటర్ ఎక్కడుంటుందో కూడా తెలియదు. అంత దీనమైన స్థితిలోఇళ్లు లేని నిరుపేదలు ఉంటున్నారు. వాళ్లకి సడెన్‌గా గృహలక్ష్మి పథకం పెట్టుకోండి అంటే, దళారీలు, మిడిల్‌మెన్ ఎంజాయ్ చేస్తారు. వాళ్లు అక్కడ్నుంచి డబ్బులు తీసుకుంటారు. లక్ష రూపాయలు ఇస్తున్నారు ఇంటికి, లక్ష రూపాయల్లో 30 వేలు నాకిచ్చి 70 వేలు నువ్వు, లేకపోతే 70 నాకిచ్చి 30 నువ్వు తీసుకో. నువ్వు ఇల్లు కట్టుకుంటావా లేదా తర్వాత ఎవడో వచ్చినప్పుడు చూద్దాం. ఇందిరమ్మ ఇళ్లలో అదే జరిగింది. ఇప్పుడు ఇక్కడ కూడా అదే జరుగుతోంది. అంటే, ప్రజల సొమ్మును పాలకులు నిజాయతీగా మాట్లాడితే, చాలా జాగ్రత్తగా, ఆచితూచి వాడాలి. బ్రిటన్‌లో టోనీ బ్లెయిర్ తన మేకప్‌కి ఎంత డబ్బు ఖర్చు పెడుతున్నాడనే దాని మీద ప్రజల్లో చర్చ జరుగుతుంది. పెద్ద సమస్య అది అక్కడ. ఎందుకు మనం సంభాషణ అట్లా చేయం? ఎందుకు భయం మనకు? వాళ్లందరూ మన రాజప్రాసాదంలోకి వచ్చేస్తారని భయమా? మన సీక్రెట్లు తెలిసిపోతాయని భయమా? ఒక విస్తృత స్థాయి సంభాషణ భారతదేశంలో జరుగుతుండాలి.

# 2024 ఎన్నికలు - అంబేద్కర్ పాఠాలు

**- సురేంద్రబాబు, సత్యాన్వేషణ మండలి**



ప్రజాస్వామ్యం సరైన అర్థంలో ఆచరణలోకి రాకపోవడానికి గల కారణాలలో (అడ్డంకులలో) ప్రధానమైనది ప్రజలు తమను తాము పాలించడానికి మరొకరు ఎవరో రావాలని గాఢంగా భావిస్తుండడమే. ఈ నా మాటలు మరొక్కసారి జాగ్రత్తగా పట్టి చూడండి. దీనికి రెండో పార్శ్వం, ఆయా సంఘాలు, సంఘాల నాయకులు కూడా ప్రజల అభిమతానికి అనుగుణంగా.. మాకు అవకాశం ఇవ్వండి, మా నాయకత్వాన్ని బలపరచండి, మీ కొరకు మిమ్ములను పాలించే పని చేస్తాము అన్న వైఖరిని కలిగి ఉండడం. అర్థమవుతోందా? ప్రజలు తమను పాలించేవారు రావాలనుకుంటున్నారు. ఇదిగో మేమున్నాం మిమ్ములను పాలించడానికి అని రాజకీయ పార్టీలూ, రాజకీయులు అంటున్నారు. అందుకనే ఈ రెండు ధోరణుల వారి మధ్య ఈ విషయంలో ఘర్షణ లేకుండా పోయింది.

ఈ దేశంలో, ఇంకా సరిగా చెప్పాలంటే ఏ దేశంలోనైనా, ప్రజాస్వామ్యం పూర్తిగా ఆచరణలోకి రాకపోవడానికి, ప్రజలు తమను తామే పరిపాలించాలి అనుకోకపోవడం, యజమానులం తామేనన్న వైఖరిని చేతలలో చూపించలేకపోవడం ఒక కారణం కాగా, ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడినవారు గానీ, నిర్వహణ విభాగంలో నియమితులైన అధికారులు గానీ, సాధారణ ఉద్యోగులతో సహా ప్రజలే యజమానులు- తామంతా వారి సేవల కొరకు నియమింపబడ్డవారమేనన్న వైఖరిని ఆచరణలో చూపకపోవడం మరో కారణం. ప్రజాస్వామ్యపు అంతస్సారాన్ని గురించిన లోతైన అవగాహన లేనివారికి ఈ విషయం అంతగా అర్థం కాదు. కొందరికి అర్థమైందనుకున్నా, దీనికి ఎంత ప్రాధాన్యతనివ్వాల్సి ఉంటుందన్న దగ్గర అంత ప్రాధాన్యతను ఇవ్వకపోవడమూ జరుగుతుంటుంది. కేవలం మూలంలో ఉన్న ఈ కారణాల వల్లే ప్రజాస్వామ్యం అనుకున్న రీతిలో ఆచరణలోకి రావడం లేదు.

భారతదేశంలో ప్రజాస్వామ్యం అమలును దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగ నిర్మాణ సభలోనే, రాజ్యాంగ శుద్ధ ప్రతిని సిద్ధం చేసి, సభకు అందించే సందర్భంలోనే, రాజ్యాంగ రూపకల్పనలో కీలకమైన పాత్ర పోషించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆందోళన పడుతూ, సందేహాన్ని వెలిబుచ్చుతూ అన్నమాటలను ఈ సందర్భంలో గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. (పూర్తి వివరాలకు 25. 11. 1949న రాజ్యాంగ సభలో అంబేద్కర్ ప్రసంగాన్ని చూడండి). ఆనాటి ప్రసంగంలో ముగింపు వాక్యాలుగా డా।। అంబేద్కర్ ఇలా అన్నారు.

“ఇంకా ఎక్కువసేపు మాట్లాడి మీకు విసుగు కలిగించదలచుకోలేదు. స్వాతంత్ర్యం అనేది, నిస్సందేహంగా ఒక సంతోషకర విషయం. కానీ ఈ స్వాతంత్ర్యం మనపైన, పెద్ద పెద్ద బాధ్యతలను పెట్టిందన్న విషయాన్ని మరచిపోకూడదు. ఏదైనా మనకు చెడు జరిగితే దానికి ఆంగ్లేయులు (ఇతరులే) బాధ్యులు అని నిందించే అవకాశం ఇక మనకు లేదు. ఇకమీదట ఏదైనా చెడు జరిగితే మనల్ని మనం తప్ప మరెవరిని నిందించలేము. కొన్ని విషయాలు చెడును కలిగించే పెద్ద ప్రమాదం ఉంది. కాలం త్వరగా మారిపోతూ ఉంది. మనతోపాటు ప్రజలు కొత్త సిద్ధాంతాల వైపు కదులుతున్నారు. వారు ప్రజల చేత నడుపబడే ప్రభుత్వము అంటే విసుగు చెందుతున్నారు. ప్రజల కోసం ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. అది ప్రజల యొక్క ప్రజల చేత నడుపబడే ప్రభుత్వామా? కాదా? పట్టించుకోవడం లేదు. (మేమైతే) ఈ రాజ్యాంగంలో ప్రజల యొక్క, ప్రజల కొరకు, ప్రజల చేత నడపబడే ప్రభుత్వ సూత్రాన్ని పొందుపరచడానికి ప్రయత్నించాం. ఈ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే, మనం ఈ మార్గంలో ఎదురయ్యే ఇబ్బందులను గుర్తించడంలో అలసించకూడదు. అలా అలసించినట్లయితే, ప్రజల చేత నడుపబడే ప్రభుత్వానికి బదులుగా, ప్రజల కొరకు ప్రభుత్వాన్ని వీరు కోరుకునేలా చేస్తుంది. ఆ ఇబ్బందుల్ని తొలగించుకోవడానికి తీసుకోవలసిన చొరవలో మనం ఎంత మాత్రం బలహీనంగా

ఉండరాదు. దేశానికి సేవ చేసే మార్గం ఇది ఒకటే. ఇంతకుమించినది నాకు కానరావడం లేదు.”

ప్రజాస్వామ్య వాదులారా! మీరు గాని నామమాత్రపు ప్రజాస్వామ్య వాదులు కాకుండా, నిజమైన, నిజాయతీ కలిగిన ప్రజాస్వామ్యవాదులైతే, డాక్టర్ అంబేద్కర్ తన ప్రసంగంలో ఆఖరి మాటగా ఏమి చెప్పి ఈ విషయాలలో అలసత్వం (తాత్సారం) కూడదన్నారో, ఏ విషయంలో ఇదొక్కటే చేయదగింది, దేశ సేవ చేయడంలో ఇంతకంటే మించినది మరొకటి తనకు కానరావడంలేదన్నారో, ఆ విషయం పట్ల ముందుగా స్పష్టతను కలిగించుకోండి.

భారత రాజ్యాంగ నిర్మాతలు ఆశించింది, ప్రజల కొరకు, ప్రజల చేత నడపబడే ప్రభుత్వాన్ని నెలకొల్పాలనే. ప్రజల చేత నడపబడని, కొందరు నాయకుల చేత నడపబడే ప్రభుత్వాన్ని కానే కాదు. ఇక్కడ డాక్టర్ అంబేద్కర్ చెప్పిన మాటలను చాలా శ్రద్ధ పెట్టి పరిశీలించాల్సి ఉంది. 1) ప్రభుత్వం ప్రజల కొరకే ఏర్పడాలి 2) అది ప్రజల ప్రభుత్వం అనడానికి తగిందై ఉండాలి 3) ఆ ప్రభుత్వం ప్రజల చేతే నడపబడుతుండాలి. ఇది రాజ్యాంగ నిర్మాతలు ఆలోచించిన ప్రజాస్వామ్య వ్యవస్థ. ఏర్పడ్డ ప్రభుత్వాలు ప్రజల చేత నడపబడుతుండడం అంటే ఏమిటన్న దగ్గరే ప్రజాస్వామ్యపు ఆయువంతా ఇమిడి ఉంది. ఏర్పడ్డ ప్రభుత్వ పాలనంతా ప్రజల కళ్ళ ముందుండాలి. ఆ పాలనలో ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొంటూ, నిర్ణయాలు తీసుకునే, అవి అమలవుతున్నాయో లేదో పర్యవేక్షించుకునే స్థానంలో ఉండగలగాలి. ఏర్పడ్డ ప్రభుత్వాలు ప్రజల చేత పాలింపబడుతుండాలంటే ఇదే అర్థం. ఈ అర్థానికి వేరుగా మరే అర్థాన్ని ఆ మాటలను సాగదీసి, ముడచబెట్టి వాటి నెత్తిన పెట్టరాదు.

‘కళ్ళ ముందు పాలన, పాలనలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యము’ ఇదే ప్రజల చేత నడపబడే ప్రభుత్వం అంటే అర్థం. ఇది అమలు కావడానికి అధికార వికేంద్రీకరణ జరగడం, స్థానిక ప్రభుత్వాల వ్యవస్థ అమలులోకి రావడం, అధికారాలు, విధులు, నిధులు, బాధ్యతలు అన్నవి ఎక్కడికక్కడ విభజింపబడడం వినా మరో దారి లేదు. దేశ సేవ చేసుకోడానికి ఇంతకుమించిన మార్గం నాకు కానరావడం లేదని డాక్టర్ అంబేద్కర్ అన్నది, ఈ విధానాన్ని ఆచరణలోకి తెచ్చుకోడానికి ఎలాంటి తాత్సారం చేయకుండా ప్రయత్నించాలన్నదే.

కేంద్రీకృత అధికారాన్ని వదులుకొని, ఎక్కడికక్కడ స్థానిక ప్రజాప్రతినిధుల చేతికి అధికారాలనప్పగించినప్పుడే ఆ ప్రభుత్వాలు ప్రజల యొక్క ప్రభుత్వాలనబడతాయి. ఆ ప్రభుత్వాలు కూడా, ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంలోనే తమ పాలనను కొనసాగించినప్పుడే ప్రజల చేత నడుపబడే ప్రభుత్వాలనడానికి తగినవవుతాయి.

**కానీ ఈనాడు జరుగుతున్నదేమిటి?**

1) ప్రజలు తమను పాలించే గొప్ప నాయకుడు రావాలి, కావాలి అనుకుంటున్నారు.

2) అందుకు తగ్గట్టే పార్టీలు, పార్టీ నాయకులు కూడా తమకు పట్టం కడితే, వారి వారి వ్యక్తిగత ప్రయోజనాలు ఈడేరేలా వారిని పాలిస్తామని మహారాజులల్లే వాగ్దానాలు, వరాలు కురిపిస్తున్నారు. ఏది జరగకుండా చూసుకోవడమే అసలైన దేశసేవ అవుతుందని డాక్టర్ అంబేద్కర్ భావించారో, ఆ జరగకూడంది మాత్రం బలంగా జరుగుతూ వస్తోందీనాటికీ. జరగకుండా చూసుకోవడమే, అదీ ఏమాత్రం అలసత్వం లేకుండా చూసుకోవడమే దేశసేవ అవుతుందన్నాడో, ఆ రకమైన దేశసేవ మాత్రం సరిపడినంత బలంగా సాగడమే లేదు. గడచిన ఏడు దశాబ్దాల పైబడిన కాలంలో అడపాదడపా ఒకటీ, అరా అలాంటి యత్నాలు జరిగినా అవన్నీ ప్రజాచైతన్యం కారణంగా కాక, ఒకరిద్దరు వ్యక్తుల పైనున్న విశ్వాసం కారణంగా, ఆ వ్యక్తుల ప్రతిభాపాటవాల కారణంగా మాత్రమే జరిగాయి. కనుకనే అవేవీ ఆ వ్యక్తుల అనంతరం గానీ, ఆ వ్యక్తులపై ప్రజల విశ్వాసం సన్నగిల్లడం వలన గానీ, నిలదొక్కుకోలేకపోయాయి. అలాంటి ప్రయత్నాలలో పాలుపంచుకున్న నాయకులలో కూడా ‘ప్రజాస్వామ్యము – ప్రజాసంక్షేమము’ అన్నవాటి కంటే తమ తమ స్థానాలను నిలుపుకోవడం అన్నదానికే ప్రాధాన్యత ఉండాలనుకునే లక్షణం నెలకొని ఉండడంతో, ఐక్య కార్యాచరణలన్నీ కడకు అనైక్యత కారణంగా విఫలమవుతూ వచ్చాయి.

అదంతా గతం. ప్రస్తుత పరిస్థితులు మరింత అధ్వాన్నంగా తయారయ్యాయి. ఆనాటి రాజకీయులలోనూ అనైక్యత అనే వేరుపురుగు ఉన్నా, కొన్ని విలువలు పాటింపబడుతుండేవి. ఈనాటి రాజకీయాలలో విలువల గురించి మాట్లాడితే వింతగా చూసే పరిస్థితి నెలకొని ఉంది. ఎత్తుగడలు, కుటిల పన్నాగాలతో, ఎలాగొలా అనుకున్నది సాధించుకున్న వాడే సమర్థుడు అన్న భావన సర్వత్రా నెలకొని ఉంది. ప్రజలలో కూడా రాజకీయాల పట్ల విశ్వసనీయత అన్నది తొలగిపోయింది. ఎవరి ప్రయోజనాలు వారు చూసుకోవడంలో భాగంగానే జరుగుతున్నాయి. ఇంతవరకు ఇదంతా అందరికీ తెలుస్తున్నదే, బహిరంగ రహస్యమే.

సామాజిక మాధ్యమాలు, అందునా ఎలక్ట్రానిక్ మీడియా అడ్డూ ఆపూ, పద్ధతీ పాడూ లేకుండా చెలరేగిపోతున్న ఈ తరుణంలో, అటో ఇటో ఎటో ఒక వైపుకి వంగి ఉన్న రాజకీయ విశ్లేషకుల పోకడలూ విపరీతంగానే ఉంటున్నాయి. ఒక ఛానల్ చూస్తే మనకు కలిగే అభిప్రాయం మరో ఛానల్‌ను చూస్తున్నవారికి కలిగే అభిప్రాయాలతో ఎక్కడా సరిపోలడం లేదు. ప్రజలు కూడా ఛానల్స్ వాస్తవాలు చెబుతున్నాయని అనుకోవడం మానేశారు. తటస్థంగా ఉన్న జనం ఎవడి సొద వాడిది అనుకుంటుండగా, అటో ఇటో వంగి ఉన్న జనమైతే తమది అనుకున్న ఛానళ్ళు చెప్పేవన్నీ పచ్చి నిజాలనీ, అవతలి వాళ్ళ ఛానల్ చెప్పేవన్నీ అభూతకల్పనలేననీ అనుకోవడం, అనడం సాగిస్తున్నారు. జరుగుతున్నది ఏమిటో కనుక్కోవడం ఏదో ఒక ఛానల్‌ను చూడటం ద్వారా అర్థం చేసుకోవడం దాదాపు అసాధ్యం అన్న పరిస్థితి నెలకొని ఉంది. కనుక రాజకీయ పార్టీలకు సంబంధించి రెండు మూడు సాధారణ అంశాలను చెప్తాను.

1) దేశంలో ప్రజాస్వామ్యాన్ని కోరుకునే పార్టీ లేదు. పార్టీలలోనూ అంతర్గత ప్రజాస్వామ్యం లేదు.

2) ఏక నాయక స్వామ్యమే ప్రధానంగా (ఎక్కువలో ఎక్కువగా) నెలకొని ఉంది. అయితేగియితే, ఆ ఏక నాయకునికి అతి కొద్ది మంది ఆంతరంగికులుండి, కొంతమేర ఆ సుప్రీమ్, ఆ బృందపు సలహాలను, సూచనలను, అభ్యర్థనలను పట్టించుకుంటూ పాలన సాగించడం వరకు జరుగుతుండవచ్చు.

3) పెద్ద విషాదమేమంటే, ఈమధ్య అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రాలలోనూ కూడా ప్రతిపక్షం లేని.. పేరుకు ఉందనుకున్నా మాటా పలుకుకు తావులేని విధంగా అధికార పార్టీల ప్రభుత్వాలు

ఏర్పడుతున్నాయి. ఏక నాయక స్వామ్యము, ఏక పార్టీస్వామ్యము అమలవుతుందన్నమాట.

డాక్టర్ అంబేద్కర్ 73 ఏళ్ల నాడే ఈ పరిస్థితిని ఊహించి ఎంతో ఆందోళన పడ్డారు. ప్రజాస్వామ్యం పేరున ఈ దేశంలో నియంతృత్వమే అమలవుతుందేమోనన్నదే ఆయన ఆందోళన, తానలా భయపడడానికి ఆయన చూపిన కారణం, భక్తి, వీరపూజ, వ్యక్తి ఆరాధన ఈ దేశంలో చాలా బలంగా ఉంటుందన్నదే. ఆ వివరాలు ఆయన మాటల్లోనే వినండి.

"ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలనే ఆసక్తి కలవారందరికీ జాన్ స్టువర్టు ఇలా హెచ్చరిక చేశారు. వ్యక్తులు తమ స్వాతంత్ర్యాన్ని ఏ గొప్ప మనిషి పాదాల వద్దా సమర్పించకూడదు. తమ సంస్థలన్నింటినీ తిరగబెట్టే అధికారాలను అతనికి ఇవ్వకూడదు. దేశానికి జీవితాంతం సేవలు చేసిన మహాపురుషులకు సైతం కృతజ్ఞులై ఉండడంలో తప్పులేదు గానీ, ఆ కృతజ్ఞత చూపడానికీ కొన్ని హద్దులు ఉన్నాయి. ఐరిష్ దేశభక్తుడు డేనియల్-ఓ-కాన్నెల్ చెప్పినట్లుగా, ఏ వ్యక్తీ తన ఆత్మగౌరవానికి భంగం కలిగేంతగా కృతజ్ఞుడుగా ఉండనక్కరలేదు. తన శీలానికి భంగం కలిగే అంతగా ఏ స్త్రీ కృతజ్ఞురాలుగా ఉండనక్కర్లేదు. అలాగే ఒక దేశం తన స్వాతంత్ర్యానికి భంగం కలిగేంతగా మరో దేశానికి కృతజ్ఞత చూపనక్కర్లేదు".

**గమనిక: డాక్టర్ అంబేద్కర్ తాను చెప్పదలుచుకున్న మాటలకు ఉపబలకంగా ఉండడానికి పై మాటలు ఉటంకించి, తిరిగి తన మాటలుగా ఏమంటున్నారో చూడండి.**

"ఈ హెచ్చరిక ఇతర దేశాల విషయంలో కంటే, మన దేశం విషయంలో చాలా అవసరమైంది. ఎందుకంటే, ఇండియాలో భక్తి లేదా భక్తి భావం, లేదా వీర పూజ రాజకీయాలలో చాలా పెద్ద పాత్ర పోషిస్తుంది. ప్రపంచంలోని ఇతర దేశాలలో అది పోషించే పాత్ర కంటే, మన దేశంలో పోషించే పాత్ర చాలా ఎక్కువ. మత విషయాలలో భక్తి, ఆత్మవిముక్తికి ఒక మార్గం కావచ్చునేమో గాని, రాజకీయాలలో భక్తి లేదా వీరపూజ దివాళాకోరుతనానికి, తద్వారా ఏర్పడే నియంతృత్వానికి సూటిదారి అవుతుంది".

.. కొంతవరకు ముఖ్యమైన విషయాలను మీ దృష్టికి తెచ్చాననే అనుకుంటున్నాను. వ్యక్తిగతంగా మేము (సత్యాన్వేషణ మండలి) ప్రజాస్వామ్యవాదులం. రాజ్యాంగం సూచించిన రీతిలో ప్రజాస్వామ్యం అమలులోకి రావాలని త్రికరణశుద్ధిగా కదులుతున్నవాళ్ళం. కనుక సైద్ధాంతికంగా ప్రస్తుతం ఏ పార్టీకి అనుకూలురం కాదు. ఎందుకంటే రెండు తెలుగు రాష్ట్రాలలోని పార్టీలు, కేంద్రంలోని బిజెపి, కాంగ్రెస్ కూడా నియంతృత్వ పోకడలు గల పార్టీలే. అంతరంగంలో ఏకనాయక స్వామ్యంతో కూడిన రాజరిక వ్యవస్థను ఇష్టపడేవే. కాకుంటే వాటిలోని కొందరు ప్రజాసంక్షేమాన్ని, దేశ భవిష్యత్తును, రాష్ట్ర భవిష్యత్తును ఇష్టపడేవారుగానూ, మరికొందరు వాటి కంటే తమ ప్రయోజనాలకే పెద్దపీట వేసేవారుగను ఉండవచ్చు.

**డాక్టర్ అంబేద్కర్ వెల్లడించిన అభిప్రాయాలను 2024 ఎన్నికల్లో అన్వయించాలి.**

"మేము అధికారంలోకి వస్తే అధికార వికేంద్రీకరణ చేస్తాము. స్థానిక ప్రభుత్వాలకు పూర్తి అధికారాలను కట్టబెడతాము" అని పార్టీ ప్రణాళిక లోనే ప్రకటించండని ఆయా పార్టీల వారిని అంగీకరింపజేసే ప్రయత్నం ఒకటి చేయాల్సి ఉంది. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలప్పగించడం జరిగితే నియంతృత్వపు పట్టు సగంపైగా సడలిపోతుంది. ప్రజాస్వామ్యవాదులంతా కలసికట్టుగా పార్టీల్ని ఒప్పించగలిగితే, ఒత్తిడి చేయగలిగితే ఇప్పటికిదే ఒక పెద్ద ముందడుగు కాగలుగుతుంది.

**('2024 ఎన్నికలు: రాజకీయ సమీకరణ - ఒక విశ్లేషణ' వ్యాసం నుండి)**

# ఓటర్ల జాబితా సవరణ సక్రమంగా జరగలేదు

## -తగు చర్యలు తీసుకోవాలని ఈసీని కోరిన లోక్‌సత్తా -



రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యమైన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం మొక్కుబడిగా జరిగిందని, పరిస్థితిని సమీక్షించి వెంటనే తగుచర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాని అమరావతి సచివాలయంలో కలసి ఈ మేరకు వినతిపత్రం అందచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈసీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సవరణ ప్రక్రియకి రాష్ట్రంలో పూర్తిస్థాయి పర్యవేక్షణ కొరవడిందని, అందుకే అధికారులు మొక్కుబడిగా ఓటర్ల సర్వే నిర్వహించారన్నారు. అర్హులైనవారి ఓట్లు లేవని, ఒకే ఇంటి నెంబరుతో ఎక్కువ ఓట్లు ఉన్నాయని, ప్రతిపక్ష పార్టీలనుకున్నవారి ఓట్లు తొలగిస్తున్నారన్న విమర్శలు కొనసాగుతున్నాయని, ఇంతవరకూ జరిగిన సర్వే వివరాల్ని వెబ్‌సైట్‌లో ఉంచటంతోపాటు సర్వే పొడిగింపుకి అవకాశం ఇవ్వాలని ఈసీని కోరినట్లు తెలిపారు. ఓట్ ఇండియా – సేవ్ డెమోక్రసీ పేరుతో ఉత్తరాంధ్రలో డిగ్రీ కళాశాలల్లో ఓటు నమోదుపై విద్యార్థులతో పలు చైతన్య సదస్సులు నిర్వహించామని, ఓటరు నమోదు కోసం కళాశాలల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరామన్నారు.


# చదువులో ఆఖరు నుంచి ఆరోస్థానం

## - ఆర్. వెంకటరెడ్డి, ఎం.వి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్-

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 2021-22 పాఠశాలల పనితీరు గ్రేడింగ్ ప్రకారం- ఆరు కొలమానాల ఆధారంగా- దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో- వెయ్యి పాయింట్లకు గాను 479.9 పాయింట్లతో తెలంగాణ 31వ స్థానంలో నిలిచింది. అంటే కింది నుంచి ఆరవ స్థానంలో. జిల్లాలవారీగా చూస్తే దేశంలో ఉన్న 738 జిల్లాలలో- తెలంగాణలో ఉన్న 33 జిల్లాలకు 16 జిల్లాలు 500వ స్థానం నుంచి 600వ స్థానంలోను, 11 జిల్లాలు 400వ స్థానంలోను, 3 జిల్లాలు 300వ స్థానంలోను, 3 జిల్లాలు 200వ స్థానంలోను నిలిచాయి. సరాసరి చూస్తే మన 33 జిల్లాలు 485వ స్థానంలో ఉన్నట్టు. అంటే దేశంలోని 748 జిల్లాల్లో 484 జిల్లాలు మనకన్నా ముందున్నాయి.

రాష్ట్ర తలసరి ఆదాయం మూడు లక్షల రూపాయలకు పైనే ఉన్నా, హైటెక్ సిటీ హంగులు, ఐటీ హబ్‌లు, ఫ్లైఓవర్లు, నూతన సెక్రటేరియట్, రీజనల్ రింగ్‌రోడ్డు, మెట్రో రైళ్లు.. వంటి అభివృద్ధి కార్యక్రమాలు జరిగినా, రాబోయే తరాలకు నాణ్యమైన విద్యను అందించకపోతే రాష్ట్ర పౌరులు గౌరవప్రదమైన జీవనం కొనసాగించలేరు. నాణ్యమైన విద్యే ప్రజల ఆర్థిక పరిపుష్టికి అతి ముఖ్యమైన సాధనం. అది అందనప్పుడు ఆ ప్రభావం పడేది విద్యార్థుల మీద మాత్రమే కాదు. ఇది దీర్ఘకాలిక సామాజిక సమస్యలకు దారితీస్తుంది. ఆ వెనుకబాటుతనం తరాలపాటు కొనసాగుతుంది. ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి లేకపోవటం, సరైన వసతులు లేకపోవటం, ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు లేకపోవటం వంటి అనేకం నాణ్యమైన విద్య అందకపోవటానికి బలమైన కారణాలుగా ముందుకు వస్తాయి. కానీ ఇవన్నీ ఉన్న పాఠశాలల్లో కూడా అభ్యసన ఫలితాల్లో పెద్ద తేడా లేదనేది నివేదికల ద్వారా తెలుస్తున్న నిజం. ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య లేదన్న కారణంగా బోలెడు ఫీజులు భరిస్తూ ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల సామర్థ్యాల్లో కూడా పెద్దగా తేడా ఏమీ లేదు. అందువల్ల, సమస్యను ఒక 'విద్యాసంక్షోభం'గా గుర్తించినప్పుడే పరిష్కారం దొరుకుతుంది.

బడులకు బెంచీలు ఇవ్వడం, సున్నాలు వేయడం, మూత్రశాలలు, ప్రహరీ గోడలు కట్టడం, భోజనం ఏర్పాటు చేయడం, పుస్తకాలు ఉచితంగా పంచడం.. ఇవన్నీ అవసరమే. కానీ ఇవి చాలావరకు తల్లిదండ్రులను సంతోషపెట్టి, కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చి, స్థానిక నాయకులు ప్రారంభోత్సవాల హడావిడితో వేదికల మీద గొప్పలు చెప్పుకోవటానికే పనికి వస్తున్నాయి. నాణ్యమైన విద్య



అందించకపోతే వీటన్నిటి మీద పెట్టిన ఖర్చు అంతా బూడిదలో పోసిన పన్నీరే. అసలే అరకొరగా ఉన్న ఉపాధ్యాయులకు విధులను సక్రమంగా నిర్వహించనివ్వకుండా అనేక బోధనేతర పనులను అప్పచెప్పటం కూడా పిల్లలలో బోధనా సామర్థ్యాలు తగ్గటానికి ముఖ్య కారణం.

ప్రతిసారి విద్యాసంవత్సరం ఆరంభంలో నాణ్యమైన విద్యను అందించేందుకు రకరకాల ఆకర్షణీయమైన పేర్లతో విధానాలు తెస్తున్నారు. ఈ విధానాల రూపకల్పనలో ఉపాధ్యాయుల అనుభవాలను, క్షేత్రస్థాయిలో వారి సమస్యలను పరిగణలోకి తీసుకోరని, అసలు వారిని సంప్రదించరని వింటూనే ఉన్నాం. పై నుంచి ఆదేశాలు వచ్చాయి కాబట్టి అమలు చేయవలసిందే అంటూ ఉపాధ్యాయులపై బలవంతంగా ఈ విధానాలను రుద్దుతారన్న వాదనలు కూడా ఉన్నాయి. కాస్తో కూస్తో చొరవ తీసుకోవాలనుకున్న ఉపాధ్యాయులు సైతం ఇలాంటి వాతావరణం మధ్య ఉత్సాహం చూపించకుండా ఉండిపోయిన సందర్భాలు అనేకం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యను అందించడానికి తమ పాఠశాల స్థాయిలో తగిన ఆలోచనలను వారే చేసుకుని, తమ ప్రణాళికలను తామే రూపొందించుకునే ప్రక్రియ లేకపోవడం కూడా ఒక అవరోధమే.

ఉపాధ్యాయుల నుంచి జవాబుదారీతనం కోరుకొనేటప్పుడు అందుకు తగినట్టుగా వారికి మద్దతును కూడా అందివ్వకపోతే పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెరగవు. ఉపాధ్యాయులకు కావలసిన సామాగ్రిని అందివ్వాలి. పాఠశాల స్థాయిలో ప్రతి విద్యార్థికి సంబంధించి ప్రణాళికలు రచించే వెసులుబాటు ఇవ్వాలి. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవడానికి విద్యాశాఖ అధికారులు వారికి మద్దతుగా నిలవాలి. పర్యవేక్షణ పేరుతో ఉన్నత అధికారులు బెదిరింపులతో వ్యవస్థను నడిపించాలనుకుంటే అది సాధ్యపడే పని కాదని గమనించాలి. జవాబుదారీతనాన్ని మాత్రం ఉపాధ్యాయుల మీద నెట్టి తగిన మద్దతును ఇవ్వకుంటే ఫలితాలు ఉండవు. అధికారులు ఏమి

ఆశిస్తున్నారో అలాంటి నివేదికలు ఇచ్చి ఊరుకుంటారు ఉపాధ్యాయులు. అందుకే విద్యాలక్ష్యాలు నెరవేరడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లోంచి బయటపడి విద్యాభివృద్ధిలో ముందంజ వేయాలంటే ఇప్పుడు రాష్ట్రం ఒక విద్యాసంక్షోభంలో ఉన్నదన్న వాస్తవాన్ని ముందుగా ప్రభుత్వం గుర్తించాలి. ఇది కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయి ఉన్న సమస్య. తాత్కాలిక చర్యలతో ఫలితాలు రావు. ఒక విద్యా ఉద్యమ కార్యాచరణకు పూనుకోవాల్సిన తరుణమిది! రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి దగ్గర నుంచి ప్రజాప్రతినిధులంతా సంక్షోభంలో ఉన్న విద్యావ్యవస్థ రక్షణకు కదలాలి. చదువులపరంగా దేశంలో దాదాపు చివరి వరుసలో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలపడానికి సమష్టిగా కృషి చేయాలి.

ఉపాధ్యాయుల నుంచి జవాబుదారీతనం కోరుకొనేటప్పుడు అందుకు తగినట్టుగా వారికి మద్దతును కూడా అందివ్వకపోతే పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెరగవు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవడానికి విద్యాశాఖ అధికారులు వారికి మద్దతుగా నిలవాలి.

**(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**



# ఓట్ ఇండియా, సేవ్ డెమోక్రసీ



**దేశం అభివృద్ధి చెందాలంటే మనకి ఎటువంటి పరిపాలన కావాలో అటువంటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే హక్కు రాజ్యాంగం ఓటు ద్వారా మనకి కల్పించిందని, డిగ్రీ చదువుతున్న ప్రతి విద్యార్థి తమ ఓటుహక్కును నమోదు చేసుకుని వచ్చే ఎన్నికల్లో వినియోగించుకుని మంచి రాజకీయాలకు మద్దతు పలకాలని ఓట్ ఇండియా, సేవ్ డెమోక్రసీ సమన్వయకర్త, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగిన విద్యార్థుల చైతన్య సదస్సులో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు తమ జీవితాల్లో ఎన్నికలు, పరిపాలనకు ఉన్న ప్రాధాన్యతను గ్రహించుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ బి.దామోదరరావు మాట్లాడుతూ, వ్యవస్థ పతనమైపోతున్నప్పుడు పట్టించుకోవలసినది విద్యార్థులేనని, రాజకీయాలు మంచిగా ఉండకపోతే ఆ దెబ్బ ప్రత్యక్షంగా, పరోక్షంగా మన కుటుంబాలపై పడుతుందని, ఉపాధి దొరకదని గుర్తుచేశారు. మార్పు యువతతోనే సాధ్యమన్నారు. ఓటరుగా నమోదవటం, ఓటు సద్వినియోగం ప్రాధాన్యతను వివరిస్తూ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జాగరపు ఈశ్వర ప్రసాద్, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, ఎస్.వి నాగేశ్వరరావు, రామచంద్ర, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.**

# పటిష్ఠ ఫ్యామిలీ డాక్టర్ల వ్యవస్థకి సమయమిది

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ -

ఢిల్లీ మొహల్లా క్లినిక్‌లపై కాంగ్రెస్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మధ్య ఇటీవల తలెత్తిన వివాదం చూస్తే, ప్రజలకు నిజంగా అవసరమైన అంశాలపై అర్థవంతమైన, ఆరోగ్యకరమైన చర్చ రేకెత్తించటం పట్ల మన మీడియాకు విముఖత ఉందా అనిపించకమానదు. రాజకీయాలను ఉత్కంఠ, కేరింతల ఆటగా భావించే ధోరణి ఒక వ్యసనంలా మనల్ని పట్టిపీడిస్తోంది. మంచి ఆరోగ్యాన్ని ఎలా అందించాలన్న చర్చ కొరవడింది.




పెద్ద ఆర్థిక వ్యవస్థలన్నిటిలోనూ ఆరోగ్య రంగంపై ప్రభుత్వ ఖర్చు అతి తక్కువ భారతదేశంలో మాత్రమే. యూనియన్, రాష్ట్రాల్లో కలిపి మన ప్రభుత్వాలు ఆరోగ్యంపై జాతీయాదాయంలో 1.2% దాకా ఖర్చు పెడుతున్నాయి. ఇందులో మూడో వంతు యూనియన్ ప్రభుత్వ ఖర్చు కాగా, రెండొంతులు రాష్ట్రాలది. ప్రభుత్వ ఆరోగ్య నిధుల్ని ఒక్కసారిగా పెంచేశామని ఇటీవల చెప్పుకుంటున్న లెక్కలు తప్పుదోవ పట్టించేవి. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, పౌష్టికాహారం కూడా ఆరోగ్య పద్దులో కలిపేసి జీడీపీ అంకెల్ని 2.1%కి పెంచి చూపారు. మన దేశంలో ఆరోగ్యంపై 70% వ్యయం ప్రయివేటుగా చేస్తున్నది, అందులోనూ ఎక్కువ శాతం ప్రజలు సొంతంగా జేబుల్లో నుంచి పెట్టుకుంటున్నది (ఓఓపీ). ప్రజల సొంత ఖర్చు భారం ఆరోగ్య రంగంలో వేగంగా పెరుగుతోంది. ప్రజానీకంలో అత్యధికులకు నాణ్యమైన వైద్యం అందుబాటులో లేదు. మన కార్మికుల్లో 90% మంది అసంఘటిత రంగంలో ఉన్నారు. వారిలోనూ అత్యధికుల ఆదాయాలకు గ్యారంటీ లేదు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. ఆరోగ్య సమస్య వస్తే పేద, దిగువ మధ్యతరగతి వర్గాల జీవితం ఛిన్నాభిన్నమవుతోంది. అనారోగ్యం బారిన పడిన వ్యక్తి పనిచేయలేడు, డబ్బు సంపాదించలేడు. ప్రభుత్వ వైద్య సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్నందున చికిత్స ఖరీదైపోయింది. ప్రైవేటు ఆరోగ్య ఇన్సూరెన్స్ ఎక్కువశాతం సంఘటిత రంగానికే పరిమితమైంది. ఇన్సూరెన్స్ కవరేజీ ఉన్నవాళ్లు, ఈఎస్ఐ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ ఉమ్మడి ఇన్సూరెన్స్ కార్యక్రమాలు సైతం ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలకి జేబులో నుంచి ఖర్చుపెట్టాల్సి వస్తోంది.

ఔట్ పేషెంట్లలో అత్యధికులు (85%) ప్రయివేటు డాక్టర్ల వద్దకు వెళ్తున్నారు. ఆసుపత్రుల్లో చేరే (ఇన్ పేషెంట్) ఆరోగ్య సంరక్షణలో కూడా 60% దాకా ప్రయివేటు రంగంలో ఉంది. నాణ్యమైన ఆరోగ్యం అందుబాటులో లేకపోవటం, సొంతంగా ఖర్చు చేయాల్సి రావటం తక్కువ ఆదాయ కుటుంబాల్ని కుంగదీస్తోంది. కేవలం అనారోగ్య కారణంగా ఏటా దేశమంతటా 5 కోట్ల మంది, రెండు తెలుగు రాష్ట్రాలలో 45 లక్షల మంది పేదరికంలోకి జారిపోతున్నారు. ఆస్పత్రి చికిత్స పేదలకు విస్తరించేందుకు కొంతకాలంగా చేస్తున్న ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ వంటి ప్రయత్నాల్ని ఆహ్వానించాలి. అవి అవసరం. కానీ ఉచిత ఆసుపత్రి సేవలను అన్ని జబ్బులకూ విస్తరించి, అందరికీ ఆరోగ్యాన్ని అందించేందుకు ఒక ఆచరణసాధ్య వ్యవస్థ నిర్మించటానికి మనం ఇంకా చాలా చేయాల్సుంది.


భారత్‌లో ప్రాథమిక, ఔట్ పేషెంట్ సేవలు మరీ అరకొర స్థాయిలో ఉన్నాయి. గ్రామాల్లో చాలామంది జబ్బు ముదిరి ఇక భరించలేని పరిస్థితి వచ్చేదాకా అనారోగ్యం నిశ్శబ్దంగా భరిస్తున్నారు, లేదంటే, శిక్షణ లేని స్థానికంగా అనధికార వైద్యం చేసేవారి వద్దకు పోతున్నారు. నగరాల్లో ప్రభుత్వ పెద్దాస్పత్రుల వద్ద మితిమీరిన రద్దీ ఉంటోంది. న్యూఢిల్లీ 'ఎయిమ్స్'కి రోజుకు 12000 మంది ఔట్ పేషెంట్లు వస్తున్నారు. ఇది ప్రపంచ రికార్డు. అత్యున్నత స్థాయి ఆరోగ్య సేవల సంస్థలు, బోధనాసుపత్రులు మౌలికంగా రెఫరల్, తృతీయ స్థాయి వైద్య సేవల కోసం ఉద్దేశించినవి. కానీ సరైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ లేకపోవటంతో, సాధారణ ఆరోగ్య సమస్యలున్న రోగులు, ఆసుపత్రి సేవలు అవసరం లేని వారు కూడా జిల్లా, బోధనాసుపత్రులకు బారులు తీరుతున్నారు. కాస్త పేరున్న ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రోజూ 4000-6000 మంది ఔట్ పేషెంట్లు ఉంటున్నారు.

నాణ్యమైన ఔట్ పేషెంట్, ఫ్యామిలీ ఆరోగ్య సంరక్షణ మన ఆరోగ్య వ్యవస్థకు కీలక పునాది కావాలి. మంచి కుటుంబ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థతో తక్కువ ఖర్చుతోనే అనేక

వ్యాధులను నియంత్రించవచ్చు. సరైన ఫ్యామిలీ కేర్ ఆరోగ్య వ్యవస్థ లేకపోవటంతో, చాలామంది రోగులు సకాలంలో వైద్యం తీసుకోవటం లేదు. ఆలస్యాల వల్ల తరచూ ఆరోగ్య సమస్యలు ఇంకా పెరుగుతూ ఖరీదైన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సేవలు అవసరమవుతున్నాయి. ఈ సంక్షోభాన్ని పూర్తిగా నివారించగలం. మన వ్యాధుల తీరు మారుతున్నది. కొన్ని దశాబ్దాల క్రితం భారతదేశంలో అంటువ్యాధులతో అత్యధిక శాతం రోగులు సతమతమయ్యేవారు, కానీ ఇప్పుడు దీర్ఘకాల వ్యాధులు డయాబెటిస్, అధిక రక్తపోటు, కీళ్లనొప్పులు, కిడ్నీ వ్యాధి, గుండెజబ్బు, క్యాన్సర్ పెరుగుతున్నాయి. మొత్తం వయోజనుల్లో సుమారు 11% మంది డయాబెటిక్ కాగా, 15% మంది ప్రీ డయాబెటిక్ దశలో ఉన్నారని ఇటీవల లాన్సెట్ అధ్యయనం తెలిపింది. ఈ 24 కోట్ల మందిలో అత్యధికులకు సరైన ఆరోగ్య సేవలు, చికిత్స అందవు. ఫ్యామిలీ క్లినిక్‌లు గనక ఉంటే ఈ రోగులకి తేలిగ్గా, తక్కువ ఖర్చుతో, స్థానికంగానే వైద్యం చెయ్యవచ్చు. సరైన కుటుంబ ఆరోగ్య సంరక్షణ లేకపోవటం వల్ల, అటువంటి కేసుల్లో ఎక్కువ శాతం మంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆ ఆరోగ్య సమస్య కాస్తా కాలక్రమంలో పెద్ద జబ్బుగా ముదిరి ఖరీదైన ఆస్పత్రి చికిత్స అవసరమవుతోంది. అటువంటి చాలా కేసుల్లో జరిగిన నష్టం పూడ్చలేనిది, ఒకోసారి ప్రాణాంతకం కూడా కావచ్చు. మొదట్లోనే రోగ నిర్ధారణ, సరైన నిర్వహణ, చికిత్స జీవితాల్ని కాపాడతాయి, మంచి ఆరోగ్యానికి భరోసా లభిస్తుంది, డబ్బు ఆదా అవుతుంది.

ఢిల్లీ ప్రభుత్వ మొహల్లా క్లినిక్ నమూనా ఒక మంచి ముందడుగు. అయితే భారతదేశమంతా పటిష్ఠ ఫ్యామిలీ కేర్ ఆరోగ్య వ్యవస్థకి అంతకంటే సమర్థవంతమైన, వినూత్నమైన నమూనా మనకు కావాలి. భరోసా ఇవ్వగలిగే స్థాయి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందాలంటే మనకు ప్రతి 15,000 జనాభాకి ఒక ఫ్యామిలీ కేర్ ఫిజీషియన్ ఉండాలి. గ్రామాలకు కేంద్రంగా ఉండే చిన్న పట్టణంలో కొంతమంది డాక్టర్ల బృందం ఒక చోట అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ నిధులతో నడిచే ఈ ఫ్యామిలీ కేర్ వ్యవస్థ నడుస్తుంది. ప్రతి డాక్టర్‌కి అందులో సొంత క్లినిక్ ఉంటుంది. రోగులకు ఎంపిక అవకాశం, అక్కడున్న వైద్యుల బృందంలో తనకు నచ్చిన డాక్టర్ వద్దకు వెళ్లగలిగే స్వేచ్ఛ ఉండాలి. వైద్య సేవలు అందించిన ప్రతి ఔట్ పేషెంట్‌కీ ఇంతని ఒక నిర్ధారిత ఫీజు ఆ ఫిజీషియన్‌కు లభిస్తుంది. అప్పుడు ఎక్కువ మంది రోగులను ఆకర్షించేందుకు డాక్టర్ల మధ్య పోటీ ఏర్పడుతుంది. ఎందుకంటే, ఎక్కువ ఆదాయం రావాలంటే వాళ్లు ఎక్కువ పేరు తెచ్చుకోవాలి, రోగుల్లో విశ్వసనీయత పెంచుకోవాలి.

పది మంది వైద్యుల బృందం ఒక రోజులో 500 మంది ఔట్ పేషెంట్ల దాకా చూడగలుగుతారు. చుట్టుపక్కల ప్రాంతాలు, గ్రామాల్లోని లక్ష నుంచి లక్షన్నర మంది



ప్రజానీకానికి సేవల్ని అందించగలుగుతారు. అక్కడే ఉచిత వైద్య పరీక్షల సదుపాయాలు ఉండాలి. స్థానిక ల్యాబొరేటరీలో సాధారణ పరీక్షలు నిర్వహించి, క్లిష్టమైన పరీక్షల కోసం అన్ని క్లినిక్‌ల శాంపిల్స్‌ను పూలింగ్ పద్ధతిలో అదే జిల్లాలోని ఒక పెద్దనగరానికి పంపించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత డయాగ్నొస్టిక్ నమూనా బాగా అమలవుతోంది. అదే అమలు చేయవచ్చు. డాక్టర్ రాసిన మందుల్ని ఒక డిస్పెన్సరీ ఉచితంగా అందిస్తుంది. ఔషధాల పంపిణీకి తమిళనాడులో పటిష్ఠమైన వ్యవస్థ ఉంది. అదే నమూనాను అనుసరించవచ్చు. అన్ని సేవల్నీ ఒక చోటకు చేర్చి అందించే అటువంటి పూలింగ్ ఏర్పాట్లు, ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం వల్ల చాలా గ్రామాలకు 10 కిలోమీటర్లలోపు, పట్టణాలు, నగరాల్లో అయితే 2 కిలోమీటర్లలోపు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వస్తుంది. పూలింగ్ వల్ల ఎంపిక స్వేచ్ఛ, పోటీ ఉంటాయి. కాబట్టి జవాబుదారీతనం ఉంటుంది, నాణ్యమైన సేవలకు భరోసా లభిస్తుంది. అన్నీ ఒకే చోట ఉమ్మడిగా అందించే ఏర్పాటు వల్ల వైద్య పరీక్షలు, మందుల పంపిణీ ఖర్చు తగ్గుతుంది.

ఇటువంటి వ్యవస్థ దేశం మొత్తానికీ ఏర్పాటు చేయటానికి 30,000 కోట్ల దాకా ఖర్చవుతుంది. అంటే, జాతీయాదాయంలో 0.1%. ఇందుకోసం కేవలం 1,00,000 మంది డాక్టర్లు చాలు. మనకు నమోదైన డాక్టర్లు 14 లక్షల మంది ఉన్నారు. ఏటా 1 లక్షమంది వైద్యులను ఉత్పత్తి చేస్తున్నాం. తక్కువ ఖర్చుతో ఆరోగ్య రంగాన్ని మెరుగుపరచటానికి భారతదేశానికి ఎన్నో అనుకూలతలున్నాయి. పేదరిక నిర్మూలనకు, ఉత్పాదకతను పెంచటానికి ఆరోగ్య రంగాన్ని మెరుగుపరచటం అత్యంత కీలకమని మనం గుర్తించాలి. ఆరోగ్య రంగాన్ని మెరుగుపరచటానికి ఇంకా ఎంతో చేయాలి. కానీ మంచి నాణ్యత కలిగి, అందుబాటులో ఉండే ప్రాథమిక, ఫ్యామిలీ కేర్ వ్యవస్థ నిర్మాణం ఒక మంచి ప్రారంభం.

# సహకార రంగం మన ఉమ్మడి భవిష్యత్తుకి కీలకం




సహకార సంస్థలు సమర్థంగా పనిచేస్తూ శక్తిమంతం కావటం వ్యవసాయానికి, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కీలకమని, అందుకే సహకార స్వయంప్రతిపత్తి కోసం జీవితకాల పోరాటం చేసి ఎట్టకేలకు అందుకు గ్యారంటీనిచ్చే 97వ రాజ్యాంగ సవరణ సాధించగలిగానని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఆప్కాబ్ వజ్రోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఉత్సవంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, బ్యాంక్ చైర్‌పర్సన్ ఝాన్సీ, ఎండీ శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేపీ ప్రసంగంలో కొన్ని అంశాలు..

ఈ సభలో పాలుపంచుకుంటుంటే కాలం గిర్రున వెనక్కి తిరిగి ముప్పై రెండున్నర సంవత్సరాల క్రితానికి వెళ్లింది. ఆప్కాబ్ ఎండీగా రెండు సమస్యలకు పరిష్కారం వెతకాల్సి వచ్చింది. ఒకటి, ఆప్కాబ్, రెండు, బ్యాంకు సీపీడీ. సంస్థకు వచ్చేనాటికి దేవీలాల్ దేశంలో మొట్టమొదటిసారిగా వ్యవసాయ రుణమాఫీ చేశారు. ఆ సమయంలో 100 రూపాయలు రుణమిస్తే 8 తిరిగొచ్చేది. జాతీయ బ్యాంకుకి భారతదేశంలో రికార్డు అప్పు. ఏ రాష్ట్రంలో ఏ సహకార బ్యాంకుకి లేనంతగా పెద్ద అప్పు చేసి మన రాష్ట్రంలో డిఫాల్ట్ చేశాం, తిరిగి చెల్లించలేకపోయాం. ఈవేళ ఆనందంగా ఉంది. అన్ని జిల్లాల్లో బ్యాంకులు దాదాపు లాభాల్లో ఉండటం సంతోషంగా అనిపిస్తోంది. ఆరోజుల్లో ఏలూరు బ్యాంకు నెంబర్‌వన్. ఇప్పుడు నష్టాల్లో ఉంది, ఏవో సమస్యలున్నాయని చెబుతున్నారు. అక్కడ నాయకత్వం సవాలుగా తీసుకుని బ్యాంకుని పెంచాలి. చాలా గొప్పవాళ్లు చైర్‌పర్సన్లుగా అక్కడ పనిచేశారు.

మూడు అంశాలు చెప్పదల్చుకున్నాను. మొట్టమొదటిది, సహకార రంగ స్వయంప్రతిపత్తి కోసం జీవితమంతా పోరాడాను. ఆప్కాబ్ ఎండీగా పోరాడాను. బాధ్యతలు చేపట్టాక ముఖ్యమంత్రి గారి దగ్గరకువెళ్లి మాకు పాలకవర్గం లేదు, జిల్లా సహకార బ్యాంకులకు ఎన్నికైన అధ్యక్షులు లేరు, ఎన్నికలు జరపండి అని కోరాను. మీ ఆదేశాలకు ఎదురేముంది, అన్ని అధికారాలూ మీకున్నాయి గదా అన్నారు. నేను వెంటనే, ముఖ్యమంత్రి గారూ! మీ ఆదేశాల్ని నేను ఎందుకు పాటిస్తున్నాను అనడిగా. ఎందుకు అన్నారు. ప్రజలు తీర్పు ఇచ్చి మిమ్మల్ని నాయకులుగా చేశారు కాబట్టి.. అన్నాను. అధికారులుగానీ, మిగతావాళ్లుగానీ, ఎంతో గొప్పవాళ్లనుకున్న




రాజ్యాంగ సవరణ సాధించాను. నాకు ప్రేమాస్పదులైన వ్యక్తులలో కురియన్ ఒకరు. జాతీయ సలహా మండలి (ఎన్ఏసీ)లో సభ్యునిగా ఉన్న అవకాశాన్ని వినియోగించుకుని 97వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 19(1)(సి)లో మార్పు చేసి, ఎలాగైతే ట్రేడ్‌యూనియన్లు, మిగతా సంఘాలకు అధికారం, స్వతంత్రాధికారం ఉంటుందో, అదేరీతిలో సహకార సంస్థలకూ ఉండేలా ఏర్పాటు అన్ని పార్టీలనూ, ప్రభుత్వాన్ని ఒప్పించి తీసుకొచ్చాను. కులాలు, ప్రాంతాలు ఏవైనా కావచ్చు.. ప్రజల సంస్థలు ప్రజల సంస్థలుగా పనిచేయాలి.

ఆ సహకార బ్యాంకులో ఉండగానే నెదర్లాండ్స్‌లోని సహకార బ్యాంకు వ్యవస్థను

వాళ్లుగానీ మీ ఆదేశాల్ని శిరసావహించి పనిచేయాలి. అది ప్రజాస్వామ్యం అన్నాను. నిజమే అన్నారాయన. మరి మీకు విశ్వసనీయత ఎన్నికల ద్వారా వస్తే, మా బ్యాంకుకి పాలకపక్షం ఎందుకు ఇవ్వరు అనడిగా. అధికారం ఇస్తామంటే వద్దంటున్నారేంటి అని ప్రశ్నించారు. ఆ తర్వాత ఎన్నికలు జరిపారు. నేను బ్యాంకుకి రాగానే, సంక్షోభంలో ఉన్న బ్యాంకు కాబట్టి ఏం చేయాలో ఒక ప్రణాళిక తయారుచేశాను. కమిషన్ ఆఫ్ కోఆపరేషన్ దగ్గరికి వెళ్లి ఫలానా ఫలానా చేయాలండీ బ్యాంకు బాగుపడాలి అని కోరా. అంతా బాగుందిగానీ నేను మాత్రం చేయను అన్నారాయన. ఆయన మంచివ్యక్తి కూడా. అదేంటండీ, అంతా బాగుంది గానీ చేయనంటే ఎలా, నాకర్థంకావటం లేదు అన్నా. అదంతే జేపీ, ఎలాగూ ఇది జరిగే పని కాదు, ఇందులో బోలెడు రాజకీయం ఉంది అన్నారు. సారీ, మీ సమయం వృధా చేశాను. మళ్లీ సహకార బ్యాంకు ఎండీగా ఉన్నంతవరకు మీ దగ్గరకు రాను అని వచ్చేశాను. ఆ తర్వాత ఉన్నతాధికారులను కూర్చోబెట్టి, మీరెప్పుడూ కమిషన్ ఆఫ్ కోఆపరేషన్, సహకార సంఘాల చట్టం అన్న మాటల్ని ఉపయోగిస్తే ఉద్యోగాలు ఊడబీకుతా అని చెప్పా. రిజర్వుబ్యాంకు నిబంధనల్ని, బ్యాంకింగ్ చట్టాన్ని ఉపగయోగించుకుందామన్నా. ఇప్పుడు ఆ పరిస్థితి మారటం సంతోషం. చాలామంది ఈవేళ సమర్థిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం వస్తోంది, అనవసర జోక్యం చేసుకోవటం కాకుండా.

ప్రజల సంఘాలు ప్రజల సంఘాల్లా నడవకపోయినట్లయితే, ప్రభుత్వాలు పైనుంచి పెత్తనం చేస్తుంటే అది ప్రజాస్వామ్యం కాజాలదు. అందుకే ఎన్.టి.ఆర్‌ని, వర్గీస్ కురియన్‌ని కలిపి తెలుగునాట 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార) చట్టం తీసుకురావటంలో కీలక పాత్ర పోషించాను, ఆ తర్వాత పట్టుబట్టి 97వ

అధ్యయనం చేసే అవకాశం లభించింది. అక్కడ ప్రపంచంలోని అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటిగా ఉన్న రాబో బ్యాంకులో నాకు ఆశ్చర్యకర విషయం కనిపించింది. చిన్న దేశంలో ఉన్నప్పటికీ ఆ బ్యాంకు పాలక వర్గంలో 270, 300 సొసైటీలు, 3 లక్షల మంది సభ్యులున్నారు. మన దేశంలో అన్ని బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్ల కంటే ఆరోజుల్లో ఆ బ్యాంకులో అంతకంటే ఎక్కువ ఉండేది. ఈ 30 ఏళ్లలో మన దేశంలో పరిస్థితి మారింది. ఆనాడు నెదర్లాండ్స్‌లో బ్యాంకు వార్షిక సమావేశం జరిగితే ప్రధానమంత్రి వచ్చి కూర్చున్నారు. ఆయనకు 5 నిమిషాలు మాట్లాడే అవకాశం ఇచ్చారు. 24 మంది పాలకవర్గంలో 23 మంది ప్రభుత్వంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన మంత్రులున్నారు, ఉన్నతాధికారులున్నారు. ఒకాయన పార్లమెంట్ స్పీకర్. ఒకాయన ప్రతిపక్ష కూటమికి చెందినవాడు. నేను వెళ్లిన సమయంలో బ్యాంకు చైర్మన్ పదవి ఖాళీ అయింది. అక్కడ చైర్మన్ మూడు, నాలుగేళ్లకు కాదు. ఒకసారి చైర్‌పర్సన్‌గా ఎన్నికైతే ఆ మనిషి రిటైర్ కావాలి లేదా చనిపోవాలి. దిగ్భ్రాంతికర విషయమేమంటే, అధికార పక్షానికి చెందిన 23 గురు కలిసి ప్రతిపక్షానికి చెందిన ఆ ఒక్క మనిషిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. వాళ్లని అడిగా. మా దేశంలో





ఎన్నికలంటే క్యాంపులు పెట్టుకుంటాం, ఒక సొసైటీలో ముగ్గురు అటు, అయిదుగురు ఇటు ఉంటే బేరసారాలు జరుగుతాయి. అధ్యక్ష పదవికి గందరగోళం జరుగుతుంది, జనరల్ ఎలక్షన్లలోలాగా బారులు తీర్చి ఓట్లు వేసే ఏర్పాట్లు, ఇతర తతంగాలు చోటుచేసుకుంటాయి. చాలా విచిత్రంగా ఉంది, అధికారం మీ చేతుల్లో ఉంటే ప్రతిపక్షానికి చెందిన వ్యక్తిని ఎన్నుకున్నారేంటి అని అడిగా. వాళ్లేమన్నారో తెలుసా – 'సిద్ధాంతాల విషయంలో మేం రాజీపడం, రాజకీయాల్లో మా సిద్ధాంతం వేరు, కాబట్టి పోరాడతాం, ఆయన్ని ఓడిస్తాం. కానీ బ్యాంకును అత్యంత సమర్థంగా నడిపేవాడు, డబ్బును గురించి తెలిసిన, భవిష్యత్తును కాపాడే, ప్రపంచం ఏ మార్గాన పోతోందో తెలిసిన, ఆ విజ్ఞత గల మనిషి కాబట్టి.. ఇంత ప్రసిద్ధ బ్యాంకుకి ముందుచూపుతో దారి చూపగల వ్యక్తి అని విశ్వసిస్తున్నాం. ఆయన చేతుల్లో మా డబ్బు, భవిష్యత్తు సురక్షితమని భావిస్తున్నాం'.. ఆ శక్తి మనకి సమకూరాలి. ఏ పార్టీ, ఏ ప్రభుత్వం ఉన్నా మన ఉమ్మడి భవిష్యత్తుకి సహకార రంగంలో బలమైన పునాది పడాలి. ఆ ప్రయత్నం జరుగుతుందని ఆశిస్తున్నా.

వ్యవసాయ రంగంలో ప్రకృతి వైపరీత్యాలకన్నా ప్రభుత్వాల తాత్కాలిక విధానాలు, అపసవ్య ధోరణుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో రైతు పాదయాత్రల వల్ల రాష్ట్రాల మధ్య ధాన్యం అమ్మకాలపై ఆంక్షలు తొలగటంతోపాటు 2011లో బియ్యం ఎగుమతులపై ఉన్న ఆంక్షలు తొలగాయి. అప్పట్నుంచి బియ్యం ఎగుమతుల్లో మన దేశం ప్రపంచంలో అగ్రస్థానంలో కొనసాగుతూ వచ్చింది. ఇటీవల మళ్లీ యూనియన్ ప్రభుత్వం బాస్మతేతర బియ్యం ఎగుమతుల్ని నిషేధించింది. అదేరీతిలో, కొంత దిగుమతి సుంకం విధించి వంటనూనెల్లో స్వావలంబన సాధిద్దామనే ఆలోచన కూడా కరువైంది. మన దేశంలో 20% మంది రైతులు 2.7 కోట్ల హెక్టార్లలో నూనెగింజలు పండిస్తున్నా, రూ.1,60,000 కోట్ల రూపాయలతో వంటనూనెల్ని దిగుమతి చేసుకుంది. పండించిన పంటకు రైతులకు మంచి రేటు రాకుండా ఇలా అనాలోచిత, తాత్కాలిక విధానాలతో అడ్డుకుంటూ ఎన్ని పథకాలను ప్రకటించి, నినాదాలిచ్చి ఉపయోగమేంటి? వ్యవసాయానికి సబ్సిడీలను హేతుబద్ధంగా కొనసాగిస్తూనే పండించిన పంటకు మార్కెట్‌లో న్యాయమైన రేటు వచ్చే ఏర్పాటు చేస్తే రైతు ఆదాయం నిజంగా పెరుగుతుంది.

మరోవంక, జాతీయ స్థాయిలోగానీ, రాష్ట్రాల్లోగానీ ఆర్థిక వ్యవస్థ చాలా అధ్వాన్నంగా ఉంది. చాలా రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. అప్పులు చేస్తే వాటికి వడ్డీలు మనమే కట్టాలి. వనరుల్ని పొదుపుగా వినియోగించుకోకుండా.. దీర్ఘకాలిక ప్రయోజనాలపై దృష్టిపెట్టకుండా తాత్కాలిక అవసరాలను తీర్చుకుంటే జాతికి తీవ్ర నష్టం చేస్తున్నట్లే. ప్రభుత్వాల ఆదాయం మొత్తం జీతభత్యాలు, పింఛన్లు, అప్పుల వడ్డీలు కట్టేందుకే సరిపోవటం లేదు. ఆర్థిక వ్యవస్థ, ఖజానాను కాపాడుకోకపోతే భవిష్యత్తులో చాలా కష్టాల్లో పడతాం. అప్పులు చేసినా వాటిని తీర్చగలిగే ఆస్తులను సృష్టించాలి. దీర్ఘకాలిక ప్రయోజనాల గురించి ఆలోచించాలి. వ్యక్తి సంక్షేమం కావాలి. పేదల్ని ఆదుకోవాలి. దాంతోపాటుగా దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం పెట్టుబడులు రావాలి. ఆదాయం పెరగాలి. పేదరికం పోవాలి.

# తక్కువ జనాభా పంచాయతీలతో మరింత పెరిగిన స్థానిక సంక్షోభం




స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాల్ని బదిలీ చేయకుండా దేశానికే ఆదర్శప్రాయంగా గ్రామ సచివాలయాలను, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి స్థానిక సాధికారత కల్పించామని ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వం మభ్యపెడుతుండగా, జాతీయ స్థాయిలో ఇటీవల ఉత్తమ అవార్డులు గెలుచుకున్న పంచాయతీలున్న తెలంగాణలో కూడా పరిస్థితి అదే రీతిలో ఉందని పలువురు సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నారు. అభివృద్ధి పనులకు అప్పులు చేసి మరీ ఖర్చు చేసినా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయటం లేదని, యూనియన్ ప్రభుత్వం కేటాయించిన డబ్బుని కూడా ఇతర అవసరాలకు మళ్లిస్తోందని ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయకుండా వీలైనంత కుంగదీయటానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వాలు వ్యవహరించిన రీతిలోనే తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖరరావు, జగన్మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. దీంతోపాటు, తెలంగాణలో ప్రభుత్వం ముందుచూపు లేకుండా వ్యవహరించటం వల్ల ఓ కొత్త సమస్య అదనంగా ఏర్పడింది. రాష్ట్రంలో చిన్న గ్రామాలను కలిపి కనీసం 20-30,000 జనాభా ఉన్న క్లస్టర్‌ను పంచాయతీగా మారిస్తే, ఆర్థికంగా స్వావలంబన లభించటంతోపాటు ఎన్నికల్లో కుల ప్రభావం కూడా తగ్గి ప్రజాస్వామ్యం మెరుగుపడుతుందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు చెప్పినా కేసీఆర్ ప్రభుత్వం వినిపించుకోలేదు. తండాలు, గూడేల్ని కూడా పంచాయతీలుగా ప్రకటించారు. తెలంగాణలో ఇప్పుడు 12,769 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో సగానికిపైగా వెయ్యి కంటే తక్కువ జనాభా ఉన్నవే. అందులో కొత్తగా పంచాయతీలుగా ఏర్పడిన తండాలు, గూడేలు 3,146 ఉన్నాయి.

పలు తక్కువ జనాభా పంచాయతీలకు ఆదాయాలు అంతంత మాత్రంగా ఉన్నాయి.

గ్రామ పంచాయతీలకు ఇంటి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. గతంలో నల్లా కనెక్షన్లకు డిపాజిట్లు, నెలవారీ పన్నులు ఉండేవి. మిషన్ భగీరథ అమల్లోకి వచ్చాక అవి ఆగిపోయాయి. ఇవి కాకుండా లైసెన్సులు, బంజరుదొడ్డి, అంగడి, పశువుల సంత, వేలం, వృత్తి పన్ను, ధ్రువీకరణ పత్రాల జారీ రుసుం, నిర్మాణాలు, మ్యుటేషన్ (మార్పిడి)లలో అవకాశం ఉంది. 40 శాతం గ్రామ పంచాయతీల్లో కొత్త లైసెన్సుల జారీ, బంజరుదొడ్డి, సంతలు, వృత్తి పన్ను రుసుములు లేవు. నిర్మాణాలు, మార్పిడి రుసుములూ అతి తక్కువగానే ఉన్నాయి. టీఎస్‌బీపాస్‌ను పల్లెలకు వర్తింప చేసినా ఆదాయమేమీ రావటం లేదు. మేజర్ గ్రామ పంచాయతీలతోపాటు జాతీయ, రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారులను ఆనుకొని ఉన్న గ్రామాల్లోనే స్థిరాస్తి వ్యాపారాలు సాగుతున్నాయి. ఆయా చోట్ల నిర్మాణాలు, మార్పిడి రుసుములు లభిస్తున్నాయి. ఇక సంతలున్న గ్రామాలు మండలానికొకటి చొప్పునే ఉన్నాయి. ఇసుక, ఎర్రమట్టి రవాణా జరిగే గ్రామాల్లోనూ పంచాయతీలకు రవాణాదారులు నిధులు ఇస్తున్నారు. అయితే వాటిని అనధికారికంగా ప్రజాప్రతినిధులు చెల్లిస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీలకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయాలు తక్కువగా రూ.50 వేల నుంచి రూ.3 లక్షల లోపే ఉన్నాయి. ఇందులో 8 శాతం గ్రంథాలయ సెస్సు కింద జమ చేయాలి. మిగిలిన 92 శాతమే పంచాయతీల్లో ఉంటుంది. ఈ మొత్తం గ్రామ పంచాయతీలకు ఏమాత్రం సరిపోవటం లేదు.

**పెరుగుతున్న ఖర్చులు**

పంచాయతీలకు ఆదాయాలు అంతంత మాత్రమే ఉండగా.. ఖర్చులు మాత్రం పెరుగుతున్నాయి. రోడ్లు, నల్లాలు, వీధి దీపాల

నిర్వహణ, మరమ్మతులు, పారిశుద్ధ్యం తదితర ఖర్చులు మొదటి నుంచి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ఊరూరా ప్రకృతి వనాలు, శ్మశానాలు, క్రీడా ప్రాంగణాలు, సామాజిక భవనాలను నిర్మించింది. ట్రాక్టర్, ట్రాలీలను సమకూర్చింది. వీటి నిర్వహణ భారం పంచాయతీలపైనే పడుతోంది. ఇందుకు భారీగా నిధులను వెచ్చించాల్సి వస్తోంది. ట్రాక్టర్లకు నెలవారీ ఈఎంఐలను పంచాయతీలే చెల్లించాలి. వెయ్యి లోపు జనాభా ఉంటే ఇద్దరు మల్టీపర్పస్ కార్మికులను, రెండు వేల లోపు జనాభా ఉంటే నలుగురు చొప్పున నియమించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఒక్కొక్కరికి రూ.8,500 చొప్పున వేతనాలను పంచాయతీలే చెల్లించాలి. వేతనాలివ్వటానికి కూడా వెయ్యికి పైగా గ్రామాలకు ఆదాయం సరిపోవటం లేదు. కొత్తగా రహదారులు, కాలువల నిర్మాణం చేపట్టేందుకు నిధులలేమి అవరోధంగా మారింది.

**ఆర్థిక సంఘాల నిధులు**

పంచాయతీలకు యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా ఆర్థిక సంఘాల ద్వారా రూ.250 కోట్లు ఇస్తున్నాయి. వీటి ద్వారా పంచాయతీల నిర్వహణతోపాటు అభివృద్ధి పనులు నిర్వహించాలి. ఒక్కో పంచాయతీకి రూ.5 లక్షల నుంచి 20 లక్షల వరకు వస్తున్నాయి. కానీ ఇవి నెలనెలా విడుదల కావటం లేదు. నెలల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో కొన్నిచోట్ల సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొంది. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టలేకపోతున్నారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణ పడకేస్తోంది. నర్సరీలు, క్రీడా ప్రాంగణాలపై పర్యవేక్షణ లోపిస్తోంది. బతుకమ్మ వంటి పండుగల సందర్భాల్లో కూడా గ్రామ చావడిలు, చెరువుల వద్ద కనీస ఏర్పాట్లు చేయలేకపోతున్నారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఎవరైనా ముందుకొచ్చి సొంతంగా డబ్బులు వెచ్చిస్తేనే పనులు జరుగుతున్నాయి. ఆ తర్వాత బిల్లులు పెట్టినా విడుదలలో జాప్యంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**అమలుకాని హామీలు**

తొలిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు కేసీఆర్ 'గ్రామజ్యోతి' పథకం పేరుతో రూ.25,000 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్త రాష్ట్రంలో పెద్ద మార్పు వస్తుందేమోనని ఆశపడి జేపీ లాంటి వాళ్లు అభినందించారు. కానీ ఆ తర్వాత ఆ పథకం ఊసే ఎత్తలేదు. అయిదేళ్లకు రూ.1,18,000 కోట్ల మిగులు ఆదాయంతో ఆవిర్భవించిన రాష్ట్రంగా ఆ పథకాన్ని ఎటువంటి భారం లేకుండా అమలు చేసేయొచ్చు. కానీ ప్రజలకు అధికారం ఇవ్వకుండా ఉన్నకొద్దీ అధికార కేంద్రీకరణ మార్గాన్ని కేసీఆర్ ఎంచుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన పౌర సేవలకు సిటిజన్ చార్టర్ల అమలు విషయంలో కూడా అదే రీతిలో మొక్కుబడిగా వ్యవహరించి కాగితాలకు పరిమితం చేశారు.

స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేయటం, విద్య, ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేయటం, లైసెన్స్-పర్మిట్ ఆర్థిక వ్యవస్థ వంటి వివిధ కారణాల వల్ల మన గ్రామాలు ఇప్పుడు ప్రగతిశీల శక్తిని కోల్పోయాయి. నాయకత్వ సామర్థ్యమున్నవాళ్లు అక్కడ దాదాపు లేరు. కానీ గ్రామాల్లో వారందరూ వలస వెళ్తే భరించే శక్తి నగరాలకు లేదు. ఈ నేపథ్యంలో గ్రామాల్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలి. గ్రామ పంచాయతీలకు యూనియన్ ప్రభుత్వం నుంచి ఇచ్చే నిధుల్లో స్థానిక ప్రభుత్వాల వాటాను పెంచి ఎప్పటికప్పుడు బదిలీ చేయటంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా నిధుల్ని కేటాయించాలి. అధికారాల్ని బదిలీ చేయాలి. అక్కడ జవాబుదారీతనానికి అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అలాగే పట్టణీకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో గ్రామాల మధ్య చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసి అన్ని సదుపాయాలనూ అక్కడ అందుబాటులోకి తేవాలి. ఉన్నతస్థాయి నైపుణ్యాలున్నవారు మినహా మిగిలినవారు మహానగరాలకు వలసలు వెళ్లాల్సిన అవసరం లేకుండా, అక్కడే ఉపాధి అవకాశాల్ని కల్పించాలి. ఉద్యోగ వ్యాపారాల కోసం పట్టణానికి వెళ్లి సాయంత్రం కల్లా సొంతూరుకి తిరిగెళ్లగలిగేలా ఉండాలి. చిన్న పట్టణాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, సాంకేతికతల మీద ప్రభుత్వం పెట్టుబడి పెట్టటంతోపాటు స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున లభిస్తాయి, అనేక రంగాలు మెరుగుపడతాయి.

**ఉమ్మడి నల్గొండ జిల్లాలో 500 లోపు జనాభా ఉన్న ఓ గ్రామ పంచాయతీ ఆదాయ వ్యయాలు**

**ఆదాయం (ఏడాదికి రూపాయల్లో):**


- **ఇంటి పన్నుల ద్వారా - రూ.76 వేలు**
- **ఇతరత్రా ఏ ఆదాయమూ లేదు**

**ఖర్చులు (ఏడాదికి):**

- **ఇద్దరు సిబ్బంది జీతభత్యాలకు - రూ.2.04 లక్షలు**
- **ప్రభుత్వం కొనుగోలు చేసి ఇచ్చిన ట్రాక్టర్ ఈఎంఐ చెల్లింపులు - 1.44 లక్షలు**
- **వీధి దీపాలు, గ్రామ పంచాయతీ కరెంటు బిల్లులు - 1.20 లక్షలు**
- **ట్రాక్టర్ డీజిల్ ఖర్చు - 1.20 లక్షలు**
- **పారిశుద్ధ్య నిర్వహణ, నర్సరీలు, శ్మశానాల నిర్వహణ, పచ్చదనం, పరిశుభ్రత, వీధి దీపాలు, మరమ్మతులు - 12 లక్షలు**
- **యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల సాయం: ఆర్థిక సంఘాల ద్వారా - రూ.10 లక్షలు**

# జీహెచ్ఎంసీ పరిధిలో మెట్రో విస్తరణ అవసరం..
# జనసమ్మర్దం లేని ఔటర్ చుట్టూ మాత్రం వృధా వ్యయం

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ -

హైదరాబాద్ తెలంగాణకు ఆయువుపట్టు. జీవనాడి లాంటిది. హైదరాబాద్ లేకపోతే తెలంగాణకు ఉపాధి కల్పన, పెట్టుబడులు కష్టం. ప్రభుత్వాలకు ఆదాయం ఉండదు. హైదరాబాద్ నుంచి ఆదాయం తీసుకుంటున్న రాష్ట్ర సర్కారు.. ఈ నగరం గురించి కావల్సినంతగా పట్టించుకోవటం లేదు. సిటీపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నది. నగరంలో ట్రాఫిక్ నరకంగా మారింది. ఒక్కసారి సాయంత్రం 6 గంటలకు ఏ సెక్యూరిటీ, పోలీసుల హడావుడి లేకుండా ముఖ్యమంత్రి లేదా ఎవరైనా మంత్రి సిటీలో తిరిగితే తెలుస్తుంది. కాబట్టి సిటీలో మనకు తప్పకుండా మెట్రో రైలు కావాలి.

గ్రేటర్ హైదరాబాద్ మొత్తంలో ఇప్పటివరకు 75 కిలోమీటర్ల మేర మాత్రం మెట్రో వేసి ఉంటారంతే. అదీ ప్రైవేటు రంగం ముందుకొచ్చింది కాబట్టి. దానికి 20 వేల కోట్లు ఖర్చయ్యాయి. ఇందులో వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద ప్రభుత్వం దాదాపు రూ. 1,750 కోట్లు మాత్రమే పెట్టింది. సిటీలో జనసమ్మర్దం ఎక్కువ ఉన్నచోట మెట్రో రావాలి. ఇదేసమయంలో లాస్ట్ మైల్ కనెక్టివిటీని పెంచాల్సిన అవసరం ఉన్నది. ఉదాహరణకి నేను 'ఎ' నుంచి 'బీ'కి వెళ్లాలి అనుకుంటే.. 'ఎ' వరకు ఏ ట్యాక్సీనో పట్టుకుని, 'ఎ' నుంచి మెట్రో పట్టుకుని, మళ్లీ ఏదో ఆటోనో, బస్సునో పట్టుకుని 'బీ'కి చేరాల్సి వస్తున్నది. ఇలా చివరి వరకు లాస్ట్‌మైల్ కనెక్టివిటీ లేకపోవటం వల్ల, మెట్రోలో ప్రయాణం చేయాలనే ఆసక్తి ఉన్న వ్యక్తులు కూడా సొంత కారో, సొంత బండిపైనో రోడ్లపైకి వస్తున్నారు. లండన్ సహా పలు నగరాల్లో మెట్రో, ట్రెయిన్, బస్సు అన్నిటినీ ఒకే సంస్థ నడుపుతుంది. ఒక టికెట్‌తో ఎక్కడికి వెళ్లాలన్నా, ఎందులోనైనా హాయిగా ప్రయాణం చేయవచ్చు. హైదరాబాద్‌లో అలాంటి చొరవ తీసుకోవచ్చు. ఎంఎంటీఎస్ ఉంది, ఆర్టీసీ ఉంది, మెట్రో ఉంది.. ఈ మూడింటినీ సంధానం చేసి ఒకే సంస్థగా మార్చవచ్చు. జీహెచ్ఎంసీ పరిధిలో మెట్రోను విస్తరించి కనెక్టివిటీని పెంచాలి. ఫుట్‌పాత్‌లు ఎక్కువగా ఏర్పాటు చేయాలి. సైకిల్ ట్రాక్‌లు నిర్మించాలి. కొన్నిచోట్ల వేరే మార్గం లేకపోతే ర్యాపిడ్ బస్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం పెట్టవచ్చు. దానికి కిలోమీటర్‌కి రెండు మూడు కోట్లు ఖర్చవుతుంది. ఇవన్నీ పెద్ద కష్టమేమీ కాదు. ఈ నేపథ్యంలో, మెట్రోరైలు విస్తరణ చేస్తున్నట్లు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నా. కానీ కొంచెం లోతుగా పరిశీలిస్తే, అందులో భారీ వృధా వ్యయం కూడా కనిపిస్తుంది.

మెట్రో రైలు విస్తరణలో నగరంలో జనసమ్మర్దం ఉండి ప్రజలు ఇబ్బంది పడుతున్న పలు ప్రాంతాలను వదిలేసి, పెద్దగా

జనసంచారంలేని, ఇప్పటికే బ్రహ్మాండమైన 8 వరసల రహదారులున్న ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కూడా మెట్రో రైలును విస్తరిస్తున్నట్లు ప్రతిపాదించారు. జనం ఉన్నచోట మెట్రో రైలు విస్తరించకుండా, జనం లేని చోట, ఇప్పటికే రోడ్లు బ్రహ్మాండంగా ఉన్న చోట ఎందుకు? పదేండ్ల క్రితమే రూ.6,600 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్ నిర్మించారు. ఇక్కడ బస్సులు తిరిగేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఒకవేళ ఇక్కడ రవాణా అవసరం అనుకుంటే, ఎన్ని బస్సులు కావాలంటే అన్ని బస్సులు వేసుకోవచ్చు. ఏసీ బస్సులు వేసుకోవచ్చు. కాలుష్యం లేకుండా ఎలక్ట్రిక్ బస్సులు వేసుకోవచ్చు. ఒక బస్సుకు ఒక కోటి చొప్పున లెక్కేసినా వంద బస్సులకు రూ.100 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. కానీ ఔటర్ రింగ్ రోడ్డుకి సమాంతరంగా మెట్రో వేస్తే.. ఒక కిలోమీటర్‌కి రూ.200 కోట్ల నుంచి 300 కోట్ల వరకు ఖర్చవుతుంది. అదే భూగర్భంలో అయితే ఒక కిలోమీటర్‌కి రూ.400 కోట్లకు తగ్గకుండా రూ.600 కోట్ల వరకు ఖర్చవుతుంది. కోటి రూపాయలతో బస్సు వేస్తే పోయేదానికి ఔటర్ చుట్టూ సమాంతరంగా వేల కోట్లతో మెట్రో వేయటం సరికాదు. గోటితో పోయేదానికి గొడ్డలి ఎందుకు? 6,600 కోట్లతో హెచ్ఎండీఏ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించింది. ప్రభుత్వమే దానికి హామీ ఇచ్చింది. ఇంకా దాని అప్పు తీరలేదు. భవిష్యత్తులో నగరం పెరుగుతుందనే ఊహతో కిలోమీటర్‌కి రెండు మూడు వందల కోట్ల రూపాయలు పెట్టటమనేది ఇప్పటి వరకూ ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. బాగా డబ్బున్న దేశాల్లో కూడా ఇలా డబ్బులు దుర్వినియోగం చేసే సాహసం చేయరు. మెడ మీద తలకాయ ఉన్నవాడెవడూ మెట్రో రైలు వద్దనడు, మెడ మీద తలకాయ ఉన్నవాడెవడూ అన్నిచోట్లా మెట్రో కావాలనడు.

**పెట్టిన ఖర్చుకి ఫలితం ఉండాలి**

పెట్టే ఖర్చుకు, వచ్చే ఫలితానికి సంబంధం లేకపోవటం వల్లే అప్పుల పాలవుతున్నామని గత 25 ఏండ్లుగా నేను చెబుతూనే ఉన్నా. కచ్చితంగా హైదరాబాద్ నగరంలో మౌలిక సదుపాయాలు అవసరం. మెట్రో రైలు విస్తరణ అవసరం. బస్సులు పెంచటం అవసరం. ఎంఎంటీఎస్‌ను బలోపేతం చేయటం అవసరం. కానీ ఈ మూడూ కూడా కుడి చెయ్యి, ఎడం చెయ్యి అన్నట్లు సంబంధం లేకుండా నడిస్తే ఫలితం ఉండదు. వీటిని సంధానం చేయాలి. అవసరమైతే విలీనం చేయాలి. వీటి వల్ల అందరికీ ప్రయోజనం చేకూరాలి. మెట్రోను మరింత విస్తరించాలన్న ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని, మౌలిక సంకల్పాన్ని ఆహ్వానిస్తున్నాను. కానీ ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ కాకుండా జనం ఉన్న చోట, రద్దీ ఉన్న చోట మెట్రో విస్తరణ జరగాలి. ఎప్పుడో ఆనాటి పాలకుల, ఎల్ అండ్ టీ పుణ్యమా అని ఢిల్లీ తర్వాత మనకు మెట్రో వచ్చింది. ఆ తర్వాత అలాంటి దాని గురించి మర్చిపోయారు. కానీ ఇతర నగరాలు మన కంటే ముందుకు దూసుకుపోతున్నాయి. ఢిల్లీలో రెండు ఫేజుల్లో ముంబయి, బెంగళూరు, చెన్నైలలో చేపట్టారు. మన దగ్గర ఆలస్యమైంది. మనం ఖర్చు పెట్టే ప్రతి పైసా నగర జీవనాన్ని బాగుచేసే దిశగా ఉండాలి. వంద మీటర్ల దూరం నుంచి ప్రయాణ సౌకర్యాలు ఉండి, ఒక చోటు నుంచి ఇంకో చోటుకి ఈజీగా ప్రయాణం చేసేలా నగర జీవనం బాగుపడితే, ఖర్చు ఎక్కువైనా సంతోషంగా భరించవచ్చు. హైదరాబాద్ నగరం మీద దృష్టి పెట్టినందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తూనే, డబ్బు వృథా కాకుండా ప్రజలకు పనికివచ్చేలా ఖర్చు చేయాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్న.

## పార్కింగ్ నియంత్రణ

**నగరం లోపల మెట్రో విస్తరణ పనులు చేపట్టాలంటే భూసేకరణ అడ్డొస్తోందని కొందరు అంటున్నారు. చిన్న చిన్న సమస్యలున్నాయని అవసరమున్నచోట వదిలేసి అవసరంలేని చోట అభివృద్ధి పనులు చేయటం ఎంత వరకు కరెక్ట్? జనం ఉన్నచోట మెట్రో నిర్మించాలి గానీ, దాని అవసరంలేని చోట నిర్మాణం దేనికి? నగరం మధ్యలో, జనం రద్దీ ఉన్న చోటే 20 వేల కోట్ల రూపాయలతో మెట్రో నిర్మిస్తే ఏడాదికి 1300 కోట్ల రూపాయలు నష్టమొస్తూ వడ్డీ చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటిది జనం లేని కోట్లు పెట్టి మెట్రో కడితే లాభమేంటి? కాబట్టి హైదరాబాద్ సిటీలో పౌర రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. నిత్యం కారు, బైకలపై వెళ్లేవారు తమ వాహనాలు వదిలేసి బస్, మెట్రో, ఎంఎంటీఎస్‌లను ఉపయోగించుకుని హాయిగా, ఎలాంటి భయంలేకుండా ప్రయాణం చేయవచ్చన్న నమ్మకం ప్రభుత్వం కల్పించాలి. దానికి తగ్గట్లే ఏర్పాట్లు ఉండాలి. అలాగే గ్రేటర్‌లో పార్కింగ్ మీద నియంత్రణ లేదు. పార్కింగ్ కోసం ప్రత్యేకించి సౌకర్యాలు ఉండటం లేదు. రోడ్డుకు అడ్డంగా కారు పార్క్ చేసి పక్కన షాపులోకి వెళ్లి పనిచూసుకుంటున్నారు. దాంతో ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులు రోడ్డుపై వేచి ఉండాల్సి వస్తున్నది. అందుకే పార్కింగ్ కోసం ప్రత్యేక నిర్మాణాలు చేయాలి. ఇవన్నీ జరిగిన తర్వాత ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసిన తర్వాత రోడ్ల మీద కార్లు తిరగటాన్ని కఠినతరం చేయాలి. లండన్‌లో కారులో వెళ్లాలంటే ఈ రోజుకు ఇరమై ముప్పై పౌండ్లు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. సింగపూర్‌లో కారులో తిరగాలంటే, ఖర్చు ఎక్కువ అవుతుందని భయపడతారు. అందుకే జీహెచ్ఎంసీ పరిధిలో జనం ఎక్కువగా ఉండే ఓఆర్ఆర్ లోపల ప్రత్యామ్నాయాలు బలంగా ఏర్పాటు చేయాలి. అంతేగానీ, పెద్దగా జనసంచారంలేని ఓఆర్ఆర్ వద్ద సమాంతరంగా మెట్రో నిర్మిస్తామనటం సరికాదు. ఒకవేళ మొండిగా మెట్రో రైలు నిర్మించినా ఖర్చు ఎక్కువ, ఫలితం తక్కువ.**

# మధ్యతరగతికి సంకెళ్లు వేశాం

**డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో ఆకెళ్ల రాఘవేంద్ర ముఖాముఖి(రెండోభాగం)**




**ప్రశ్న: ఆర్థిక సంస్కరణలు వచ్చిన తర్వాత దేశంలో ఇవాళ 50 శాతం మధ్యతరగతి ఉంది. సామాజిక ఉద్యమాల్లో ఈ తరగతి ప్రజలు పాల్గొనరు..బాధితులుగా ఉన్న వీరు వీటికి దూరంగా ఉండడం వల్లే అనుకున్న సమయంలో మార్పులు రావడం లేదా? వారిని ఎలా చైతన్యవంతుల్ని చేయాలి.**

**జేపీ:** స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, ఓటు హక్కు, ఎన్నికైన ప్రభుత్వాలు, స్వపరిపాలన ఇవన్నీ ప్రపంచం అంతా కూడా ప్రధానంగా మధ్యతరగతి కాన్సెప్ట్. నిరుపేదలకు రెక్కాడితే కానీ డొక్కాడదు..కావున జీవన పోరాటంలో వారు అలసిపోతారు. సంపన్న వర్గాలేమో మిగతా వర్గాల్ని అణిచివేస్తున్నాయి.. కావున భూస్వామ్య వర్గాలకు ప్రజాస్వామ్యం అనేది శత్రువు. కాబట్టి ప్రజాస్వామ్యం అనే కాన్సెప్ట్ వచ్చిందే ప్రపంచమంతా కూడా మధ్యతరగతి ప్రజల నుంచే. మన దేశంలో సమస్య మధ్యతరగతి పట్టించుకోకపోవడం కాదు. రెండు ప్రధాన కారణాలు. 1. మధ్యతరగతి కానీ, మిగతావాళ్లు కానీ పౌరసత్వాన్ని ఎన్నికల్లో తప్ప మిగతా సందర్భాల్లో చూపించడానికి వేదిక లేకుండా చేసేశాం. విపరీతమైన అధికార కేంద్రీకరణ చేశాం. 2. మధ్యతరగతి కానీ, ఎవరికైనా కానీ జీవితంలో కుటుంబం బాగుండాలనే ఆలోచన ఉంటుంది. అది తప్పు కాదు..అందుకోసమే కదా మనం బతికేది. గౌరవంగా బతకాలని కోరుకోవడం కూడా పాపమేనా? దాని కోసం నిజాయితీగా పోరాడటం కూడా తప్పేనా? అయితే మనం ఏం చేశాం..ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని కూడా కేంద్రీకరించి ప్రభుత్వం చేతుల్లో పెట్టాం. ప్రభుత్వమే సర్వస్వం అన్న

భావన కలిగించి ప్రజలకు భవిష్యత్తు పట్ల నమ్మకం లేకుండా చేశాం. మధ్యతరగతి ప్రజలు సాధారణంగా ఏం కోరుకుంటారు..మా అబ్బాయి ఒక ఇంజనీరో..డాక్టరో కావాలి. వీలుంటే ప్రభుత్వ ఉద్యోగం రావాలని ఆశిస్తారు. అయితే ఆర్థికంగా వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడి ఎదిగే అవకాశం లేనప్పుడు ప్రభుత్వం మీదే ఆధారపడుతున్నారు. అలాంటప్పుడు అక్కడ ఏదో తప్పు ఉందని తెలిసినా కూడా దాని మీద తిరగబడడం చాలా కష్టమవుతుంది. ఆ మేరకు మధ్య తరగతి గొంతు నొక్కేసాం. సంకెళ్లు వేశాం. ఇప్పటికి కూడా మనకి ఈ దేశంలో ఒకస్థాయి మించి మార్పు కోసం పోరాడితే అధికారంలో ఉన్న వాళ్లకి ఏం కోపం వస్తుందో, నా ఆర్థిక భవిష్యత్తును నాశనం చేస్తారేమో అనే భయం ఉంది. ఇప్పటికి కూడా ఈ దేశంలో అధికారంలో ఉన్న వాళ్లు కోటీశ్వరుల జీవితాలను, వారి వ్యాపారాలను శాసించే పరిస్థితి ఉంది. కాబట్టి వారితో గొడవ లేకుండా ఉందామనే ఆలోచన ఉంటుంది. ఇది మధ్యతరగతి వర్గాల్లో ఉన్న పొరపాటు కాదు..రాజ్యవ్యవస్థ నిర్మాణంలో కానీ, ఆర్థిక విధానాల్లో కానీ భయంకరమైన తప్పులు చేశాం. కొన్ని ఇంకా కొనసాగిస్తున్నాం..అందువల్ల పౌరసత్వం ఒకస్థాయికి మించి పెరగకుండా ఉండిపోయింది.

**ప్రశ్న: ఆర్థికంగా ముందుకు వెళ్లడానికి చైనా చేసిన ఒప్పేంటి..ఇండియా చేసిన తప్పేంటి?**

**జేపీ:** చైనా 1948 నుంచి 1978 వరకు పాఠశాల విద్య, కొంతమేర ఆరోగ్యం విషయంలో తప్ప మిగతా అన్ని విషయాల్లో భయంకరమైన తప్పులు చేసింది. 1958-61 మధ్య రెండు కోట్ల మంది ఆకలితో చనిపోయారు. ప్రపంచంలో యుద్ధం లేని కాలంలో రెండు కోట్ల మంది చనిపోయిన సందర్భం అదొక్కటే. 1960వ దశకంలో సాంస్కృతిక విప్లవం పేరుతో 90 శాతం వారి సంస్కృతి మొత్తాన్ని ధ్వంసం చేశారు. సమాజంలో ఆలోచించే వాళ్లు, మేధావులు, అధ్యాపకులు, శాస్త్రజ్ఞులు, రచయితలు అందర్నీ వాళ్ల పదవులు తీసేసి, వారి ఉద్యోగాలు తీసి పారేసి గందరగోళం చేశారు. 1978లో వారికి చాలా గొప్ప నాయకత్వం దొరికింది. అమెరికా కూడా వాళ్ల స్వప్రయోజనాల కోసం చైనాను అక్కున చేర్చుకుంది. సాంకేతిక పరిజ్ఞానం ఇవ్వడానికి సిద్ధపడింది. ఆ అవకాశాన్ని వారు పూర్తిగా వినియోగించుకున్నారు. పరిస్థితి మార్చారు. ఇప్పటికి కూడా మనదేశంలో చాలా మంది చైనా కమ్యూనిస్టు దేశం అనుకుంటున్నారు. 2005లో నేను ఓ ఉన్నతస్థాయి బృందంతో చైనాలో పర్యటించాను. అప్పుడు ఆ దేశ మాజీ విదేశాంగమంత్రి బీజింగ్‌లోని ఓ రెస్టారెంట్‌లో మాకు ఆతిథ్యం ఇచ్చారు. నేను ఆయనతో నవ్వుతూ ఓ మాట అన్నాను..మా దేశంలో కమ్యూనిస్టులకు ఇంకా పిడివాదం పోలేదు. మిమ్మల్ని చూస్తే నేర్చుకుంటారేమో ఒక్కసారి వాళ్లని ఇక్కడికి తీసుకొచ్చి శిక్షణ ఇవ్వకూడదా అన్నాను. ఆయన్న నవ్వేసి మా దేశంలో కమ్యూనిస్టు పార్టీ రాజకీయ స్థిరత్వం కోసమే తప్ప ఆర్థిక విధానాలకి కమ్యూనిజానికి సంబంధం లేదు. మీ దేశంలో కమ్యూనిస్టులకు అది అర్థం కాకపోతే మీ దేశం దురదృష్టం అన్నారాయన. అప్పటికే ఆయనకు 92 ఏళ్ల వయస్సు. మనదేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చి 30 ఏళ్లు అవుతున్నా, మనకి ఈ వేళకి కూడా అర్థం కాలేదు. ప్రైవేటురంగం అంటే పాపపంకిలమైంది.. ప్రభుత్వం రంగం చాలా పవిత్రమైంది..దైవాంశసంభూతమైంది..ప్రైవేటును తిరస్కరించాలి..ప్రభుత్వరంగాన్ని అక్కున చేర్చుకోవాలనే భావనలోనే ఉన్నాం. 'పిల్లి నల్లదా? తెల్లదా? అనేది కాదు ఎలకల్ని పట్టిందా? లేదా?అనేది చూడాలి. సామాన్యుల అవసరాలు తీరాయా లేదా? మంచి చదువు వచ్చిందా..మంచి ఆరోగ్యం అందిందా? మంచి ఉపాధి లభించిందా? మంచి ఫోన్ సౌకర్యం ఉందా? మంచి రోడ్లు ఉన్నాయా? మంచినీళ్లు ఉన్నాయా? ఎదిగే అవకాశాలున్నాయా? జీవితం అందంగా ఉందా..లేదా అది కావాలి. అది చైనా నాయకత్వానికి అర్థం అయింది.అనుభవం అనేక పాఠాలు నేర్పినా కూడా మనకి ఆ స్పష్టత లేదు. అయితే సామాన్య జనానికి ఈ విషయం అర్థమైంది.

ప్రైవేటా..ప్రభుత్వమా అని అనుకోవడం లేదు..నా పిల్లలకి చదువు వస్తుందా..లేదా అని చూస్తున్నారు. సెల్‌ఫోన్ వస్తే అది ప్రైవేటుదా..ప్రభుత్వ రంగానిదా అని కాకుండా అక్కున చేర్చుకున్నారు.. ఉపయోగించుకుం టున్నారు. చదువుకున్నాం అనుకున్న వాళ్లకి, పిడివాదంలో ఉన్న వాళ్లకి, 60 ఏళ్ల వాసన నుంచి భయపడలేని వాళ్లకి ఇంకా చాలా సందిగ్ధం ఉంది. జీవితంలో చేసే పనులన్నీ కూడా ఏది పనికొస్తే అది చేయడం, చేసే చర్చలన్నీ కూడా ఏది పనికిరాదో దాన్ని ప్రోత్సహించడం. చైనాకు, మనకు ఉన్న మౌలికమైన తేడా ఇది.

**(ఇంకా ఉంది)**

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## జుగాడ్ ఓటర్లుగా మన భవిష్యత్తు మనమే నిర్మించుకుందాం !

## ఈ అవకాశం మళ్ళీ మళ్ళీ రాకపోవచ్చు ..

జుగాడ్ ఓటర్ల భాగస్వామ్యంతో ఆచరణయోగ్యమైన (Implementable) ప్రజాస్వామ్యం. అంతర్గత ప్రజాస్వామ్యంతో మరియూ, నమూనా మార్పుతో ప్రతిపాదిత ద్విపక్ష జాతీయ పార్టీ ని ఇదే FDR Loksatta ఉద్యమ సంస్థ జనబలం ఆగస్టు 2023 ద్వారా ఓటర్లజాతికి అంకితం చేయడం జరిగింది! ఆలోచించే మనసున్న స్త్రీపురుషులందరికీ ఇదొక రాజ్యాంగ-బద్ధ ఆర్థిక సామాజిక శాంతియుత అధికార మార్పిడికి స్వల్ప ఖర్చుతో సాధ్యమయ్యే - పారదర్శక సూక్ష్మ మార్గం !

ఓటరు యొక్క వార్షికాదాయం 3 లక్షల లోపుంటే 2 వేలు, లేదా 5 లక్షల లోపుంటే 5 వేలు, లేదా 10 లక్షల లోపుంటే 10 వేల రూపాయిలు ఒకేఒక్కసారి బేషరతుగా ఇవ్వగలిగిన వారందరూ జుగాడ్ ఓటర్లే. రైతన్నలూ, లాయర్లూ, ప్రభుత్వోద్యోగులూ, మీడియామిత్రులతో సహా ఇవ్వగలిగిన వారు అందరూ ఎంతోకొంత డబ్బు SBI బాండ్ల రూపేణా విరాళమివ్వాలి. నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం అనే మూల సూత్రం పై పొలిటికల్ పార్టీలన్నీ పనిచేయాలనీ 75% మెజార్టీతో పరిపాలన సాగాలనీ తలపెట్టిన ఈ ఉద్యమాన్ని విజయపథంలో నడిపించ వలసిన బాధ్యత జుగాడ్ ఓటర్లదే!

" 8,13,22,263 persons have paid income tax in the country during Assessment Year (AY) 2020-21 relevant to Financial Year 2019-20," Finance Minister Nirmala Sitharaman said in a written reply to Rajya Sabha.

### మన డబ్బు - మన ఓటు - మనఎజెండా-మనపార్టీ-మన సమిష్టి అధికారం

MLAలయినా MPలయినా అత్యధిక ఓటర్లకు ఉపయోగపడే విదంగా చట్టాలను చేయాలి. కానీ ప్రస్తుత వ్యవస్థలో కొందరి ప్రభుత్వోద్యోగుల సహకారంతో సామాన్య ఓటర్లకు కోర్టుల చుట్టూ జీవితాంతం తిరిగినా సమాన న్యాయం జరగని దుస్థితి.

మన రాజ్యాంగం ప్రాథమిక హక్కు ద్వారా (Fundamental Right) మనకు కల్పించిన అధికారాన్ని నేటి పేద,మధ్యతరగతి ఓటర్లు విస్మరించి, మిగతా విషయాలలో (అనగా, రాజకీయంలోకి తీసుకురావలసిన అవసరం లేని కులం, మతం, మద్యం, ప్రాంతం, భాష, యాస) మొదలైన అంశాలలో మనము అభిమానించే కొంతమంది ప్రజాప్రతినిధుల ఉపదేశాలకు సమ్మోహితులమైపోయి మనకు న్యాయం జరగలేదంటూ మనని మనమే మోసం చేసుకుంటున్నాం. మంచి పార్టీ స్థాపించాలన్నా మంచి ప్రభుత్వాన్ని ఏర్పరచాలన్నా మొట్టమొదట అత్యంత విలువైన మన ఓటు హక్కు ని మనం కాపాడుకోవాలి. ఈలోగా, మన జాతీయ ఎన్నికల కమిషన్ అప్పుడప్పుడు ఏదో వంకతో సవరిస్తూ పోయే ఓటర్లలిస్టులో, స్త్రీయైనా, పురుషుడైనా, మీపేరు తొలగించకుండా ఉండేలా చూసుకుంటూ జాగ్రత్తపడాలి.

Please contact M.Parthasarathy (9866416798)


Advt

(గత సంచిక తరువాయి)

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జూలై 2021** (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

**అనుబంధం 4.3: ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలకు ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్య నమూనా - ఆంధ్రప్రదేశ్**

ప్రభుత్వ రంగంలోని అన్ని స్థాయిల సదుపాయాలలో జాతీయ ఆరోగ్య మిషన్‌లోని ఉచిత రోగ నిర్ధారణ పరీక్షల స్కీము కింద ఉచిత డయాగ్నొస్టిక్‌లను అందించేందుకు ఒక హైబ్రిడ్ నమూనాను అమల్లోకి తెచ్చిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. జనవరి 1, 2015 నుండి స్కీముని దశలవారీగా 5 నెలల వ్యవధిలో అమలు చేశారు. ఈ వ్యవధి పూర్తయ్యే సమయానికి అన్ని అధీకృత ప్రభుత్వ సదుపాయాలు– 1125 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పి.హెచ్.సిలు), 192 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు (సి.హెచ్.సిలు), 35 ఏరియా ఆస్పత్రులు (ఎ.హెచ్‌లు), 8 జిల్లా ఆస్పత్రుల (డి.హెచ్.సిలు)లోనూ ఈ పరీక్షల్ని అందుబాటులోకి తెచ్చారు.

**ఎ. నమూనా -**

**రోగ నిర్థారణ పరీక్షల (డయాగ్నొస్టిక్) సేవల అమలు రెండు స్థాయిల్లో ఉంది.**

అవి:

1. ప్రాంగణ ల్యాబొరేటరీలు – ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాల్లో కొన్ని ప్రాథమిక పరీక్షలను నిర్వహిస్తారు. ఎక్కువగా ఇవి ర్యాపిడ్ కిట్ పరీక్షల తరహాలోనివి.

2. ఆంధ్రప్రదేశ్ వైద్య పరీక్షల పథకం (ఎ.పి.వి.పి) – ప్రాంగణం లోపలి ల్యాబొరేటరీలతోపాటు, ప్రభుత్వ సదుపాయ ప్రాంగణం వెలుపల వేరే ల్యాబొరేటరీలను కొన్ని సాధారణ, వాటితోపాటు మరింత పైస్థాయి పరీక్షల కోసం ఏర్పాటు చేశారు.

ఎ.పి.వి.పి స్కీమ్ కింద ల్యాబొరేటరీ సేవలను 'మెదాల్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్' అనే ఏక సేవలదారుకి ఔట్‌సోర్స్ చేశారు. పోటీ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా సేవలదారును రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. వసతుల నిర్మాణం, సిబ్బంది, ఆస్పత్రి నుండి డాక్టర్లు సిఫార్సు (రెఫర్) చేసిన రోగులందరికీ సేవలను అందించటం ప్రయివేటు భాగస్వామి బాధ్యత.

ప్రాంగణ ల్యాబొరేటరీలు ప్రభుత్వ సదుపాయాల్లో ఉండగా, ఎ.పి.వి.పి కింద సేవలందించే ల్యాబొరేటరీలను ప్రాంగణాల వెలుపల ఏర్పాటు చేశారు. ఎ.పి.వి.పి ల్యాబొరేటరీల్లో నిర్వహించే పరీక్షలకు శాంపిలింగ్‌ను ప్రభుత్వ సదుపాయంలో సేవలదారు ఏర్పాటు చేసిన శాంపిలింగ్ కేంద్రాల్లో సేకరిస్తారు. రిపోర్టులు తయారుకాగానే వెంటనే ఆరోగ్య సదుపాయాలకి ఈమెయిల్ చేస్తారు. శాంపిళ్లను ల్యాబొరేటరీలకు పంపటం, ముద్రిత రిపోర్టులను తిరిగి ఆస్పత్రులకు చేరవేయటం బాధ్యత సేవలదారుదే.

ప్రస్తుతం రాష్ట్రంలో 104 ల్యాబొరేటరీలు పనిచేస్తున్నాయి. ఈ ల్యాబొరేటరీలను మూడు రకాలుగా విభజించారు. ఎల్ 1 (మదర్ ల్యాబొరేటరీలు), ఎల్ 2, ఎల్ 3.

**బి. ధర, బడ్జెట్ -**

సేవలదారుకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఒప్పందం 'ఒక్కో పరీక్షకు అయ్యే వ్యయం' నమూనాలో కాకుండా, 'ఒక్కో రోగికి అయ్యే ఖర్చు' నమూనాలో ఉంటుంది. సేవలదారు నిర్వహించే ల్యాబొరేటరీల నుండి పొందే సేవలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో రోగికి రూ.235 ఖర్చు చేస్తోంది.

ఈ స్కీముకి 2016-17, 2017-18లో కేటాయించిన బడ్జెట్ ఎటువంటి మార్పులు లేకుండా రూ.105.75 కోట్లుగానే ఉంది. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం 60% భరిస్తుండగా, మిగతాది రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది.

ప్రాంగణ ల్యాబొరేటరీల్లో మొత్తం ఖర్చుల్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

**సి. పథకం కవరేజి-**

స్కీమును ప్రారంభించిన జనవరి 2016 నుండి మే 2021 వరకు పరీక్షలు చేయించుకున్న మొత్తం రోగుల సంఖ్య 2,32,17,817. చేసిన మొత్తం పరీక్షలు 9,07,77,438. ఏడాదిలో 55-60 లక్షల మంది రోగులు పరీక్ష సదుపాయాలను వినియోగించుకుంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మదింపు నివేదిక 2018 ప్రకారం, పరీక్షలు చేయించుకున్న ఎక్కువమంది రోగులు పి.హెచ్.సి స్థాయిలో (52%) ఉండగా, ఆ తర్వాత సి.హెచ్.సిలు (30%), ఎ.హెచ్‌లు (12%), డి.హెచ్‌లు (6%)లో ఉన్నారు. ప్రభుత్వ సదుపాయాల్లోని మొత్తం రోగుల్లో దాదాపు 10%కి ఈ ల్యాబొరేటరీల్లో పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం పడుతోంది.

**డి. ఫలితాలు -**

1. మెరుగైన రోగి సంరక్షణ - ప్రభుత్వ సదుపాయాల్లో మెరుగ్గా, పెద్ద సంఖ్యలో రోగ నిర్ధారణ పరీక్షల సేవలు అందుబాటులోకి రావటం వ్యాధులు, ఆరోగ్య పరిస్థితుల మెరుగైన నిర్వహణకు, రోగుల సంఖ్య పెరగటానికి, ప్రయివేటు డయాగ్నొస్టిక్ సేవలను వినియోగించుకునేవారి వాటా తగ్గటానికి దోహదం చేసింది.

2. తక్కువ ఓ.ఓ.పి.ఇ - రోగ నిర్ధారణ పరీక్షలపై తలసరి ఓ.ఓ.పి.ఇ ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో 55% మేర తగ్గింది. 2015లో రూ.860.54 నుండి 2017లో రూ.388కి తగ్గింది. ఒక్క ప్రభుత్వ రంగంలోనే, అది 81% మేర - 2015లో రూ.32 నుండి 2017లో రూ.6కు తగ్గింది. దీర్ఘకాలిక వ్యాధులకు డయాగ్నొస్టిక్‌లపై ప్రభుత్వ రంగంలో ఒక్కో రోగిపై సగటు ఓ.ఓ.పి.ఇ ఈ కాలవ్యవధిలో 40% మేర తగ్గింది.

3. అందించిన సేవలతో రోగుల్లో సంతృప్తి పెరిగింది.

4. వైద్యుల్లో సంతృప్తి - ఈ రకమైన సేవ ఎంతో సంతృప్తినిస్తోందని ఎక్కువమంది డాక్టర్లు రేటింగ్ ఇచ్చారు. అయితే, ఈ సంతృప్తిస్థాయి ఎ.హెచ్‌లు, డి.హెచ్‌లలోని డాక్టర్లలో తక్కువగా ఉంది. దీనితోపోలిస్తే, ప్రాంగణ ల్యాబొరేటరీల ద్వారా సమకూరుతున్న ఫలితాలపై డాక్టర్లలో అత్యధికులు ఎక్కువ సంతృప్తికరంగా ఉన్నారు.

**మూలం:**

1. ఆంధ్రప్రదేశ్‌లోని ఉచిత డయాగ్నొస్టిక్ స్కీమ్‌పై రూపొందించిన నివేదిక, ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత ప్రభుత్వం, 2018.

2. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ నివేదికలు జూన్ 4, 2021 నాటి అంచనాతో.

**అనుబంధం 4.4: ఔషధాల సేకరణ, పంపిణీలో తమిళనాడు ఒరవడి**

తమిళనాడు మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ (టి.ఎన్.ఎం.ఎస్.సి) ఏర్పాటుతో ప్రభుత్వ ఆరోగ్య రంగంలో మందుల సేకరణ, పంపిణీ విభాగంలో తమిళనాడులో ఒక కీలక మార్పు చోటు చేసుకుంది. తప్పనిసరి ఔషధాల్ని ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాలన్నిటిలో నిరంతరం అందుబాటులో ఉంచే లక్ష్యంతో స్వతంత్ర ప్రతిపత్తితో టి.ఎన్.ఎం.ఎస్.సిని ఏర్పాటు చేశారు. ఔషధాల సేకరణ, నిల్వ, పంపిణీ ప్రక్రియను ఈ సంస్థ సమన్వయ పరుస్తుంది. నిర్దేశిత లక్ష్యాన్ని సాధించటం మాత్రమే కాకుండా ప్రభుత్వానికి మందుల కొనుగోలు వ్యయాన్ని సంస్థ తగ్గించింది. కిందన పేర్కొన్న ఇతర అనేక ప్రయోజనాలను కూడా సాధించింది. సామర్థ్యం పెంపు, పారదర్శకత, జవాబుదారీతనం కోసం సమాచార సాంకేతికతపై పెద్దఎత్తున ఆధారపడటం.. మొత్తంగా ఈ సానుకూల ఫలితాల సాధనలో ఎంతో కీలకమైన అంశమయింది. ఔషధాలు, ఇతర మందులతోపాటు, కొన్ని రకాల శస్త్ర చికిత్సలు, కుట్లు వేసే వస్తువుల సేకరణ, పంపిణీని కూడా టి.ఎన్.ఎం.ఎస్.సి నిర్వహిస్తోంది.

**ఎ. ఔషధాల సేకరణ ప్రక్రియ**

ఔషధాల సేకరణ ప్రక్రియ ఇలా ఉంటుంది.

1. తప్పనిసరిగా అవసరమైన ఔషధాల జాబితా (ఇ.డి.ఎల్)ను, అవి అవసరమైన పరిమాణం వివరాలతో అంచనాను రూపొందించటం

అవసరమైన ఔషధాల గురించిన వివరాల్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య సదుపాయాల నుండి తీసుకుంటారు. కొనాల్సిన మందుల ఇ.డి.ఎల్‌ను, పరిమాణాన్ని ఏటా నవంబర్‌లో జరిగే ఔషధ కమిటీ సమావేశంలో తేల్చిన వివరాల ఆధారంగా టి.ఎన్.ఎం.ఎస్.సి ఔషధ కమిటీ నిర్ధారిస్తుంది.

**ఔషధ కమిటీలో వీరు సభ్యులుగా ఉంటారు:**

1. వైద్య విద్య డైరెక్టర్
2. వైద్య, గ్రామీణ ఆరోగ్య సేవల డైరెక్టర్
3. ప్రజారోగ్య, నివారణ వైద్య విభాగ డైరెక్టర్
4. వైద్య, ఆరోగ్య సేవలు (ఇ.ఎస్.ఐ) డైరెక్టర్
5. కుటుంబ సంక్షేమం డైరెక్టర్
6. ఔషధ నియంత్రణ డైరెక్టర్

7. ప్రధాన ఫిజీషియన్

8. స్పెషలిస్టులు, సర్జన్లు

ఔషధ కమిటీ పెద్దగా వినియోగంలో లేని, అసలు వినియోగించని, కాలం చెల్లిన మందులు, ఔషధ వస్తువులను అంచనా వేసి, వాటిని ఇ.డి.ఎల్ నుండి తొలగించటంపై కూడా సూచనలిస్తుంది. ఆరోగ్య సదుపాయాల్లో గుర్తించిన అవసరాలకనుగుణంగా ఇ.డి.ఎల్‌లో కొత్త మందుల్ని చేర్చవచ్చు. ముందు సంవత్సరం కొనుగోళ్లు, వినియోగాలు ప్రాతిపదికగా ఎంత పరిమాణంలో మందుల కొనుగోలు అవసరమో ఔషధ కమిటీ నిర్ణయిస్తుంది.

**2. టెండర్ ప్రక్రియ**

టెండర్ ప్రక్రియ రెండంచెల్లో ఉంటుంది. మొదటిది, సాంకేతిక బిడ్, దాన్ని అనుసరించి ధరల బిడ్. 'సాంకేతిక బిడ్'లు, ప్రధానంగా అవసరమైన అన్ని పత్రాలనూ సమర్పించారని ధృవీకరించుకోవటం కోసం. టెండర్ వేసినవారు/వారి ప్రతినిధుల సమక్షంలో వాటిని తెరిచి ప్రాథమికంగా పరిశీలిస్తారు. నిర్దిష్ట అంశాలకు సంబంధించిన సమగ్ర వివరాలను ఆ తర్వాత ప్రధాన కార్యాలయంలో తనిఖీ చేస్తారు.

టెండరుదారుల తయారీ కార్యాలయాన్ని భౌతికంగా తనిఖీ చేయటం రెండోదశగా ఉంటుంది. టెండర్‌లో మొదటిసారి పాల్గొన్న వారిని, అంతకుముందు జాబితాలో ఉన్న సరఫరాదారుల్ని కూడా ఈ రకమైన తనిఖీ చేస్తారు. మంచి ఉత్పాదక పద్ధతులు (జి.ఎం.పి), వారి ఉత్పత్తి సామర్థ్యాలకనుగుణంగా బేరీజు వేస్తారు. ఔషధ నియంత్రణ కార్యాలయం, వైద్య విద్య డైరెక్టర్, వైద్య, గ్రామీణ ఆరోగ్య సేవల డైరెక్టర్ వంటి వినియోగ (యూజర్) విభాగాల నుండి అధికారులతో తనిఖీ బృందాన్ని ఏర్పరుస్తారు.

సాంకేతిక బిడ్ అంచనా, తనిఖీ బృందం సిఫార్సుల ఆధారంగా రూపొందించిన తుది జాబితాలోని టెండరుదారుల నుండి ధరల బిడ్లను ఆహ్వానిస్తారు. పాల్గొన్న ప్రతి టెండరుదారుడు నిర్ధారించిన (కోట్ చేసిన) ధరలను మిగిలిన వారితో పంచుకుంటారు. అన్ని ఔషధాలు, వైద్య వస్తువులకు కనిష్ట ధరలను ధృవీకరించి, అదే రోజున ప్రచురిస్తారు. సంబంధిత టెండరుదారులను పిలిచి బేరసారాలు సాగిస్తారు. టెండరుదారులకు కాంట్రాక్టులు ఇవ్వటానికి బోర్డు ఆమోదమే తుది ప్రాతిపదిక.

**3. ఔషధాల సేకరణ**

కొనుగోలు ఆర్డర్లను తప్పనిసరి ఔషధాలకు, శస్త్ర చికిత్స పరికరాలకు నెలవారీ పెడతారు. కుట్లు వేసే వస్తువులకు ప్రతి రెండు నెలలకోసారి ఆర్డర్ పెడతారు. గిడ్డంగుల్లో నాలుగు నెలలకు సరిపడా నిల్వలు ఉంటూ, మరో రెండు నెలలకు సరిపడా నిల్వలు సేకరణ దశలో ఉండేలా ఏర్పాట్లు చేస్తారు. నెమ్మది వినియోగ రకాలపై కంటే.. ఎక్కువగా వినియోగించే మందులపై ఎక్కువ దృష్టి పెడతారు.

ప్రతి ఔషధ కొనుగోలు పరిమాణాన్ని ఈ దిగువ గరిష్టాలను పరిగణలోకి తీసుకుని ఖరారు చేస్తారు –

ఎ. అంతకుముందు 3 ఏళ్లు (ఇ.డి)/ 5 ఏళ్ల (శస్త్ర చికిత్సలు, కుట్లు) సగటు

బి. తక్షణ 365 రోజుల వినియోగం

సి. గిడ్డంగుల్లో అందుబాటులో ఉన్న నిల్వలు

డి. సరఫరాదారుని నుండి సిద్ధంగా ఉన్నవి

ఇ. గిడ్డంగుల మధ్య నిల్వల సర్దుబాటు

టెండర్ నిబంధన ప్రకారం, నిర్దేశిత గడువులోగా సరఫరాదారుడు సరకుల్ని పంపించాలి. లేకుంటే, తదుపరి ఆర్డర్లను సరఫరాదారుడు కోల్పోతాడు, సంబంధించిన ఖర్చుల్ని కూడా భరించాల్సి ఉంటుంది.

**4. నాణ్యతా నియంత్రణ**

సరఫరాదారుడు సరకు ఇచ్చిన రోజునే వాటిలో ఎంపిక చేసిన శాంపిళ్లను పరీక్ష నిమిత్తం వివిధ జాబితా ల్యాబొరేటరీలకు పంపుతారు. ఆరోగ్య సదుపాయాల్లో పంపిణీకి విడుదల చేసే ముందు, మొత్తం నిల్వల సరకులన్నీ నాణ్యతా పరీక్షలో ఆమోదం పొందాలనేది ముందస్తు నిబంధన. ఒకవేళ పరీక్షలో ఏదైనా శాంపిల్ విఫలమైతే, సంబంధిత నిల్వను పంపిణీ చేయకుండా నిలిపివేయాలని, నాణ్యతా నియంత్రణ విభాగం నుండి ఆమోదం వచ్చేవరకూ ఆ సరకును మిగిలిన నిల్వల నుండి వేరు చేయాలని గిడ్డంగులకు తెలియచేస్తారు. నాణ్యతా పరీక్షలో విఫలమైనట్లు తేలితే, సరకును తిరిగి సరఫరాదారునికి పంపుతారు. వైఫల్యానికి కారణం తీరుని బట్టి, నిబంధనలను అనుసరించి సరఫరాదారుని బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు.

ఆరోగ్య సదుపాయాలలో నిల్వల నుండి ఆరోగ్య ఇన్‌స్పెక్టర్లు సేకరించిన శాంపిళ్లు కూడా నాణ్యతా పరీక్షలో విఫలమవ్వవచ్చు. అటువంటి పరిస్థితిలో, సరకు సరఫరాను వెంటనే నిలుపు చేయమని, అప్పటికే ఆరోగ్య సదుపాయాలకు పంపిణీ చేసిన ఔషధాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని గిడ్డంగులకు ఆదేశాలిస్తారు.

**5. సరఫరాదారులకు ఆటోమేటెడ్ చెల్లింపులు**

సరఫరాదారులకు చెల్లింపులు సహా అన్ని ఆర్థిక లావాదేవీలు రాష్ట్ర స్థాయిలోనే జరుగుతాయి. ఆర్థిక నిర్వహణ మొత్తం యాంత్రిక పద్ధతిలోనే జరుగుతుంది. నాణ్యతా పరీక్షలో ఆమోదం పొందినట్లు నివేదిక రాగానే.. చెల్లింపు మొత్తం యథావిధిగా వెంటనే ఎలక్ట్రానిక్‌గా బదిలీ అయ్యే ఏర్పాటుతో ఆర్థిక నిర్వహణను ఆటోమేట్ చేశారు.

(ఇంకా ఉంది. . . )




## ప్రతి పనికీ నాయకత్వ లక్షణాలు అవసరం

ఎంతోకొంత నాయకత్వ లక్షణాల అవసరంలేని పని, రంగమంటూ ఉండవని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ క్రమంలో మనం పెంపొందించుకునే వ్యక్తిత్వం, ఆలోచనా విధానం భవిష్యత్తులో అడుగడుగునా ఉపయోగపడతాయన్నారు. నాయకులు కావాలనుకోవటం, ఎలాగోలా గెలవాలనుకోవటం కన్నా.. చేసే పనిలో నాయకత్వ లక్షణాల్ని ప్రదర్శించగలగటం, నేర్చుకోవటం, ఇతరులతో సంఘటితంగా లక్ష్యం దిశగా అడుగులు వేయటం వంటివి అలవరచుకుంటే నిజమైన విజయాలు సాధ్యమవుతాయన్నారు. విద్యుత్ బల్బ్‌ను కనుగొనటంలో తాను విఫలం కాలేదని, బల్బ్ ఎలా తయారుచేయకూడదో 99 పద్ధతుల్ని కనుగొన్నానని థామస్ ఎడిసన్ అన్న మాటల్ని ఆకళింపు చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాయకత్వంపై విద్యార్థులతో సంభాషించారు.









RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th September, 2023 Posting Date 15 &16th of every month



# భారత్ ఎదుర్కొంటున్న నైతికత, విలువల సవాలు

వ్యక్తి ఆశలకి, సమాజ హితానికి మధ్య సమన్వయం ఉండటమే నిజమైన నైతికత అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ రకమైన నైతికత కోసం మన సమాజంలోని కుటుంబ వ్యవస్థ, ఆధ్యాత్మిక విలువలు వంటి అంతర్గత బలాలు గణనీయంగా దోహదం చేస్తున్నప్పటికీ, ధర్మనిరతిలో భారతీయులు ప్రపంచంలో ఎవరికీ తీసిపోనప్పటికీ.. మంచిని ప్రోత్సహిస్తూ చెడును నిరుత్సాహపరిచే వ్యవస్థీకృత ఏర్పాట్లలో మన ప్రభుత్వాలు విఫలమవటం మనం ఎదుర్కొంటున్న పెద్ద సవాలన్నారు. 'పరిపాలన- నైతికత, విలువలు' అంశంపై ఒడిషాకు చెందిన ఫీల్డ్ డెవలప్‌మెంట్ అధికారులనుద్దేశించి హైదరాబాద్ ఐఎస్‌బీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ వల్ల కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న నేపథ్యంలో రాజ్యం పాత్ర మరింత కీలకంగా మారిందన్నారు. అవినీతి, ఎన్నికల వ్యవస్థలో ఓట్ల కొనుగోలు, పాత పెన్షన్ విధానం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు పొంచి ఉన్న ప్రమాదం, వచ్చే పాతికేళ్లలో యువ భారత్ ఆశిస్తున్న లక్ష్యాల్ని సాధించటానికి విధిగా అమలు చేయాల్సిన ఆచరణసాధ్య సంస్కరణలు మొదలైన అంశాలపై జేపీ స్పష్టతనిచ్చారు.

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**